




Published From Hyderabad, Mahabubnagar and Kadapa

# వార్తాతరంగాలు

జాతీయ దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :26 | సంచిక :153 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | మంగళవారం 13 అక్టోబర్ 2026 | పేజీలు :12 | వెల రూ5 /-




## సుప్రీం కోర్టును రాజకీయాల్లోకి లాగాలని చూడొద్దు: సీజేఐ

**ఇంటర్నెట్ డెస్క్:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఓట్ల చోరీ అంశాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు వినతి పత్రం సమర్పించేందుకు సోమవారం సమయం ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు సీజేఐను అభ్యర్థించారు. వారి విజ్ఞప్తిని జస్టిస్ సూర్యకాంత్ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ అంశంపై సీజేఐ స్పందించారు. ఇండి కూటమి నుంచి తనకు వచ్చిన అభ్యర్థనపై ఆదివారం రాత్రి కాంగ్రెస్ కీలక నేతలు ఖర్గే, రాహుల్ గాంధీలకు మెయిల్ పంపినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రధాన ఎన్నికల సంఘం విషయంలో వారు లేవనెత్తాలనుకున్న సమస్యలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. విచారణలో ఉన్న అంశాలపై సమావేశం కావడం అధికారాల విభజన సూత్రానికి విరుద్ధమని సీజేఐ తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశాలపై రాజకీయ నేతలతో సమావేశం కావాల్సిన అవసరం లేదని భావించి, వారికి అపాయింట్‌మెంట్ నిరాకరించినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వ పాలనకు సంబంధించిన - మిగతా3లో

## ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని

# వాడుకుంటున్నారు

: కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్

కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు–బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు–



గిరిజనులు–బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు. ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.



## ఫార్ములా ఈ-కార్ రేస్ కేసు.. ఏసీబీ కోర్టులో కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్

**హైదరాబాద్, అక్టోబర్ 12:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈరోజు(సోమవారం) నాంపల్లి ఏసీబీ కోర్ట్‌లో ఈ పిటిషన్ వేశారు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ వేసిన ఛార్జ్‌షీట్‌లో తన పేరును తొలగించాలని మాజీ మంత్రి కోరారు. నిందితుల జాబితా నుంచి తన పేరును తప్పించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. కేటీఆర్ వేసిన డిశ్చార్జ్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు వచ్చే నెలలో(నవంబర్) విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో A1 నిందితుడిగా కేటీఆర్ పేరును ఏసీబీ అధికారులు ఛార్జ్‌షీట్‌లో చేర్చిన విషయం తెలిసిందే. ఏసీబీ వేసిన ఛార్జ్‌షీట్‌ను న్యాయస్థానం పరిగణలోకి తీసుకుంది. ఈ కేసులో ఇప్పటికే కేటీఆర్ రెండు సార్లు కోర్టు విచారణకు హాజరయ్యారు. ఇప్పుడు తాజాగా ఏసీబీ ఛార్జ్‌షీట్‌లో తన పేరును తొలగించాలంటూ కేటీఆర్ వేసిన డిశ్చార్జ్ పిటిషన్ వేశారు. దీనిపై త్వరలోనే ఏసీబీ కోర్ట్ విచారణ చేయనున్నట్లు సమాచారం. - మిగతా3లో

# ఇది ఓట్ల దొంగతనమే

మంత్రి శ్రీధర్ బాబు



ఓటర్ల జాబితా సవరణపై ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన

ఆందోళనలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, నేతలు

సీఈసీని తొలగించాలని డిమాండ్

**ఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో భారీ నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని ఆరోపిస్తూ, సుప్రీంకోర్టు వరకు మార్చ్ చేస్తామని ఈ సందర్భంగా నేతలు హెచ్చరించారు. ఏఐసీసీ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ ను అడ్డుపెట్టుకుని, తమకు వ్యతిరేకంగా ఉన్న అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తోందని, ఇది ఓట్ల దొంగతనమేనని తీవ్రంగా విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఈసీని పదవి నుంచి తొలగించే వరకు తమ పోరాటం ఆగదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. హిందుస్థాన్ టైమ్స్, పీటీఐ కథనాల ప్రకారం, సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారని రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో ఓట్లు తొలగించడం దారుణమని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. 'ఓట్ బచావో, దేశ్ బచావో' నినాదంతో ఈ దేశవ్యాప్త ఆందోళనను కాంగ్రెస్ ఉద్ధృతం చేసింది.

## సింగూరు ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటి

హరీశ్ రావు



**హైదరాబాద్, అక్టోబర్ 12:** కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు(సోమవారం) మీడియాతో మాట్లాడుతూ.. రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడానికి కాంగ్రెస్‌కు మనసు లేదని మండిపడ్డారు. పంటలు వేయొద్దంటే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రైతు కూలీలు ఎలా బతకాలి.. వలసలు పోవాలా అని నిలదీశారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు వలసలు వాపస్ వచ్చాయని.. ఇప్పుడు మళ్లీ వలసలు మొదలయ్యాయని విమర్శించారు. రైతులు డీజిల్ ఇంజిన్‌లు పెట్టుకుని పంటలను కాపాడుకుంటున్నారని.. ప్రతి దానికీ ఎల్‌నినోతో లింక్ పెడుతున్నారని మాజీ మంత్రి మండిపడ్డారు. బొగ్గు లేదంటే కూడా ఎల్‌నినో అంటున్నారన్నారు. సర్కార్ నిర్లక్ష్యం వల్లే రాష్టానికి ఈ పరిస్థితి వచ్చిందని విరుచుకుపడ్డారు. దేవాదులలో మోటార్లు ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు. సింగూరు ప్రాజెక్ట్‌లో వాడుకునేందుకు రెండు టీఎంసీల నీరు మాత్రమే ఉందని తెలిపారు. ఆ నీళ్లను కూడా బీర్ల కంపెనీలకు ఇస్తున్నారని ఆరోపించారు. దసరా లిక్కర్‌కు షార్టేజ్ రావొద్దని వాళ్లకు నీళ్లు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యమని ప్రశ్నించారు. సింగూరుపై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటని ప్రశ్నించారు. పంటల కోసం జూరాల గేట్లు తెరిస్తే రైతులను జైలుకు పంపారని.. తాగునీరు ఇవ్వకుండా బీర్ల కంపెనీలకు నీళ్లు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కేసులు పెట్టాలని హరీశ్ డిమాండ్ చేశారు. నీళ్లుండి కూడా ఎత్తని ప్రభుత్వం ఇది అంటూ మండిపడ్డారు. రైతులతో గంట సేపు మాట్లాడే సమయం ముఖ్యమంత్రికి లేదా అంటూ ప్రశ్నించారు. బీర్ల కంపెనీలకు నీళ్లు, ఢిల్లీలో రాజకీయాలు తప్ప ఈ ప్రభుత్వానికి ఇంకో పని లేదని హరీశ్ రావు విమర్శించారు.

## జ్ఞానేశ్ కుమార్ తొలగింపుపై కేరళం అసెంబ్లీ తీర్మానం



**ఇంటర్‌నెట్ డెస్క్:** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ కేరళం అసెంబ్లీ సోమవారం ఒక తీర్మానాన్ని పాస్ చేసింది. భారత ఎన్నికల సంఘంలో పారదర్శకత తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని కోరింది. ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి అధికార కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్), ప్రతిపక్షం సీపీఎం నేతృత్వంలోని - మిగతా3లో

## పొన్నం సవాల్ ను

# స్వీకరిస్తున్నా..

ఏ సమయానికి వస్తారో చెప్పండి

రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) కార్యాలయం వద్దకు నేను వస్తా..

మంత్రి పొన్నం ప్రభాకర్ కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాశీచందర్ రావు ప్రతి సవాల్

**హైదరాబాద్ అక్టోబర్ 12:** పొన్నం సవాల్ ను స్వీకరిస్తున్నా.. ఏ సమయానికి వస్తారో చెప్పండి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) కార్యాలయం వద్దకు నేను వస్తా..మంత్రి పొన్నం ప్రభాకర్ కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాశీచందర్ రావు ప్రతి సవాల్ విసిరారు.

**బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆయాన్స్ మీడియా సమావేశం లో మాట్లాడుతూ**
ఓట్లు తొలగించారంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు నాకు విసిరిన సవాల్‌ను నేను స్వీకరిస్తున్నాను, ఆయన



ఛాలెంజ్‌కు నేను పూర్తిగా - మిగతా3లో

## 200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో

# టచ్‌లో ఉన్నారు..

రాహుల్ సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,అక్టోబరు 12:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన తనకు సందేశాలు పంపిస్తున్నారని వెల్లడించారు. "మీరు చేసిన తప్పును అంగీకరించి అప్రూవర్‌గా మారండి. మీరు ప్రధాన నేరస్థుడు కాదు. మీ వెనుక అసలు సూత్రధారులు ఉన్నారు" అని జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్ష కూటమి చేపట్టిన మార్చ్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ - మిగతా3లో

వార్తాతరంగాలు



# సంపాదకీయం

## జ్ఞానేశ్ ఇష్యూలో కాక్రోచ్‌లకు కాంగ్రెస్ షాక్

కాక్రోచ్ జనతా పార్టీ నుంచి కాంగ్రెస్‌ను కాపాడుకునేందుకు రాహుల్ వేస్తున్న ఎత్తుగడలు ప్రస్తుతానికి తిరుగులేని ఫలితాలనిస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజీ ఉద్యమం సందర్భంగా జంతర్ మంతర్ వద్ద బైఠాయించి, ఏకంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కారణమైన కాక్రోచ్ జనతా పార్టీ విపక్ష స్పేస్‌లో అప్పట్లో భారీ మైలేజీని కొల్లగొట్టింది. విద్యార్థి, యువజన ఉద్యమాలను తమ ఖాతాలో వేసుకుంటూ ఆ పార్టీ సృష్టించిన ప్రభంజనం కాంగ్రెస్ ఉనికికే సవాలుగా నిలిచింది. సరిగ్గా అదే అనుభవాన్ని దృష్టిలో పెట్టుకున్న హస్తం పార్టీ అగ్రనాయకత్వం.. కేంద్ర ఎన్నికల సంఘం వివాదంలో ఆ తప్పు మళ్లీ జరగకూడదని పక్కా వ్యూహంతో బరిలోకి దిగింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను టార్గెట్ చేస్తూ కాక్రోచ్‌లు మొదలుపెట్టిన నిరసన స్వరాన్ని కాంగ్రెస్ తెలివిగా తన అధీనంలోకి తీసుకుంది.ప్రస్తుతం జాతీయ మీడియాలోనూ, సోషల్ మీడియా ట్రెండ్స్‌లోనూ కేవలం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల గురించే చర్చ సాగుతోంది. ఆకాశవాణి భవన్ ఆవరణలో 9 గంటల పాటు చెట్టు కింద బైఠాయించడం, జంతర్ మంతర్ వద్ద ప్రియాంక గాంధీ నడిరోడ్డుపై పడుకుని నిరసన తెలపడం, రాహుల్ గాంధీ ఎఫ్ఐఆర్‌లు నా మెడల్స్ అంటూ దూకుడుగా స్టేట్‌మెంట్లు ఇవ్వడం వంటి పరిణామాలు కాక్రోచ్ పార్టీ పిలుపునిచ్చిన ఆందోళనలను పూర్తిగా నీరుగార్చాయి. కేవలం నిరసనలకే పరిమితం కాకుండా.. రోజూ ఏపీలోని పార్లమెంట్ సభ్యుల నుంచి మొదలుకొని అగ్రనేతల వరకు ఎవరు ఎప్పుడు రోడ్డెక్కాలి, ఎక్కడ డిటెన్షన్ కావాలనే పక్కా డైలీ షెడ్యూల్‌ను కాంగ్రెస్ ముందే సిద్ధం చేసుకుని నడిపిస్తోంది. ఫలితంగా, ఉద్యమ పార్టీగా పేరున్న కాక్రోచ్‌ల నిరసనలకు మీడియాలో కనీస ప్రాధాన్యత కూడా దక్కని పరిస్థితి తలెత్తింది.ధర్మేంద్ర ప్రధాన్ వ్యవహారంలో ఆ ఘనత మొత్తం కాక్రోచ్‌ల ఖాతాలోకి వెళ్లిపోవడంతో చేతులు కాలిన కాంగ్రెస్.. జ్ఞానేశ్ కుమార్ ఇష్యూలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఒకవేళ భవిష్యత్తులో రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సీఈసీ రాజీనామా చేయడమో లేక కేంద్రం దిగిరావడమో జరిగితే.. ఆ విజయం కేవలం కాంగ్రెస్ పార్టీ , ఇండియా కూటమి పోరాటం వల్లే సాధ్యమైందనే నేరేటివ్‌ను ప్రజల్లో బలంగా నాటడమే రాహుల్ టీమ్ అసలు లక్ష్యం. సీఈసీ అంశంపై తాము రోడ్లపైకి వచ్చి అరెస్టులు కావడం ద్వారా.. కాక్రోచ్ పార్టీని కేవలం అండర్‌గ్రౌండ్ కార్యకర్తల స్థాయికే పరిమితం చేసి, తామే అసలైన ప్రజాస్వామ్య పోరాట శక్తులమని దేశానికి చాటడంలో కాంగ్రెస్ వ్యూహం ముందడుగు వేసింది.ఈ ఆధిపత్య పోరులో కాక్రోచ్‌లు అంత సులభంగా వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. అక్టోబర్ 10న జంతర్ మంతర్‌ను భారీ ఎత్తున ముట్టడిస్తామని వారు ఇప్పటికే గడువు విధించి, తమ శ్రేణులను ఢిల్లీకి తరలించే సన్నాహాల్లో ఉన్నారు. కానీ, ఆ ముట్టడి రోజున కూడా కాంగ్రెస్ ఊరికే కూర్చునే అవకాశం కనిపించడం లేదు. అప్పటికే పార్లమెంట్ సభ్యులు, కూటమి సీనియర్ నేతలతో కలిసి మరింత పెద్దఎత్తున ప్రత్యక్ష నిరసనలను హోరెత్తించి, కాక్రోచ్‌ల కార్యక్రమాన్ని పూర్తిగా హైజాక్ చేయడానికి కాంగ్రెస్ గ్రౌండ్‌వర్క్ సిద్ధం చేస్తోంది. బీజేపీతో నేరుగా తలపడటంతో పాటు.. విపక్ష స్థానాన్ని ఆక్రమించాలనుకుంటున్న కాక్రోచ్‌లను వెనక్కి నెట్టి, తనే ఏకైక ప్రత్యామ్నాయ శక్తి అని నిరూపించుకోవడమే కాంగ్రెస్ అసలు రాజకీయ పోరాటంగా మారిం జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఢిల్లీ ముట్టడికి పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేతో పాటు ముఖ్య నేతలు సౌరభ్ దాస్, అశుతోష్ రాంకాలను కోర్టు విడుదల చేసింది. శనివారం విమానం దిగగానే విమానాశ్రయం నుంచే వారిని ముందస్తుగా కస్టడీలోకి తీసుకున్న పోలీసులు, ఆదివారం ఉదయం ఢిల్లీ క్యాంట్ మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. ఏడాది పాటు దేశంలో ఎలాంటి శాంతిభద్రతల విఘాతానికి లేదా శాంతిభంగానికి పాల్పడకూడదనే కఠిన షరతుపై రూ.50,000 ముందస్తు బెయిల్ బాండ్‌తో కోర్టు వారికి ఉపశమనం కల్పించింది.ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ సిజెపి ఈ ఆందోళనకు పిలుపునిచ్చింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాలని భావించినప్పటికీ, పోలీసులు విమానాశ్రయంలోనే దిప్కే బృందాన్ని అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. విమానం లోపలికే వచ్చి పోలీసులు తమను అరెస్టు చేస్తున్న దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన దిప్కే, ఇది అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు.జంతర్ మంతర్ వద్ద జనం గుమిగూడకుండా నగరవ్యాప్తంగా భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసిన ఢిల్లీ పోలీసులు, నిరసనకారులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. శనివారం నాటి ఆందోళనల్లో పలువురు ప్రముఖ రాజకీయ నాయకులతో పాటు సుమారు 3,000 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని అర్ధరాత్రి వేళ విడుదల చేశారు. యూట్యూబర్ ధ్రువ్ రాఠీని కూడా శనివారం రాత్రి పొద్దుపోయాక పోలీసులు విడుదల చేశారు.సిజెపి అగ్రనేతలు విడుదలైనప్పటికీ, ఢిల్లీ వ్యాప్తంగా ఇంకా పోలీసుల పహారా కొనసాగుతోంది. రాజధానిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండటానికి ముందుజాగ్రత్త చర్యలు కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు. మరోవైపు, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్నారని విమర్శిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నేతలు తమ పోరాటాన్ని చట్టబద్ధంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ఖమ్మం జిల్లాలో నేత్రపర్వంగా శ్రీవారి ఆలయ భూమిపూజ మహోత్సవం

**ఖమ్మం జిల్లా, అక్టోబరు 12:**ఖమ్మం నగరంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ భూమిపూజ మహోత్సవాన్ని ఈరోజు (సోమవారం) అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఈ మహోత్సవ ఏర్పాట్లను స్వయంగా మంత్రి తుమ్మల పర్యవేక్షించారు. 50 వేల మంది భక్తులకు భోజనం, స్వామివారి మహాప్రసాదం అందజేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న రామానుజ చిన్నజీయర్ స్వామివారి పర్యవేక్షణలో భూమిపూజ మహోత్సవం, శిలాన్యాస పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల, టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు.

**శ్రీవారి ఆలయం నిర్మించడం తన పూర్వజన్మ సుకృతం: మంత్రి తుమ్మల**

ఖమ్మంలో ఈ ఆలయం నిర్మించడం తన పూర్వజన్మ సుకృతమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. ఈ మహత్కార్యానికి, భద్రాచల రామాలయం పునర్నిర్మాణానికి చిన్న జీయర్ స్వామి అంకురార్పణ చేశారని ప్రస్తావించారు. వేంకటేశ్వరస్వామి నిర్మాణం చిన్నజీయర్ స్వామి మంగళాశాసనంతో జరుగుతోందని తెలిపారు. చిన్న జీయర్ స్వామి ఆశీస్సులతో ఏ కార్యక్రమం చేపట్టిన దిగ్విజయం అవుతుందని వ్యాఖ్యానించారు.ఖమ్మంలో శ్రీవారి ఆలయ



నిర్మాణానికి సహకరించిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడులకు కృతజ్ఞతలు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు యావత్ భారతదేశం సుభిక్షంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ఈ ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల విశేషంగా కృషి చేశారు: చిన్నజీయర్ స్వామి ఈ ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేషంగా కృషి చేశారని శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్నజీయర్ స్వామి వ్యాఖ్యానించారు. ఈ మహోత్సవంలో పాల్గొనడం తనకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మంత్రి తుమ్మలది ధార్మిక కుటుంబమని.. వారికి శ్రీవారు ఎల్లవేళలా అండగా ఉండాలని మంగళాశాసనం చేస్తున్నామని అన్నారు. ఖమ్మంలో ఆరాధనలు అందుకోవటానికి ఇక్కడకు రావటం జరిగిందని తెలిపారు. శిలాన్యాస కార్యక్రమంలో మనమంతా పాల్గొనడం అదృష్టమని చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లా రెండు తెలుగు రాష్ట్రాలకు మధ్యలో ఉందని వెల్లడించారు. ఇరు రాష్ట్రాలు రాజకీయంగా వేర్వేరు అయినా భక్తి విషయంలో ఒక్కటేనని చెప్పారు. ఖమ్మంలో టీటీడీ ఆలయం నిర్మించడానికి ముందుకు వచ్చి అనుమతి ఇచ్చిన ఛైర్మన్ బీఆర్ నాయుడుకు మంగళాశాసనం చేస్తున్నామని అన్నారు. శ్రీనివాసుడు ఖమ్మంలో మొదటి అడుగు వేశారని తెలిపారు. శ్రీవారు ఆశ్వీజమాసం (సోమవారం) తిరుమల కొండపైకి వచ్చారని ప్రస్తావించారు. ఇవాళ ఖమ్మంలో స్వామి అడుగుపెట్టారని అన్నారు. రామానుజచార్యులవారు ప్రతి శుక్రవారం అభిషేకం చేసే క్రతువు ఏర్పాటు చేశారని చిన్నజీయర్ స్వామి వెల్లడించారు.పట్టువదలని విక్రమార్కుడిలా మంత్రి తుమ్మల ఈ ఆలయ నిర్మాణానికి కృషి చేశారు: బీఆర్ నాయుడు భారతదేశవ్యాప్తంగా ఐదువేల ఆలయాలను నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించిందని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వ్యాఖ్యానించారు. పట్టువదలని విక్రమార్కుడిలా మంత్రి తుమ్మల ఈ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి కృషి చేశారని కొనియాడారు. అస్సాం, బిహార్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో శ్రీనివాసుడి ఆలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ ఆలయ నిర్మాణానికి ఇంత విలువైన భూమి కేటాయించడం సంతోషమని అన్నారు. శ్రీవారి నిర్మాణానికి భక్తులు విశేషంగా సహకారం అందిస్తున్నారని బీఆర్ నాయుడు తెలిపారు.

# కపిల్ సిబల్ విశ్వాసాన్ని నిలబెడతాం

**సుప్రీంకోర్టు అసాధారణ భరోసా**

**ఢిల్లీ:**న్యాయవ్యవస్థపై సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ వ్యక్తం చేసిన అసంతృప్తిపై సుప్రీంకోర్టు అసాధారణ రీతిలో స్పందించింది. "ఈ వ్యవస్థపై సిబల్ విశ్వాసాన్ని పునరుద్ధరించడానికే మేమిక్కడున్నాం" అని వ్యాఖ్యానిస్తూ, ఆయన నమ్మకాన్ని తిరిగి నిలబెడతామని స్పష్టం చేసింది. ఢిల్లీలో పోలీసుల ఆంక్షలకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ జరిపిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం, పలువురిని నిర్బంధంలోకి తీసుకోవడంపై కపిల్ సిబల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనకు ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఓటర్ల జాబితాలో అవకతవకలపై పదేపదే సుప్రీంకోర్టును ఆశ్రయించి అలసిపోయానని, ఇక కోర్టుకు వెళ్లడం వల్ల ప్రయోజనం




లేదనిపిస్తోందని అన్నారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, ప్రజల హక్కుల కోసం న్యాయవాదులు పోరాడుతూనే ఉండాలని స్పష్టం చేశారు.శాంతియుతంగా నిరసన తెలిపితే ప్రభుత్వానికే ప్రమాదం ఉన్నట్టుందనిపిస్తోందని సిబల్ విమర్శించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించడాన్ని ఆయన ప్రశ్నించారు. కర్ణాటక, పశ్చిమ బెంగాల్ నుంచి రైళ్లు, విమానాల్లో వస్తున్న వారిని కూడా మార్గమధ్యంలోనే అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. నిరసనకారులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని, దాదాపు 28 బెటాలియన్ల కేంద్ర, ఢిల్లీ పోలీసు బలగాలను మోహరించి నగరాన్ని దిగ్బంధం చేశారని అన్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదివారం జరిపిన విచారణలో కీలక ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ వ్యాప్తంగా బారికేడ్లను తొలగించి, ప్రజల స్వేచ్ఛాయుత రాకపోకలకు వీలు కల్పించాలని సూచించింది. మెట్రో సర్వీసులు, ఇంటర్నెట్ కనెక్టివిటీని సాధారణ స్థితికి తీసుకురావాలని ఆదేశించింది. న్యాయవాదులు తమ వృత్తిపరమైన విధులను నిర్వర్తించకుండా ఎవరూ అడ్డుకోరాదని స్పష్టం చేసింది. ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాలు, పౌర సమాజ కార్యకర్తలు ఈ నిరసన చేపట్టారు. ఈ ఘటనలో యోగేంద్ర యాదవ్, ప్రశాంత్ భూషణ్, నేహా బోరా సహా దాదాపు 200 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

# ప్రజల గుండెల నిండుగా పదేండ్ల పండుగ

**- బీఆర్ఎస్ నాయకులు**

**పెద్దపల్లి:**యువత శారీరక దృఢత్వాన్ని అలవర్చుకుని క్రీడలతో పాటు కెరీర్‌లోనూ ఉన్నత స్థాయికి ఎదగాలని బీఆర్ఎస్ నాయకురాలు, బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష పిలుపునిచ్చా రు. జిల్లా ఆవిర్భవించి 10 సంవత్సరాలు విజయవం తంగా పూర్తయిన సందర్భంగా పెద్దపల్లి ప్రజల గుండెల నిండుగా పదేండ్ల పండుగ వాతావరణం నెలకొందని, ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన 5కే రన్ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉద్యమ నేత సత్యనారాయణ రెడ్డితో కలిసి ఆమె ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ప్రజలకు నిరంతరం సేవలందించాలన్నా, జీవితంలో సాధించాలన్నా శారీరక దారుఢ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. గత ఎన్నికల ప్రచార ఒత్తిడి వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు, నొప్పులు రావడంతో రెండు నెలల పాటు బెడ్‌రెస్ట్ తీసుకోవాల్సి వచ్చిందని,ఆ అనుభవంతోనే యువతలో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై చైతన్యం తేవడానికి ఫిట్ అండ్ ఫ్యూచర్ క్లబ్ ను ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో ని దాదాపు 54 గ్రామాల్లో యువతతో కలిసి మార్నింగ్ వాక్, రన్నింగ్ కార్యక్రమాలు చేపట్టామని, ఆ సంకల్పంతోనే నేడు విజయవంతంగా 5 కిలోమీటర్ల పరుగును పూర్తి చేశామన్నారు. పెద్దపల్లి జిల్లా ఏర్పడి నేటికి పదేండ్లు పూర్తయిన శుభవేళ జిల్లా సాధించిన ప్రగతిని గుర్తుచేస్తూ,ఈ పదేండ్ల కాలంలో మాతా-శిశు సంరక్షణ ఆసుపత్రి, సమీకృత కలెక్టరేట్, మినీ ట్యాంక్ బండ్, గ్రామాల్లో అంతర్గత రహదారులు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కాళేశ్వరం ప్రాజెక్టు లాంటి అద్భుతమైన మౌలిక వసతులు అభివృద్ధి చెందాయని,ధూళికట్ట బౌద్ధ స్తూపం, సబితం జలపాతం, రామగుండం,కాల్వ శ్రీరాంపూర్ వంటి ప్రకృతి రమణీయమైన పర్యాటక ప్రాంతాలు జిల్లా సొంతమని హర్షం వ్యక్తం చేశారు.స్థానిక యువతకు అత్యుత్తమ ప్రతిభ ఉందని,గతంలో నిర్వహించిన డేటా సైన్స్ శిక్షణ ద్వారా దాదాపు 120 మంది ప్రముఖ ఎంఎన్‌సీల లో లక్షల వార్షిక ప్యాకేజీల తో ఉద్యోగాలు సాధించడ మే ఇందుకు నిదర్శనమన్నా రు. రాబోయే రోజుల్లో పెద్దపల్లిలో ఐటీ టవర్,టి-హబ్, మహిళల కోసం ప్రత్యేక ఉపాధి కల్పన పరిశ్రమలతోపాటు క్రీడాకా రుల కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్, సుల్తానాబాద్ మినీ స్టేడియం



ఆధునీకరణ వంటి సదుపాయాలు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ ఉద్యమ నాయకులు సత్యనారాయ ణ రెడ్డి,బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు నల్లవెల్లి శంకర్,నాయకులు పాడాల సతీష్,అడ్వకేట్ శ్రీధర్,ఫిట్ అండ్ ఫ్యూచర్ క్లబ్ ప్రతినిధులు రాహుల్, హనీలతో పాటు పెద్ద సంఖ్యలో యువతీ యువకులు,ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# తెలుగు గంగ నీటిపై చర్చలు

తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వస్తున్న తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ పర్యటన తెలుగు, తమిళ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. ప్రతిష్టాత్మక విజయవాడ ఉత్సవ్ 2.0 సాంస్కృతిక వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్య అతిథిగా విజయ్ విచ్చేస్తున్నప్పటికీ.. ఈ పర్యటనకు చాలా ప్రాధాన్యత ఉంది. ఇరు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న అంతర్రాష్ట్ర సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో విజయ్ ప్రత్యేకంగా చర్చలు జరపనున్నారు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కూడా సీఎం విజయ్ ముఖాముఖి భేటీ కానున్నారు.ఈ భేటీలో ప్రధానంగా చర్చకు రానున్న అంశం తెలుగు గంగ నీటి పంపకాలు. చెన్నై నగర దాహార్తిని తీర్చేందుకు ఉద్దేశించిన చారిత్రక ఒప్పందం ప్రకారం తమిళనాడుకు సరైన కోటాలో కృష్ణా జలాలు అందడం లేదన్న అసంతృప్తి చెన్నై వర్గాల్లో బలంగా ఉంది. కండలేరు రిజర్వాయర్ నుంచి పూండికి చేరాల్సిన నీటి పరిమాణంలో ఏర్పడుతున్న సాంకేతిక, క్షేత్రస్థాయి అడ్డంకులు, కాల్వల నిర్వహణ, బకాయిలు వంటి సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ ఉన్నత స్థాయి సమావేశం వేదిక కానుంది. తమిళనాడు ప్రజల తాగునీటి అవసరాలకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సీఎం విజయ్ ఏపీ ప్రభుత్వాన్ని కోరనుండగా.. పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు కాంక్షించే చంద్రబాబు సైతం దీనిపై సానుకూల రోడ్‌మ్యాప్‌ను ప్రతిపాదించే అవకాశముంది.నీటి సమస్యలతో పాటు ఈ భేటీకి అత్యంత బలమైన జాతీయ రాజకీయ ప్రాధాన్యత కూడా ఉంది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న వేళ.. ప్రతిపాదిత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయన్న భయం నెలకొంది. ఈ కీలక అంశంపై దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా కేంద్రంతో సమన్వయం చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రయత్నాలు సాగిస్తున్నారు. విజయ్-చంద్రబాబుల చర్చల్లో డీలిమిటేషన్ అంశం ప్రధాన ఎజెండాగా మారనుందని, దక్షిణాది రాజకీయ స్వరాన్ని ఢిల్లీ వేదికగా బలంగా వినిపించేందుకు ఒక ఉమ్మడి కార్యాచరణపై అభిప్రాయాలు పంచుకునే వీలుందని భావిస్తున్నారు.ఇద్దరు సూపర్ స్టార్లు విజయ్ -- పవన్ కల్యాణ్ భేటీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సినిమా రంగంలో అగ్ర హీరోలుగా వెలుగొంది, ప్రజా సమస్యలపై పార్టీలను స్థాపించి ఎన్నికల సమరంలో విజయం సాధించిన ఈ ఇద్దరు నాయకుల ఆలోచనలు, సిద్ధాంతాలు, దక్షిణాది యువత సాధికారత అంశాలు ఈ చర్చల్లో ప్రస్తావనకు వచ్చే వీలుంది. అటు సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొంటూనే, ఇటు కీలకమైన అంతర్రాష్ట్ర వివాదాలు, జాతీయ రాజకీయ సమీకరణాలపై విస్తృత చర్చలు జరపడం ద్వారా సీఎం విజయ్ అమరావతి పర్యటన సరికొత్త సమీకరణాలకు నాంది పలికేలా కనిపిస్తోంది.

# ఐటీ ఉద్యోగులకు పాడ్ ట్యాక్సీ సదుపాయం..

**హైదరాబాద్,అక్టోబరు 12** : హైదరాబాద్‌లో ప్రయాణికుల రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా మార్చేందుకు తెలంగాణ సర్కార్ కీలక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. మెట్రో రైలు దిగిన ప్రయాణికులు స్టేషన్ నుంచి బయటకు రాకుండానే డ్రైవర్ అవసరం లేని 'పాడ్ ట్యాక్సీ'లోకి మారి నేరుగా తమ కార్యాలయాలకు చేరుకునేలా కొత్త రవాణా వ్యవస్థను ప్రతిపాదించింది.ఐటీ కారిడార్, నాలెడ్జ్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, సచివాలయం పరిసరాలను అనుసంధానిస్తూ మొత్తం 40.82 కిలోమీటర్ల మేర పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ) నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. దీనికి సంబంధించిన సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల నివేదికను హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. ప్రాజెక్టు కోసం లీ అసోసియేట్స్ సంస్థ మూడు నెలల పాటు అధ్యయనం చేసింది. తొలుత 44.62 కిలోమీటర్లు, 56.88 కిలోమీటర్ల నెట్‌వర్క్ ప్రతిపాదనలను పరిశీలించి, వాటి ఆధారంగా 40.82 కిలోమీటర్ల హైబ్రిడ్ నెట్‌వర్క్‌ను అనుకూలంగా సూచించినట్లు నివేదికలో పేర్కొన్నారు.ఇందులో కూకట్‌పల్లి--రాయదుర్గం మార్గంలో 7.62 కిలోమీటర్లు, రాయదుర్గం--నాలెడ్జ్ సిటీ మార్గంలో 12.83 కిలోమీటర్లు, రాయదుర్గం/హైటెక్ సిటీ--




ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మార్గంలో 14.01 కిలోమీటర్లు, సచివాలయం--ఎన్టీఆర్ మార్గ్ కారిడార్‌లో 6.36 కిలోమీటర్ల మేర నెట్‌వర్క్ ఉండనుంది. ఈ మార్గాల ద్వారా ఐటీ ఉద్యోగులు, కార్యాలయాలకు వెళ్లే ప్రయాణికులకు చివరి దశ రవాణా సదుపాయం కల్పించాలన్నది ప్రధాన లక్ష్యం.ఈ పాడ్ ట్యాక్సీ నెట్‌వర్క్‌ను దశలవారీగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. 2030 నాటికి 34.66 కిలోమీటర్లు, 2040 నాటికి 39.36 కిలోమీటర్లు, 2050 నాటికి పూర్తి నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రణాళిక. ఈ వ్యవస్థ ద్వారా రోజువారీ ప్రయాణికుల సంఖ్య 2030లో 5.42 లక్షలు, 2040లో 15.47 లక్షలు, 2050 నాటికి 20.31 లక్షలకు చేరవచ్చని నివేదిక అంచనా వేసింది.ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలోని 69 కిలోమీటర్ల మార్గంలో రోజుకు సుమారు ఐదు లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాడ్ ట్యాక్సీలు అందుబాటులోకి వస్తే మెట్రో స్టేషన్ల నుంచి కార్యాలయాలకు చేరుకునే ప్రయాణం మరింత సులభమయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రాజెక్టును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలో ముంబైలోని బాంద్రా--కుర్లా కాంప్లెక్స్ ప్రాంతంలోనూ పాడ్ ట్యాక్సీ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు.హైదరాబాద్ ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం వ్యయం, ప్రయాణికుల టికెట్ ధరలు, నిర్మాణ పనుల ప్రారంభ తేదీ, పూర్తి చేసే గడువు ఇంకా వెల్లడికాలేదు. ఇవి ఖరారైన తర్వాతే ప్రాజెక్టు అమలు తీరుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రతిపాదిత నెట్‌వర్క్ కార్యరూపం దాల్చితే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు మెట్రో నుంచి కార్యాలయాలకు చేరుకునే ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రవాణా సదుపాయం అందుబాటులోకి రావచ్చు

# ఆర్టీసీ ఎన్నికల్లో ఓటమి.. కాంగ్రెస్ సీరియస్!

**హైదరాబాద్ , అక్టోబరు 12:**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అక్టోబర్ 9న ముగిసిన ఆర్టీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు తెలిపిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూ) ఓటమి పాలైనట్లు సమాచారం. దీంతో ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ముఖ్యంగా ఏఐటీయూసీ మద్దతుతో బరిలోకి దిగిన ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) విజయం సాధించడం, అధికార పార్టీకి మింగుడుపడడం లేదు. ఈ పరిణామంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక ప్రజాప్రతినిధుల ఉదాసీనత వల్లే ఆర్టీసీ ఎన్నికల్లో ఓడిపోయినట్లు కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కార్మికులను తమ వైపు తిప్పుకోవడానికి, అధికారంలో ఉన్నామనే ధీమాతో టీడబ్ల్యూయూని గెలిపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ యూనియన్ గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ అధిష్టానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో పార్టీ ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోలేదని, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల వేళ కార్మికులను మమేకం చేయడంలో, స్థానిక సమస్యలపై స్పందించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారంటూ టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ అధికారంలో ఉండి కూడా కార్మిక సంఘం ఎన్నికల్లో ఓడిపోవడం పట్ల ఆయన నేతల తీరును తప్పుబట్టారు.అక్టోబర్ 17న అధికారికంగా వెలువడనున్న ఈ ఎన్నికల తుది ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి రాబోయే కాలంలో ఎదురుకాబోయే సవాళ్లకు అద్దం పడుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో ఆర్టీసీ కార్మిక యూనియన్ ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగలడం పార్టీ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. కార్మిక రంగంలో పట్టుకోల్పోవడం భవిష్యత్తు రాజకీయాలపై ప్రభావం చూపుతుందనే ఆందోళన పార్టీ అధిష్టానంలో వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయం కొరవడుతోందనడానికి ఈ ఘటనే నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు కేవలం పదవులకే పరిమితమై పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పార్టీ గట్టి సంకేతాలు పంపుతోంది.ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ అధిష్టానం అంతర్గత ప్రక్షాళనకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో పార్టీ ఆదేశాలను బేఖాతరు చేసిన వారిపై, బాధ్యతారహితంగా వ్యవహరించిన ఎమ్మెల్యేలపై జిల్లాల వారీగా నివేదికలు తెప్పించుకుని చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. ఏది ఏమైనప్పటికీ, ఆర్టీసీ ఎన్నికల వేడి తెలంగాణ కాంగ్రెస్‌లో వర్గపోరును, నాయకుల పనితీరులోని లోపాలను బట్టబయలు చేసిందనే చెప్పాలి.

**కాంగ్రెస్ ప్రభుత్వానికి వార్నింగ్ బెల్స్!?**

తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఊహించినదానికి భిన్నంగా ఈ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టబలపరిచిన యూనియన్లకు ఈ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపించే ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీ ఓటమి చవిచూడడం పట్ల పార్టీ శ్రేణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఇవి వార్నింగ్ బెల్స్ లాంటివని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా వ్యతిరేకతకు ఇవి అద్దం పడుతున్నాయని, అప్రమత్తం కాకపోతే కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.అక్టోబర్ 9న ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు జరిగాయి. వీటిని కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తాము మద్దతు ఇచ్చిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ , స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కర్స్ యూనియన్ కూటమి విజయం సాధించాలని భావించింది. అయితే... సీపీఐ బలపరిచిన ఎంప్లాయీస్ యూనియన్ , తెలంగాణ మజ్దూర్ యూనియన్ నేషనల్ మజ్దూర్ యూనియన్ కూటమి ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. రాష్ట్ర స్థాయిలో క్లాస్-3 విభాగంలో సీపీఐ అనుబంధ యూనియన్ అయిన ఎంప్లాయీస్ యూనియన్ 18,250 ఓట్లను సాధించగా, కేవలం 13,670



ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో ఎంప్లాయీస్ యూనియన్ సుమారు 4,580 ఓట్ల భారీ ఆధిక్యాన్ని నమోదు చేసింది. అలాగే ప్రాంతీయ స్థాయిలో క్లాస్-6 విభాగంలో 13,907 ఓట్లను సాధించింది.ఈ ఎన్నికల ఫలితాలు కేవలం యూనియన్లకే పరిమితం కాలేదు.. రాజకీయంగా ఇది అధికార పార్టీకి పెద్ద హెచ్చరికగా మారింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ మద్దతు కూటమి కేవలం 3 యూనిట్లను మాత్రమే గెలవడం పార్టీ నేతలను విస్మయానికి గురిచేసింది. పలు జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొనకపోవడం, కొందరు నేతలు ప్రత్యర్థి యూనియన్లకు మద్దతు ఇవ్వడం వంటి ఆరోపణలు పార్టీలో అంతర్గత విభేదాలను బయటపెడుతున్నాయి. అక్టోబర్ 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ జరగనుండగా, అక్టోబర్ 17న అధికారిక తుది ఫలితాలు వెలువడనున్నాయి. అయితే మొత్తం 900 లోపే ఉన్న పోస్టల్ బ్యాలెట్లు ఇప్పటికే ఉన్న 4,580 ఓట్ల భారీ ఆధిక్యాన్ని మార్చలేవని స్పష్టమవుతోంది.ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను పునరాలోచనలో పడేశాయి. అనుబంధ సంఘాలతో సమన్వయం, ఆర్టీసీ ఉద్యోగులతో నిరంతర సంప్రదింపులపై పార్టీ నాయకత్వం ఇప్పుడు ప్రత్యేక దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు సడలుతుందనే సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో, రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ తన యంత్రాంగాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# 200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు..

- మొదటి పేజీ తరువాయి

ఈ వ్యాఖ్యలు చేశారు.జ్ఞానేశ్ కుమార్ తనను సంప్రదించారా? సందేశాలు పంపారా? అని ఓ విలేకరి అడగ్గా.. రాహుల్ అవునని సమాధానమిచ్చారు. తాను నిర్వహిస్తున్న మీడియా సమావేశాన్ని కూడా ఆయన చూస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే, తనకు వచ్చిన సందేశాల్లోని వివరాలను మాత్రం వెల్లడించలేదు.జ్ఞానేశ్ కుమార్‌పై ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఒత్తిడితోనే సీఈసీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయన ఆధారాలను మీడియా ముందు వెల్లడించలేదు.ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రాహుల్ గతంలోనూ ఆరోపణలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత దెబ్బతింటోందని విమర్శించారు. సీఈసీని తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 200 మంది అధికారులు ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని రాహుల్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), విదేశాంగ శాఖకు చెందిన అధికారులు కూడా ఇందులో ఉన్నారని పేర్కొన్నారు. వారే తమకు సమాచారం అందిస్తున్నారని తెలిపారు. అయితే, ఈ వాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తాను ఎన్నికల నిష్పాక్షికతపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని రాహుల్ చెప్పారు. పిటిషన్ దాఖలు చేయాలని సీజేఐ సూచించినట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి రాజకీయాలకు అతీతంగా మద్దతిస్తామని స్పష్టం చేశారు.జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ ఆందోళన ఆగదని రాహుల్ ప్రకటించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ, అమిత్ షాపై కూడా తమ పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

**మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు రానున్న SIR కేసుల పిటిషన్లు..**

ఇప్పటికే మంగళవారం సుప్రీంకోర్టులో ా×= ప్రక్రియకు సంబంధించిన కేసులతో పాటు, ప్రతిపక్ష సభ్యులు దాఖలు చేసిన పిటిషన్‌లు విచారణకు రానున్నాయని సీజేఐ కార్యాలయం రాహుల్ గాంధీకి తెలిపింది. ఇతర ఎన్నికల కమిషనర్ల అంగీకారం లేకుండా తీసుకున్నారని.. లాగే సీఈసీ వివిధ నిర్ణయాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కూడా ఇప్పటికే సీజేఐ ధర్మాసనం విచారిస్తోంది. ఈ రోజు ఉదయం, ప్రతిపక్ష పార్టీలు సుప్రీంకోర్టుకు పాదయాత్ర చేసి, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ సీజేఐకి ఒక వినతిపత్రాన్ని సమర్పిస్తాయని రాహుల్ గాంధీ ప్రకటించారు. తాజాగా సీజేఐ ా×= , సీఈసీ అంశాలపై చర్చించేందుకు రాహుల్ గాంధీ కి అపాయింట్ నిరాకరించడంతో సోమవారం జరిగే సుప్రీంకోర్టు మార్చ్ పై ఉత్కంఠ నెలకొంది.

# ఎంపీ వంశీకృష్ణ నిరాధార ఆరోపణలు

**– బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం**

**పెద్దపల్లి** :కేంద్ర ఎన్నికల సంఘంపై, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేస్తున్న నిరాధార వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యవస్థలను తీవ్రంగా కించపరిచేలా ఉన్నాయని బీజేపీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి క్యాంపు కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో పల్లె సదానంద మాట్లాడుతూ మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల ఓటమి భయంతో నే కాంగ్రెస్ నేతలు ఈవీఎం లు, రాజ్యాంగ సంస్థలపై బురదజల్లుతున్నారని ధ్వజమెత్తారు. ఢిల్లీ వేదికగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడు తున్న 13 కోట్ల ఓట్ల చోరీ ఆరోపణలకు ఒక్క ఆధారమైనా చూపించగల రా అంటూ సూటిగా ప్రశ్నించారు. పెద్దపల్లి ఎంపీగా గెలిచి 16 నెలలు గడిచినా నియోజకవర్గానికి నయాపైసా తీసుకురాలేద ని, రామగుండం ఎరువుల కర్మాగారం, ఎన్టీపీసీ, రైల్వే లైన్ డబ్లింగ్, నేషనల్ హైవే 363 వంటి అభివృద్ధి పనులన్నీ మోదీ ప్రభుత్వ నిధులతోనే సాధ్యమయ్యా యని స్పష్టం చేస్తూ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమాని సవాల్ విసిరారు.రాముడిని కల్పిత పాత్రగా కోర్టులో అఫిడవిట్ ఇచ్చిన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు రాముడి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని,కాకా కుటుంబం పేరు చెప్పుకుని గెలిచిన వంశీకృష్ణ సింగరేణి కార్మికులకు ఇండ్ల పట్టాల హామీని ఎందుకు నెరవేర్చలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు. స్థానిక సమస్యలను గాలికొదిలేసి ఢిల్లీలో రాహుల్ గాంధీ మెప్పు, ఫోటోల కోసమే సమయం వెచ్చిస్తున్న ఎంపీ వెంటనే ఎన్నికల సంఘానికి, సీఈసీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోర మనోహర్, పెండ్యాల కుమార్, సంపత్ చారి, కోల సుధాకర్, ముస్తాల సంతోష్, బండ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టును రాజకీయాల్లోకి లాగాలని చూడొద్దు: సీజేఐ

- మొదటి పేజీ తరువాయి

విషయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోబోవని.. కావాలంటే కాంగ్రెస్ నేతలు ఈ విషయంపై పిటిషన్ ద్వారానే తమను సంప్రదించవచ్చని సీజేఐ సూచించారు. సీఈసీ అంశాలకు సంబంధించిన విషయాలు రేపు(మంగళవారం) విచారణకు రానున్నాయని కూడా ఆయన పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తలుపులు ఎల్లప్పుడూ అందరి కోసం తెరిచే ఉంటాయన్నారు. అంతే కానీ కోర్టులను రాజకీయాల్లోకి లాగాలని చూడొద్దని ప్రతిపక్షాలకు సూచించారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సందర్భంలో సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే సమావేశంలో 'నీరు-జీవన అమృతం' అనే అంశంపై సీజేఐ మాట్లాడుతూ.. కలుషిత జలాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దానివల్ల ప్రజల ఆరోగ్యాలకు భారీ ముప్పు పొంచి ఉందన్నారు.

# పొన్నం సవాల్ ను స్వీకరిస్తున్నా..

- మొదటి పేజీ తరువాయి

సిద్ధంగా ఉన్నాను.ఎక్కువ మందిని కూడా అక్కర్లేదు, ఓట్లు తొలగించబడ్డాయని చెబుతున్న కనీసం పది మందిని సీఈవో ఆఫీసుకు తీసుకురండి.నాకు తెలిసి మీ వెంట తీసుకురావడానికి మీ మజ్లిస్ దోస్తులు.. అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీలే మీకు దిక్కు, వాళ్లనైనా సరే వెంట తీసుకురండి.మీరు తీసుకొచ్చే ఆ పది మంది ఓటర్ల వివరాలను అక్కడికక్కడే కంప్యూటర్లలో చెక్ చేద్దాం, అసలు ఓటు లేదో లేక డిలీట్ అయిందో తేల్చుకుందాం.నిజంగానే ఎవరిదైనా అర్హులైన ఓటు తొలగించబడిందని నిరూపించండి.,ఎవరికీ ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా, క్షేత్రస్థాయి ఎంక్వైరీ లేకుండా ఏ ఒక్క ఓటు కూడా తొలగించే అవకాశమే లేదు.రాష్ట్రంలో సమస్యలతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, పరిష్కరించాల్సింది పోయి మంత్రులంతా బాధ్యత లేకుండా ఢిల్లీకి పరిగెత్తారు.గోవాలో రేవంత్ రెడ్డి బీజేపీని 'రావణుడు' అని, కాంగ్రెస్ ను 'రాముడు' అని మాట్లాడటం ఆయన అవివేకానికి పరాకాష్ట.రాక్షస ప్రవృత్తి ఎవరిదో దేశ చరిత్ర చూస్తే తెలుస్తుంది, ఎమర్జెన్సీ విధించి, అమాయకులను జైళ్లలో పెట్టి, అరాచకాలు సృష్టించింది కాంగ్రెస్ పార్టీ కాదా? అని ప్రశ్నించారు రాముడి ఉనికినే ప్రశ్నించి, సుప్రీంకోర్టులో రామాలయ నిర్మాణానికి వ్యతిరేకంగా పెద్ద పెద్ద అఫిడవిట్లు దాఖలు చేసి అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీ కాదా? అయోధ్యలో భవ్య రామాలయ నిర్మాణం పూర్తయి ప్రాణప్రతిష్ఠ జరిగితే.. రాముడి జన్మభూమికి రాహుల్ గాంధీ వెళ్లలేదు, రేవంత్ రెడ్డి వెళ్లలేదు, మీ కాంగ్రెస్ నాయకుల్లో ఎవరైనా వెళ్లారా? రాజకీయ స్వార్థం కోసం దేవుళ్లను, దేవతలను కాంగ్రెస్ నాయకులు హేళన చేయడాన్ని వెంటనే ఆపాలి; హిందూ సమాజం ఇలాంటి విమర్శలను ఎప్పటికీ సహించదు. జూబ్లీహిల్స్ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి స్వయంగా "ముస్లిం ఈజ్ కాంగ్రెస్.. కాంగ్రెస్ ఈజ్ ముస్లిం" అని బహిరంగంగానే ప్రకటనలు చేశారు.. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే ఇలాంటి ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారు. మొన్నటికి మొన్న "రాముడు రిచ్ మ్యాన్స్ గాడ్ (ధనికుల దేవుడు).. శివుడు పూర్ మ్యాన్స్ గాడ్ (పేదవాళ్ల దేవుడు)" అని దేవుళ్ల వర్గ విభజన తెస్తూ మాట్లాడిన చరిత్ర కాంగ్రెస్ నేతలది..అలాంటి వ్యక్తులకు ఇప్పుడు సడన్‌గా గోవాకు వెళ్లగానే శ్రీరాముడు గుర్తొచ్చారా? ముస్లిం ఈజ్ కాంగ్రెస్.. కాంగ్రెస్ ఈజ్ ముస్లిం" అని చెప్పే రేవంత్ రెడ్డికి అసలు శ్రీరాముడి పేరు ఎత్తే అర్హతే లేదు; మీకున్న ఆ రాక్షస లక్షణాలకు, ఆ వైఖరికి మీకు ఒసామా బిన్ లాడెన్ సరిపోతాడు తప్ప శ్రీరాముడు ఎట్లా అవుతాడు? ఇక్కడ తెలంగాణలో ఉండి రాముడి గురించి మాట్లాడితే తమ మిత్రపక్షమైన మజ్లిస్ (ఎంఐఎం) వాళ్ల మనసులు ఎక్కడ నొచ్చుకుంటాయోనన్న భయంతోనే.. రేవంత్ రెడ్డి హైదరాబాద్ వదిలి, ప్రత్యేకంగా గోవాకు వెళ్లి రాముడి పేరుతో ఈ రాజకీయ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు.

## జ్ఞానేశ్ కుమార్ తొలగింపుపై
# కేరళం అసెంబ్లీ తీర్మానం

- మొదటి పేజీ తరువాయి

లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) మద్దతు తెలిపాయి. కాగా.. తీర్మానంలోని పలు అంశాలపై బీజేపీ అభ్యంతరం తెలిపింది. వాటికి సవరణ చేయాలని బీజేపీ నేతలు కోరగా వాటిని తిరస్కరించారు. ఇక సీఈసీపై వచ్చిన ఆరోపణలపై సభ ఆందోళన వ్యక్తం చేసింది. స్వేచ్ఛాయుత, పారదర్శక, నిష్పక్షపాత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని, అలా నిర్వహించిన ఎన్నికలపైనే భారతదేశ ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని సభ పేర్కొంది. 'భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పారదర్శకతపై సందేహాలు వస్తున్న నేపథ్యంలో ఆ రాజ్యాంగబద్ధ వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడానికి సీఈసీని తొలగించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి' అని తీర్మానం పేర్కొంది. ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియలో లోపాలను పరిష్కరించాలని, అర్హులైన ఓటర్లందరికీ ఓటు హక్కును పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వం, ఈసీఐని సభ కోరింది. అలాగే, సీఈసీని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. సీఈసీ ఎంపికలో ప్రధాన మంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేతతో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని తీర్మానం పేర్కొంది. 'సరైన విధానాన్ని అనుసరించకుండానే ఓటరు జాబితా నుంచి కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. బడుగు బలహీనవర్గాలు, మైనారిటీలు, యువత, కార్మికుల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాయడమే. అలాగే, ఓటర్ల జాబితాను తయారు చేయడానికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల అధికారాలను కూడా తగ్గించారని మీడియాలో కథనాలు వచ్చాయి. ఫామ్-6కు సవరణలు చేశారని, దీనిపై ఇద్దరు ఎన్నికల అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారని పత్రికలు ప్రచురించాయి' అని తీర్మానం వ్యాఖ్యానించింది.

# ఉమ్రా యాత్రలో విషాదం

**హైదరాబాద్ వాసి మృతి..**

**హైదరాబాద్ , అక్టోబరు 12:**సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన దాడిలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి మృతి చెందారు. నగరంలోని మెహదీపట్నం నివాసి మొహమ్మద్ యూసుఫ్ అలీ ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఉమ్రా యాత్ర కోసం కుటుంబ సమేతంగా వెళ్లిన క్రమంలో ఈ విషాదం చోటుచేసుకుంది.శనివారం జరిగిన ఈ దాడిలో యూసుఫ్ అలీ తీవ్రంగా గాయపడగా, రియాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ ప్రమాదంలో ఆయన ఇద్దరు కుమారులు, అత్త కూడా గాయాలపాలయ్యారు. ఒక కుమారుడికి మోకాలి శస్త్రచికిత్స జరగ్గా, మరో కుమారుడు కాలి వేళ్లను కోల్పోయినట్లు సమాచారం. అత్త తలకు గాయాలైనప్పటికీ ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. యూసుఫ్ అలీ భార్య, కుమార్తె క్షేమంగా ఉన్నట్లు తెలిసింది. వీరంతా మదీనా వెళ్లేందుకు చెక్-ఇన్ కియోస్క్ వద్ద వేచి ఉన్న సమయంలో ఈ దాడి చోటుచేసుకుంది.ఈ ఘటనను హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సోషల్ మీడియా వేదికగా ధ్రువీకరించారు. బాధిత కుటుంబంతో తాను సంప్రదింపుల్లో ఉన్నానని, వారికి తక్షణమే సహాయం అందించాలని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్‌ను ఆయన కోరారు. దీనిపై స్పందించిన మంత్రి జైశంకర్, మృతుడి కుటుంబానికి సంతాపం తెలియజేస్తూ, అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. యూసుఫ్ అలీ భౌతికకాయాన్ని స్వదేశానికి తరలించేందుకు రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం తగిన ఏర్పాట్లు చేస్తోంది.హౌతీ మిలిటెంట్లు జరిపిన ఈ దాడిలో మొత్తం 13 మంది ప్రాణాలు కోల్పోగా, 300 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో 11 మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో సౌదీ అరేబియాలో ఉన్న భారతీయ పౌరులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది.

వార్తాతరంగాలు
మంగళవారం 13 అక్టోబర్ 2026

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీల వేడి.. తెరపైకి మాదిగలు!



హైదరాబాద్ అక్టోబరు 12:తెలంగాణలో ప్రస్తుతం గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీ అంశం చర్చనీయాంశంగా మారింది. నవంబర్‌లో మూడు నామినేటెడ్ ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానుండటంతో, అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి శాసనమండలిలో తమ వర్గానికి తగిన ప్రాతినిధ్యం దక్కలేదంటూ మాదిగ సామాజిక వర్గం నుంచి వస్తున్న డిమాండ్లు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.నవంబర్‌లో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. వీటిని భర్తీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. వివిధ సమాజిక సమీకరణాలను బేరీజు వేస్తోంది. ఇటీవల గ్రాడ్యుయేట్ ఎన్నికలకోసం ఇద్దరినీ రెడ్డి సమాజిక వర్గానికి చెందిన నేతలనే కాంగ్రెస్ హైకమాండ్ ఎంపిక చేసింది. దీంతో గవర్నర్ కోటా స్థానాలను వెనుకబడిన వర్గాలకు ఇవ్వాలనే డిమాండ్ ఊపందుకుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పద్మశాలీ వర్గానికి చెందిన ఒకరికి ఎమ్మెల్సీ స్థానంలో ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మూడు స్థానాలలో కనీసం రెండు స్థానాలను బీసీ వర్గాలకే కేటాయించే అవకాశాలున్నట్లు స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో మాదిగ వర్గ నాయకులు తమకు అవకాశం కల్పించాలంటూ ఒత్తిడి పెంచారు.తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకు శాసనమండలిలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లభించలేదన్నది ఆ వర్గ నేతల ప్రధాన వాదన. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్సీ కోటా కింద ఎమ్మెల్సీలుగా అవకాశం పొందిన ఎం.ఎస్. ప్రభాకర్, గొరేటి వెంకన్న ఇద్దరూ కూడా మాల సామాజిక వర్గానికి చెందినవారేనని వారు గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అద్దంకి దయాకర్ వంటి ప్రముఖులకు మండలిలో అవకాశం కల్పించినప్పటికీ, ఆ స్థానం కూడా మాల వర్గానికే దక్కిందని మాదిగ సంఘాలు వివరిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో డి. రాజేశ్వర్ రావుకు అవకాశం దక్కినా, ఆయన ఆ తర్వాత పూర్తిగా క్రిస్టియన్ మైనారిటీ వర్గంలోకి మారారని, అలాగే కేసీఆర్ హయాంలో కడియం శ్రీహరి బైండ్ల కులానికి చెందినవారని కమ్యూనిటీ ప్రతినిధులు పేర్కొంటున్నారు.తమ దీర్ఘకాలిక డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుని, ఈసారైనా కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పాటించాలని మాదిగ నేతలు బలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తమ అభ్యర్థిత్వాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రేసులో మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ. సంపత్ కుమార్, దొమ్మాట సాంమయ్య, ఇందిరా సింగపురం, దేవాని సతీశ్ మాదిగ తదితరులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రత్యేకించి, ఎంఆర్పీఎస్ ఉద్యమంతో సుదీర్ఘ అనుబంధం కలిగి ఉండి, కాంగ్రెస్‌లో సీనియర్ లీడర్‌గా సేవలందిస్తున్న దేవాని సతీశ్ మాదిగ తదితరులు తమకు అవకాశం ఇవ్వాలని గట్టిగా కోరుతున్నారు.మొత్తానికి, రాబోయే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలు కేవలం పదవుల భర్తీగానే కాకుండా, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి సామాజిక న్యాయాన్ని నిరూపించుకునే అగ్నిపరీక్షగా మారాయి. మరి సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ నాయకత్వం మాదిగల ఆకాంక్షలను ఏ విధంగా నెరవేరుస్తారనేది వేచి చూడాలి.

## రోడ్లపై కాదు.. ఆధారాలతో ఈసీ వద్దకు వెళ్లండి

**ఈటల రాజేందర్**

**ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందన**

**ఆందోళనలతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వ్యాఖ్య**

**ఆధారాలుంటే ఎన్నికల సంఘాన్ని కలవాలని ప్రతిపక్షాలకు సూచన**



ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ ఆందోళనల వల్ల రాజధాని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతిపక్ష నేతలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈరోజు ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఈటల... ప్రతిపక్షాల తీరుపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేసేవారు, అందుకు సంబంధించిన ఆధారాలతో ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలని ఈటల సూచించారు. “ఎన్నికల సంఘం నుంచి అపాయింట్‌మెంట్ తీసుకుని, మీ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించండి. అంతేగానీ, ఇలా రోడ్లెక్కి ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదు” అని ఆయన అన్నారు. గతంలో బీహార్‌లో ‘ఓట్ల దొంగతనం’ జరిగిందని ఇలాగే ఆరోపించారని, కానీ దాని ఫలితం ఏమైందో గుర్తుచేసుకోవాలని అన్నారు. బీహార్ ఎన్నికల నుంచి ఇండియా కూటమి గుణపాఠం నేర్చుకోవాలని ఈటల హితవు పలికారు. ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోరాడటం నేర్చుకోవాలని ఆయన సూచించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ‘చలో ఢిల్లీ – మార్చ్ ఫర్ డెమోక్రసీ’ పేరుతో ఇండియా కూటమి సుప్రీంకోర్టుకు పాదయాత్ర తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల కారణంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు, కొన్ని మెట్రో స్టేషన్లను మూసివేశారు.

## మెట్రో-ఆర్టీసీ కామన్ కార్డ్ ధరలపై పునరాలోచన..

**సమీక్షకు తెలంగాణ సర్కార్ నిర్ణయం**



**హైదరాబాద్, అక్టోబర్ 12:**హైదరాబాద్‌లో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి ఇటీవల ప్రవేశపెట్టిన ‘కామన్ మొబిలిటీ కార్డ్’ ధరలపై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచనలో పడింది. నెలవారీ పాస్ ధర రూ.8,500గా నిర్ణయించడంపై ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో, ఛార్జీలను సమీక్షించాలని సర్కార్ నిర్ణయించింది. సామాన్యులకు అందుబాటులో ఉండేలా ధరలను మార్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు ప్రకటించింది.అక్టోబర్ 2న ఈ కామన్ కార్డ్‌ను ప్రారంభించారు. అయితే, దీని ధరలు సామాన్యులకు పెనుభారంగా ఉన్నాయన్న అభిప్రాయాలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచన మేరకు ఛార్జీల సమీక్షకు నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం తెలిపారు. త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశమై, ధరలను తగ్గించే విషయంపై చర్చిస్తామని ఆయన వెల్లడించారు.ప్రస్తుత నిబంధనల ప్రకారం, రోజువారీ పాస్ ధర రూ.400, నెలవారీ పాస్ ధర రూ.8,500గా ఉంది. నెలవారీ పాస్‌లో మెట్రోకు రూ.7,000, ఆర్టీసీకి రూ.1,500గా విభజించారు. కార్డు తీసుకునేటప్పుడు రూ.100 రిఫండబుల్ డిపాజిట్ కూడా చెల్లించాలి. అధికారులతో జరగబోయే సమావేశం తర్వాత కొత్త ధరలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే, సమీక్ష ఎప్పటిలోగా పూర్తవుతుంది, కొత్త ధరలు ఏ మేరకు తగ్గుతాయనే దానిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు

## సింహాసనం ఖాళీ చేయండి.. ప్రజలు వస్తున్నారు’..



**న్యూఢిల్లీ,అక్టోబరు 12:**ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ కూడా ఆ స్వరాన్ని వినిపించారు. ప్రముఖ హిందీ కవి రామ్‌ధారీ సింగ్ దినకర్ రచించిన ‘జనతంత్ర్ కీ జన్మ్’ కవితలోని ప్రసిద్ధ పంక్తులను సోమవారం సోషల్ మీడియాలో పంచుకున్నారు. ‘సింహాసన్ ఖాళీ కరో కీ జనతా ఆతీ హై’ అంటూ ప్రజల శక్తిని గుర్తుచేసే వ్యాఖ్యను పోస్ట్ చేశారు. మరో పోస్టులో రాహుల్ గాంధీ చేసిన ‘ఈ ప్రభుత్వం దిగిపోతుంది’ అనే వ్యాఖ్యనూ పంచుకున్నారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ అక్టోబర్ 10న జరిగిన నిరసన సందర్భంగా పోలీసులు హింసకు పాల్పడ్డారని, బీజేపీ కార్యకర్తలు విద్యార్థులు, మహిళలపై దాడులు చేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనలను నిరసిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమి ఢిల్లీలో ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమైంది. గత వారం రోజులుగా రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నిరసనలు కొనసాగిస్తోంది.ఇటీవలి నిరసనల్లో శశి థరూర్ చురుగ్గా పాల్గొనకపోవడం గమనార్హం. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ వైఖరికి కొన్ని అంశాల్లో ఆయన మద్దతు పలికారు. ముఖ్యంగా 2025 మేలో భారత్–పాకిస్థాన్ మధ్య నాలుగు రోజుల పాటు సాగిన సైనిక ఘర్షణకు సంబంధించిన ‘ఆపరేషన్ సిందూర్’ విషయంలో ప్రభుత్వ వైఖరిని సమర్థించారు. అలాంటి థరూర్ ఇప్పుడు ప్రతిపక్షాల నిరసనలకు మద్దతుగా పరోక్షంగా స్పందించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# బీఆర్ఎస్ కు “భూమి” భారం





హైదరాబాద్,అక్టోబరు 12:తెలంగాణలో బీఆర్ఎస్ ఒకింత ఇబ్బంది కరమైన పరిస్థితులను ఎదుర్కొంటుంది. అధికారంలో ఉన్న సమయంలో భూముల కొనుగోళ్ల ఇప్పుడు కాంగ్రెస్ చర్చ పెట్టడంతో ఒకింత ఆత్మరక్షణలో పడినట్లయింది. కేసీఆర్ నుంచి ఆయన కుటుంబ సభ్యులపై భూ ఆక్రమణల ఆరోపణలను కాంగ్రెస్ చేయడంతో దీనిని అధిగమించేందుకు ఎదురుదాడికి దిగుతున్నప్పటికీ అనుకున్న ఫలితం లభించడం లేదు. రాజకీయంగా మరియు న్యాయపరంగా చూస్తే, బీఆర్ఎస్ పార్టీ భూముల వ్యవహారంలో తీవ్రమైన ఆత్మరక్షణలో పడిందనే చర్చ గట్టిగా నడుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులు, పార్టీ కార్యాలయాల నిర్మాణాలు, మరియు కీలక నేతల వ్యక్తిగత భూములపై గట్టి నిఘా పెట్టడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పాలి.తెలంగాణలో భూములన్నీ... బీఆర్ఎస్ నేతలు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన భూ అక్రమాలు, 22–ఎ కేటాయింపులపై తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 2026లో ఒక నలుగురు సభ్యుల ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఇది పార్టీ నేతలను ఇరకాటంలోకి నెట్టింది. జిల్లా కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వ భూములను అతి తక్కువ ధరలకు కేటాయించుకున్నారని, కొన్ని చోట్ల అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించారనే ఆరోపణలపై న్యాయపరమైన చర్యలు నడుస్తున్నాయి. ఇప్పటికే నల్గొండ వంటి ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కట్టిన పార్టీ ఆఫీస్ భవనాలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలు పెద్ద సంఖ్యలో భూములను తమ సొంతం చేసుకున్నారన్న అభిప్రాయం ప్రజల్లో బలపడేందుకు దోహదపడింది. రాజకీయాలు కేసీఆర్ కుటుంబానికి చెందిన గజ్వేల్ ఫామ్‌హౌస్ భూములు, అలాగే కేటీఆర్‌కు లింక్ ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జన్వాడ ఫామ్‌హౌస్ పరిసర భూములపై కాంగ్రెస్ ప్రతినిధుల బృందాలు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపాయి. కేసీఆర్ కుటుంబానికి 9 జిల్లాల్లో దాదాపు 440 ఎకరాల భూములు ఉన్నాయని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆరోపించి విచారణకు ఆదేశించారు. ఈ ఆరోపణలన్నింటినీ రాజకీయ కక్ష సాధింపు చర్యలుగా బీఆర్ఎస్ కొట్టిపారేస్తోంది. ప్రభుత్వ భూముల తాకట్టుపై కాంగ్రెస్‌ను నిలదీస్తూ, సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ భూములపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని హరీశ్ రావు, కేటీఆర్ లాంటి అగ్రనేతలు ఎదురుదాడికి దిగుతున్నారు.అయినప్పటికీ, అధికారికంగా ప్రభుత్వ విచారణలు, కోర్టుల నోటీసులు ఎదుర్కొంటుండటం వల్ల భూముల విషయంలో ప్రస్తుతానికి బీఆర్ఎస్ కొంత ప్రతికూల పరిస్థితుల్లోనే ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్..

**టెండర్లలో భారీ అవకతవకలంటూ ఆరోపణ!**

**రేడియల్ రోడ్ టెండర్లలో అవకతవకలంటూ రాజగోపాల్ రెడ్డి ఆరోపణ**

**రూ.600 కోట్లు తక్కువకు బిడ్ వేసినా తమను తప్పించారని మండిపాటు**

**సీఎం రేవంత్ శాఖలోనే దోపిడీ జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు**



తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (ఎ+జూ) ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్–2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు. మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను పక్కనపెట్టారని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు.టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు.గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

## పంటకు కరెంటు, నీళ్లు వెంటనే అందించాలి...

**సాగు నీరందక ఎండిపోతున్న పంటలు**

**హుజురాబాద్, అక్టోబర్ 12:** ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని నిపుణులు ముందస్తుగా హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, రాజపల్లి సర్పంచ్ కటుకూరి మల్లా రెడ్డి, కౌన్సిలర్ వర్ధినేని రవీందర్ రావు అన్నారు. వర్షాభావంతో సాగు చేసిన పంటలు చేతికందే సమయంలో ఎండిపోతున్నాయని, ఎల్‌ఎండి కింద ఆయకట్టుకు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని లిఫ్ట్ చేయాల్సిన ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఎక్కడ మంచి పేరు వస్తుందో అనే భయంతో రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఒక తడి కోసం నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. అలాగే 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో రెప్పపాటు విద్యుత్ సరఫరా అంతరాయం వాటిల్లని సంగతి గుర్తుచేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి



**ఇబ్రహీంపట్నం:** జూపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేష్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ కు చేరుకున్నారు. రింగ్ సెంటర్ కి ఇరువైపులా బారి కేట్లు అడ్డుపెట్టారు. మృతదేహంతో హైవేపై బైటాయించారు. దాంతో ట్రాఫిక్ స్థంభించింది. వాహనాలు నిలిచిపోయాయి. తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదనీ హెచ్చరించారు. దీనిపై మరింత పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది..

## గంజాయి విచారణకు పోలీసులు

**పోలీసుల పైమూకుమ్మడి దాడి**



**ఆదిలాబాద్:**సిరికొండ మండలం వాయిపేట్‌లో గంజాయి విచారణకు వచ్చిన పోలీసులపై గ్రామస్తులు దాడికి పాల్పడ్డారు. ఘటన లో సీఐ, ఏఎస్ఐ సహా నలుగురు పోలీసులకు గాయాలు అయ్యాయి.పెరట్లో 18 గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు తదుపరి విచారణ కోసం పోలీసు బృందం గ్రామానికి వెళ్లింది. గంజాయి సమాచారం ఎవరిచ్చారంటూ పోలీసులను గ్రామస్థులు నిలదీసారు. మహిళలతో కలిసి రాళ్లు, కర్రలతో దాడి చేశారని పోలీసుల వాదన. పోలీసు వాహనంతో పాటు ఫోన్లు ధ్వంసం అయ్యాయి. పోలీసులే కులం పేరుతో దూషించారంటూ ఆదివాసీల ఆరోపణ. గాయపడిన పోలీసులకు ఆదిలాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

# సబ్బండ వర్గాల సంక్షేమమే ఎజెండా

## మెరుగైన సేవలందించేందుకే సొంత భవనాలు: ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి






**నాగర్ కర్నూల్ అక్టోబర్ 12( స్కై న్యూస్)** ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు సబ్బండ వర్గాల సంక్షేమామే ఎజెండాగా పనిచేస్తూ ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన పేదలకు అందించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు సోమవారం జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించే తలపెట్టిన ట్రాన్స్కో ఎస్ ఈ కార్యాలయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేవంత్ రెడ్డి నాయకత్వంలో సుపరిపాలన సంక్షేమం అందించేందుకు ప్రజా పాలనను మరింత వేగవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ ఉద్యోగులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఆ దిశగా అందరూ కృషి చేయాలని కోరారు. ప్రజలకు రైతులకు విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని లో వోల్టేజి సమస్యను పరిష్కరించేందుకు నియోజకవర్గంలో నూతన సబ్ స్టేషన్ లను మంజూరు చేయించడం జరిగిందని వివరించారు. కార్యాలయానికి రహదారిని మరియు డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాలలో మునిసిపాలిటీ కేంద్రంలో రహదారుల సమస్యను డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేయించడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ ఈ నర్సింహారెడ్డి డిటి రవికుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు మున్సిపల్ చైర్మన్ తీగల సునింద్ర కుమార్ డిఈ సుధాకర్ ఎస్ ఏ ఓ పార్థసారథి డి ఈ ప్రవీణ్ కౌన్సిలర్ పడిగే శంకర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కా రాజ్ కుమార్ రెడ్డి తో పాటు ఏఈలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

## రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# హస్లీ యాడి ఆలయానికి రూ.25 వేల విరాళం

- జర్పుల దశరథ్ నాయక్

**ఆమనగల్లు, అక్టోబర్ 12 (స్కై న్యూస్):** కడ్తాల్ మండలం పెద్దవేముల గ్రామపంచాయతీ పరిధిలోని చినవేముల బాయ్ తండాలో గిరిజనుల ఆరాధ్యదైవం హస్లీ యాడి దేవాలయాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రతిష్టాత్మకంగా నిర్మించేందుకు తండా ప్రజలు ముందుకు వచ్చారు. ఈ పవిత్ర కార్యానికి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది.కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ శనివారం చినవేముల బాయ్ తండాను సందర్శించారు. ఆలయ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి, ఆలయ నిర్మాణ పనుల నిమిత్తం రూ.25,000 (ఇరవై ఐదు వేల రూపాయలు) నగదును తన చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.తండా ప్రజల చిరకాల కల అయిన ఈ ఆలయ నిర్మాణానికి ట్రస్ట్ అందించిన ఈ ఆర్థిక సాయం పనులకు మరింత ఊపునిచ్చింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు దశరథ్ నాయక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ.. గిరిజన తండాల ఆచార వ్యవహారాలకు, తరతరాల సంస్కృతికి, ఆధ్యాత్మిక వైభవానికి హస్లీ యాడి అమ్మవారు ప్రతీక అని అన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు తండా ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, తండాలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌఖ్యాలు, ఐక్యతను పెంపొందించేందుకు ఇలాంటి పవిత్ర దేవాలయాల నిర్మాణాలు ఎంతో తోడ్పడతాయని పేర్కొన్నారు.రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవా, ధార్మిక కార్యక్రమాలను బాధ్యతగా నిర్వహిస్తూ, గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఆలయ నిర్మాణానికి తన వంతు



సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వినోద్ నాయక్, దశరత్ నాయక్, పాండు నాయక్, శ్రీను, రమేష్ ఆలయ కమిటీ ప్రతినిధులు, తండా పెద్దలు, యువకులు, మహిళలు భక్తిశ్రద్ధలతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చెన్నై షాపింగ్ మాల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే




**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 12 (స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలో హిమాలయ హోటల్ సమీపంలో చెన్నై షాపింగ్ మాల్ ను ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే శ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి హాజరయ్యారు చెన్నై షాపింగ్ మాల్ ను ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది...ఎమ్మెల్యే కి చెన్నై షాపింగ్ మాల్ మేనేజ్మెంట్ నిర్వాహకులు శాలువా కప్పి జ్ఞాపిక ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల ప్రాంతంలో సరికొత్త షాపింగ్ మాల్ను ఏర్పాటు చేయడం చెన్నై షాపింగ్ మాల్ 40వ బ్రాంచ్ గద్వాలలో సంతోషమని హర్షం వ్యక్తం చేశారు. గద్వాల ప్రాంతంలోని ప్రజలు హైదరాబాదు కర్నూలు ప్రవేశాలకు వెళ్లే అవసరం లేకుండా గద్వాలలోనే చెన్నై షాపింగ్ మాల్ ఓపెన్ కావడంతో అన్ని రకాల వస్తువులు బట్టలు నాణ్యతమైన సరసమైన ధరలకు ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.ఇలాంటి షాపింగ్ వాళ్లు గద్వాల నియోజకవర్గంలో భవిష్యత్తులో మరెన్నో రావాలి గద్వాల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు జిల్లా సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి రెండు ఫిర్యాదులు




**ఆమనగల్లు, అక్టోబర్ 12 (స్కై న్యూస్):** ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం ఆమనగల్లు మండలంలో రెండు ఫిర్యాదులు అందాయి.మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో జయరాం విజయ్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఈరోజు ప్రజావాణికి మొత్తం రెండు ఫిర్యాదులు వచ్చాయని, అందులో ఒకటి రెవెన్యూ శాఖకు సంబంధించినది కాగా, మరొకటి హౌసింగ్ శాఖకు సంబంధించినదని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శరన్నవరాత్రులు మొదటి రోజు బాల త్రిపుర సుందరిగా అమ్మవారు



**అమ్రాబాద్ స్కై న్యూస్ అక్టోబర్ 11** ఆదివారం అమ్రాబాద్ మండలం మాన్ననూరు గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని నిలబెట్టారు మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిక పూజలు అందుకున్నారు విగ్రహ దాత దుడ్డు శంకరయ్య విగ్రహాన్ని ఇప్పించారు ఈరోజు శ్రీ శ్రీమతి మంజుల రాజా రామ్ సర్పంచ్శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం పాలకమండలి సభ్యురాలు శ్రీమతి శంభో శోభసంధ్య హత్య నాయక్ముఖ్య అతిథులుగా హాజరుకాగా పులిజాల శేఖర్ మరియు సరస్వతి విగ్రహ దాత దుడ్డు శంకరయ్య నా సారమ్మ సురేష్ శివ నరసింహ చార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిపి భజనలు చేసి ప్రసాదం ఇతర చేశారు వ

## ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 12(స్కై న్యూస్):**గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఉమ్మడి మహబూబ్ నగర్ - రంగారెడ్డి- హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గారు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కి మర్యాదపూర్వ కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు బండ్ల రాజశేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ తుమ్మల నరసింహులు యాదవ్, నాయకులు కురుమన్న, మాస్టర్ షేక్షావలి, మైలగడ్డ చంద్రశేఖర్, దౌలన్న, మల్లికార్జున్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో గంప దంపతుల ప్రత్యేక పూజలు

### భ్రమరాంబికా దేవి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు



**ఆమనగల్లు, అక్టోబర్ 12(స్కై న్యూస్):**కడ్తాల్ మండల కేంద్రంలోని శివాలయంలో శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ మల్లికార్జున స్వామి వారికి సోమవారం గంప లక్ష్మయ్య కుటుంబ సభ్యులు, డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా ధర్మపత్ని గంప వంశిక దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలను శివాలయ ప్రధాన అర్చకులు వలిపే రామకృష్ణ శర్మ అయ్యగారు ఆధ్వర్యంలో వేదమంత్రోత్సవాల మధ్య నిర్వహించారు. అనంతరం దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపంలో ప్రతిష్ఠించిన దుర్గామాత శ్రీ భ్రమరాంబికా దేవి అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చింది. ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో గంప వెంకటేష్ గుప్తా దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ఎండల తీవ్రత పెరిగి వర్షాభావం లేక ప్రజలు అల్లాడుతున్నారని వారందరిని దుర్గామాత అమ్మవారు కనుకరించి అనుగ్రహంతో వాతావరణం చల్లబడే విధంగా చూడాలని ప్రార్థించారు. పాడి పంటలు సమృద్ధిగా పండి... అలాగే వర్షాలు కురిసే విధంగా చూడాలని అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో పిల్లాపాపలతో సంతోషంగా జీవించాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు గంప వెంకటేష్ గుప్త దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాలయ దేవస్థాన ఆలయ కమిటీ చైర్మన్ చాట్ల సర్వేశ, సభ్యులు అంజయ్య సెట్, బుచ్చప్ప, మల్లేష్, గంప లక్ష్మయ్య ట్రస్ట్ సభ్యులు కె. శ్రీనివాస్ గుప్తా, నవీన్ గుప్తా, ఈ. రమేష్ గుప్తా, దుర్గామాత మిత్రమండలి అధ్యక్షుడు కర్ణాకర్, హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు అమృతం పాండు, అశోక్ రెడ్డి, జానీష్ గౌడ్, తన్వి, వార్డు సభ్యులు హెచ్ ఆర్ మహేష్, యాదగిరి, సాయి, ప్రభు, శివ, శ్రీను, మల్లేష్ గౌడ్, నేటి మల్లేష్, గూడూరు సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వనదుర్గమ్మ..గులాబి వర్ణంలో గాయత్రీ దేవిగా




**పాపన్నపేట /మెదక్, అక్టోబర్ 12,(స్కై న్యూస్ ప్రతినిధి ):**మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గాదేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు (శరన్నవరాత్రి సెలెబ్రేషన్స్ ) కన్నుల పండువగా కొనసాగుతున్నాయిరెండో రోజు సోమవారం వనదుర్గామాతను గాయత్రీ దేవి రూపంలో, గులాబీ రంగు చీరతో పాటు వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ఈ అలంకరణలో అమ్మవారు భక్తులకు శోభాయమానంగా దర్శనమిస్తున్నారు.ఆలయ ఆవరణలోని గోకుల్ షెడ్లో ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.వేకువజాము నుంచే ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు (స్పెషల్ పూజస్ ) నిర్వహిస్తూ భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి వీరేశం, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మరుసటి రోజు వనదుర్గామాత అన్నపూర్ణాదేవి రూపంలో, నీలం రంగు వస్త్రాలతో భక్తులకు దర్శనమివ్వనున్నారని అర్చకులు రావికోటి పార్థివ శర్మ తెలిపారు. అమ్మవారి అలంకరణ ( గాడ్ నెస్ అలంకరణ ), ప్రత్యేక పూజల కోసం ఆలయంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

## ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, అక్టోబర్ 12(స్కై న్యూస్):** ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై జవాబుదారీతనం కోరుతూ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను నిర్ధారించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని తన సంఘీభావాన్ని తెలిపారు.తెలంగాణ నుండి వెళ్లిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన నిరసనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత పవిత్రమైనవని, ప్రతి ఓటరు ఓటుకు విలువ ఉండాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా నుండి ఓట్ల తొలగింపు, అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించాలని కోరారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఇండియా కూటమి చేస్తున్న ఈ పోరాటంలో తామంతా భాగస్వాములమని, ప్రజల గొంతుకను ఢిల్లీలో వినిపిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## ఫరూక్నగర్ మండలంలో 15 హైమాస్ట్ లైట్లు ఏర్పాటు గ్రామీణ ప్రాంతాలకు ఎమ్మెల్యే శంకరన్న వెలుగులు

### షాద్నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్



**షాద్నగర్ (స్కై న్యూస్):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రాధాన్యతనిస్తున్నారని షాద్నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి. బాలరాజ్ గౌడ్ తెలిపారు. ఫరూక్నగర్ మండలంలోని నాలుగు గ్రామాలకు 15 హైమాస్ట్ లైట్లు మంజూరు చేసి ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సోమవారం షాద్నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగారెడ్డిగూడెంలో 3, మధురాపూర్లో 6, కమ్మదనంలో 3, సీతమ్మర గ్రామంలో 3 హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా రాత్రివేళ గ్రామాల్లో వెలుతురు అందుబాటులోకి వచ్చి ప్రజలకు రాకపోకల్లో సౌకర్యం కలుగుతుందన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రహదారులు, తాగునీరు, భవనాలు, వంతెనల నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులకు కృషి చేస్తున్నారని బాలరాజ్ గౌడ్ పేర్కొన్నారు. హైమాస్ట్ లైట్ల ఏర్పాటుపై ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివారెడ్డి, సర్పంచులు ఎంపీ రాజు, రవీందర్ రెడ్డి, లింగారెడ్డిగూడెం అశోక్, నంద్యాల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు

మంగళవారం 13 అక్టోబర్ 2026

# గాయత్రీ దేవిగా భక్తులను అనుగ్రహించిన వాసవి మాత...



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 12 (స్కై న్యూస్):**దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్దకల్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నవరాత్రి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలలో గాయత్రి హోమాన్ని చైతన్య వేదమంత్రాలతో నిర్వహించారు. అమ్మవారి అలంకార సేవ అర్చనలు కైంకర్యాలు అర్చకులు రవి ప్రద్యుమ్న నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రీ దేవిగా ప్రత్యేక పూజలు నిర్వహించిన దాతలు పల్లా నరసింహయ్య, నాగరదొడ్డి రాఘవేంద్ర గుప్తా గట్టు ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం వారిని దేవాలయం తరఫున శాలువాతో ఘనంగా సన్మానించారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించగా అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు చింగిరింత పారిజాత రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన సామ రామ్మోహన్ రెడ్డి



**హైద్రాబాద్ అక్టోబర్ 12;**మహబూబ్ నగర్. రంగారెడ్డి. హైదరాబాద్. మీజ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు చింగిరింత పారిజాత నరసింహ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా పారిజాత నరసింహ రెడ్డి సామ రామ్మోహన్ రెడ్డి ని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మీర్పేట్ సోషల్ మీడియా కన్వీనర్ బావోజు సిద్దేశ్వర చారి తో కలిసి ఎలక్షన్ ప్రచారం గురించి మాట్లాడారు.

# రామాజీపేట వెలమ సంఘానికి రూ.2 లక్షల విరాళం



**రాయికల్ అక్టోబర్ 12(స్కై న్యూస్ ):**-జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని రామాజీపేట వెలమ సంక్షేమ సంఘం అభివృద్ధికి వ్యాపారవేత్త ఉడుతల భాస్కరరావు రూ.2 లక్షల విరాళం అందించారు. హైదరాబాద్‌లో ఈ నెల 11న నిర్వహించిన రాష్ట్ర వెలమ ఆత్మీయ సమ్మేళనంలో ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సాయం అందజేశారు.వెలమ సంఘాల అభివృద్ధి, సామాజిక ఐక్యత, వర్గ అభ్యున్నతికి భాస్కరరావు చేస్తున్న కృషి అభినందనీయమని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. సంఘం అభివృద్ధికి ఆర్థికంగా అండగా నిలిచిన ఆయనకు సభ్యులు, వెలమ బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులోనూ ఇలాంటి సహకారం అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం నాయకులు యాచమనేని వెంకట రామారావు, జకిలేటి రాజశేఖర్ రావు, యాచమనేని అజయ్ రావు, దుగ్యాల రామ్ సాగర్ రావు, దుగ్యాల వేణు రావు తదితరులు పాల్గొన్నారు.

# కరువు జిల్లాగా ప్రకటించి ప్రత్యేక నిధులను కేటాయించాలి...



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 12 (స్కై న్యూస్)** రాష్ట్రవ్యాప్తంగా ఏలీనో ప్రభావం వల్ల పంట చేతికందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రస్తుత పరిస్థితులలో జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతన్న ఆదుకునేందుకు 100 కోట్లను జిల్లాకు ప్రత్యేకంగా కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వార్ల వెంకటయ్య డిమాండ్ చేశారు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులు వ్యవసాయ పంటలను సాగు చేసిన విద్యుత్ సక్రమంగా అందకపోవటం వల్ల నీరు లేకపోవడం వల్ల పూర్తిగా పంటలు ఎండిపోయాయని వివరించారు. కరువు సహాయక చర్యలలో భాగంగా రైతులకు మిర్చి పంటకు ఎకరాపు 50 వేల రూపాయలను కూరగాయలు పంటకు 20వేల రూపాయలను పరిహారం చెల్లించాలని కోరారు. రైతుల పశువులకు పశుగ్రాసం అందించాలని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 నిత్యవసర వస్తువులను సరఫరా చేయాలని రైతుల పంటల రుణాలను మాఫీ చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోశాధికారి సాయిల్ నాయుడు నాయకులు మారేడు శివశంకర్ గడ్డం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

# కరువు మండలం గా ప్రకటించి రైతులను ఆదుకోవాలి...



**తాడూర్ అక్టోబర్ 12 (స్కై న్యూస్)** తాడూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి తక్షణమే రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న డిమాండ్ చేశారు సోమవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 24 గ్రామాలలో సరైన వర్షపాతం లేకపోవడం వల్ల రైతుల వ్యవసాయం పూర్తిగా ఎండిపోయిందని అన్నారు. వ్యవసాయంపై జీవనం సాగిస్తున్న అనేకమంది రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు నిధులను కేటాయించి రైతులతో పాటు వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు గ్రామాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాశన్న నాయకులు హనుమంతు వెంకటయ్య హుస్సేన్ రాములు కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# మానవత్వాన్ని చాటుకున్న 1988-89 బ్యాచ్ స్నేహితులు

**దివంగత ఉపాధ్యాయుడు వీరశేఖర్ జయంతి సందర్బంగా పలు సేవా కార్యక్రమాలు చేసిన స్నేహితుల ఆధ్వర్యంలో**

**గద్వాల పట్టణమునకు చెందిన ?నిరుపేద ప్రైవేట్ హిందీ టీచర్ కు గుండె శస్త్ర చికిత్సకు కోసం ?40,000/- ఆర్థిక సాయం చేశారు. మరియు**

**గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, సహాయకులకు అన్నదానం చేశారు.**

**శ్రీ రవీంద్ర ఉన్నత పాఠశాల 1988--89 బ్యాచ్ పూర్వ విద్యార్థుల మహోన్నత నిర్ణయం.**





**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 12 (స్కై న్యూస్): గద్వాల:**సదా చిరునవ్వులు చిందిస్తూ, నిస్వార్థమైన స్నేహానికి, ఆప్యాయతానురాగాలకు నిలువెత్తు రూపంగా నిలిచిన ఆదర్శ ఉపాధ్యాయుడు, దివంగత వీరశేఖర్ జయంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకాలను స్మరించుకుంటూ మిత్రులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక శ్రీ రవీంద్ర ఉన్నత పాఠశాల 1988--1989 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో, టీచర్ వీరశేఖర్ కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమాలు ఘనంగా జరిపారు. ఆపదలో ఉన్నవారికి చేతనైన సాయం చేయడం, తోటివారి కష్టాల్లో తోడుగా నిలవడం వీరశేఖర్ జీవితాంతం ఆచరించిన మార్గం. ఆయన చూపిన బాటలోనే నడుస్తూ, తీవ్ర గుండె జబ్బుతో బాధపడుతూ సర్జరీ చేయించుకోలేని స్థితిలో ఉన్న ఒక నిరుపేద ప్రైవేట్ హిందీ పండిత్ వైద్య ఖర్చుల నిమిత్తం మిత్రులంతా కలిసి రూ. 40,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు.అనంతరం గద్వాల ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలో రోగులకు, వారి సహాయకులకు వీరశేఖర్ పేరిట అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.?ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ... "వీరశేఖర్ మా మధ్య భౌతికంగా లేకపోయినా, ఆయన పంచిన ప్రేమ, చిరునవ్వు, సమాజం పట్ల ఆయనకున్న బాధ్యత మా గుండెల్లో ఎప్పటికీ సజీవంగా ఉంటాయి. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే ఆయనకు మేము ఇచ్చే నిజమైన ఘననివాళి" అని భావోద్వేగంతో స్మరించుకున్నారు.?ఈ కార్యక్రమంలో దివంగత వీరశేఖర్ కుటుంబ సభ్యులు, శ్రీ రవీంద్ర ఉన్నత పాఠశాల 1988--89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు హెచ్ కె బషీర్ అహ్మద్, అమర్నాథ్, అన్వర్, ఉస్మాన్, టీచర్ రవికుమార్ ప్రభాకర్ కుటుంబ సభ్యులు, సామాజిక కార్యకర్త ముహమ్మద్ రహమతుల్లా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. బతకలేని బడిపంతులకు దీన వ్యవస్థలో ఉన్న వీరికి ఆర్థిక సహాయం చేయగలరని అందర్నీ ప్రార్థిస్తున్నాము.

# వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఆర్థిక పురోగతి లక్ష్యం...

**డిల్లీ సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 12 (స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సామాన్య రైతులు సైతం ఆర్థికంగా పురోగతి సాధించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజనను అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.జోగులాంబ గద్వాల జిల్లాలో వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి లక్ష్యంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో సోమవారం నిర్వహించిన పీఎం డీడీకేవై ఒక సంవత్సరం మైలురాయి వేడుకల్లో జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని అధికారుల బృందం హాజరైంది. సమావేశంలో వివిధ జిల్లాల్లో వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులు, వినూత్న కార్యక్రమాలు, విజయవంతమైన నమూనాలపై అధ్యయనం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, సాగు ఖర్చుల తగ్గింపు, రైతులకు సాంకేతిక సహకారం అందించడం వంటి అంశాలపై చర్చించారు. వివిధ జిల్లాల్లో విజయవంతంగా అమలవుతున్న కార్యక్రమాలను తెలుసుకుని, వాటిని జోగులాంబ గద్వాల జిల్లాలో స్థానిక అవసరాలకు అనుగుణంగా అమలు చేసే అవకాశాలను పరిశీలించారు.ఈ సమావేశం ద్వారా సేకరించిన అనుభవాలు, ఉత్తమ వ్యవసాయ పద్ధతులను పీఎండీడీకేవై లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో అమలు చేయడం ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంపొందించేందుకు చర్యలు తీసుకోనున్నారు.జిల్లా నుంచి ఈ కార్యక్రమంలో డీఏవో వీరప్ప, వ్యవసాయ శాస్త్రవేత్త అర్చన, ప్రగతిశీల రైతు ప్రహ్లాద రెడ్డి పాల్గొన్నారు.

# పి ఎం ధన్‌ధాన్య కృషి యోజన అమలులో విశిష్ట సేవలకుపేట కలెక్టర్ కు ఉత్తమ అవార్డు

**న్యూఢిల్లీలో వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ ప్రియాంక**




**నారాయణపేట అక్టోబర్ 12:( స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా లో ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన కార్యక్రమం అమలులో విశిష్ట సేవలు అందించినందుకు జిల్లా కలెక్టర్ ప్రియాంక సోమ వారం న్యూఢిల్లీలో వ్యవ సాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. వ్యవసా య రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రభుత్వ పథకా ల సమర్థవంతమైన అమ లులో జిల్లా యంత్రాంగం చేసిన కృషికి ఈ గుర్తింపు లభించడం విశేషం.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజ నాలు అందించడం, వ్యవ సాయ సంబంధిత కార్యక్ర మాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాల్లో అధికారులు అంకితభా వంతో పనిచేయడం అభి నందనీయమని పేర్కొ న్నారు. జిల్లాలో వ్యవసా య రంగానికి సంబంధిం చిన అభివృద్ధి కార్యక్రమా లను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తూ, సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ అవార్డు సాధనలో భాగస్వాములైన జిల్లా అధికారులందరికీ, వారి బృందాలకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినం దనలు తెలిపారు. ప్రతి ఒక్కరి సహకారం, కృషి, బాధ్యతాయుతమైన పనితీరు ఈ విజయానికి పునాది అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే బృంద స్ఫూర్తిని కొనసా గిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు జిల్లా అభివృద్ధిలో మరిన్ని మైలురాళ్లను సాధించాలని ఆకాంక్షిం చారు.నారాయణపేట జిల్లాకు లభించిన ఈ గుర్తింపు జిల్లా యంత్రాంగా నికి మరింత బాధ్యతను పెంచిందని, రానున్న రోజు ల్లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ అవార్డు ప్రేరణగా నిలుస్తుం దని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాత్యాయిని దేవి అలంకరణలో వాసవి మాత....

**అలరించిన శివపార్వతుల కళ్యాణం**

**సామూహిక పూజలో దంపతులు**





**నాగర్ కర్నూల్ అక్టోబర్ 12( స్కైన్యూస్)** జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న 56వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం రెండవ రోజు వాసవి కన్యకా పరమేశ్వరి మాత కాత్యాయనీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బిల్లకంటి హరిబాబు దేవాలయ కమిటీ అధ్యక్షుడు మిడిదొడ్డి అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో రెండవ రోజు ఉత్సవ విగ్రహానికి అభిషేక మహా పూజ విశేష అభిషేక పూజ కార్యక్రమాలతో పాటు సామూహిక పూజలు గణపతి సుబ్రహ్మణ్యం దుర్గ సరస్వతి లక్ష్మీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి మహానీరాజనం నిర్వహించి ఆలయ ప్రధాన అర్చకులు జోషి పాండురంగ శర్మ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. రెండవ రోజు పూజా కార్యక్రమంలో ఆర్యవైశ్య దంపతులు పాల్గొని అమ్మవార రెండవ రోజు పూజా కార్యక్రమంలో ఆర్యవైశ్య దంపతులు పాల్గొన్నారు సాయంకాలం ప్రదోష పూజ లలితా సహస్ర పారాయణంతో పాటు సామూహిక కుంకుమార్చన పుష్పార్చన హారతి పల్లకి సేవ డౌన్లోడ్ తో పాటు భజన మండలి ఆధ్వర్యంలో సాంప్రదాయం ఉట్టిపడేలా భజనలు నిర్వహించారు అనంతరం అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘంతో పాటు విద్యా కమిటీ యువజన కమిటీ ఆలయ కమిటీ మహిళా కమిటీ సభ్యులు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పలు సిండికేట్ల సభ్యులు పాల్గొన్నారు

# మైనారిటీ హాస్టల్ సమస్యలు పరిష్కరించండి...

**జోగులాంబ గద్వాల అక్టోబర్ 12 (స్కై న్యూస్):**ప్రిన్సిపాల్, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్, గద్వాల్ బాలికల–1, జోగులాంబ గద్వాల్ జిల్లా హాస్టల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించవలసిందిగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ కు వినతి పత్రం సమర్పించారు.టిజిఎంఆర్స్ గద్వాల్ జి1 విద్యార్థుల తల్లిదండ్రులమైన మేము, మా పిల్లలు ఎదుర్కొంటున్న ఈ క్రింది సమస్యలను దయచేసి పరిష్కరించవలసిందిగా మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము:



**1. నీటి సౌకర్యం:**

త్రాగునీటి నాణ్యత మరియు లభ్యతపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. త్రాగునీటి రుచి ప్రతి 2–3 రోజులకు మారుతోందని సమాచారం; అందువల్ల, నీరు సురక్షితంగా మరియు త్రాగడానికి అనువుగా ఉండేలా చూసుకోవడానికి, నీటి వనరును మరియు శుద్ధి/ వడపోత ప్లాంట్ను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. అంతేకాకుండా, విద్యార్థులకు స్నానం చేయడానికి, బట్టలు ఉతకడానికి మరియు ఇతర రోజువారీ అవసరాలకు అందుబాటులో ఉన్న నీరు సరిపోవడం లేదు. అందువల్ల, అదనపు బోర్వెల్ లేదా నిరంతర మిషన్ భగీరథ నీటి సరఫరాతో పాటు, నిరంతరాయంగా 24 గంటల నీటి సరఫరాతో రెండు మున్సిపల్ నీటి కుళాయిలను ఏర్పాటు చేయాలని మేము అభ్యర్థిస్తున్నాము. తగినంత నీటి నిల్వను నిర్ధారించడానికి, ప్రస్తుతం ఉన్న నీటి సంపు సామర్థ్యాన్ని కూడా పెంచాలి లేదా అదనపు ఓవర్హెడ్ ట్యాంక్ను ఏర్పాటు చేయాలి.

**2. వసతిగృహంలో వేడి మరియు ఫ్యాన్ సౌకర్యం:**

విద్యార్థుల వసతి గృహాలు అత్యంత పై అంతస్తులో ఉన్నాయి మరియు వాటికి రేకుల కప్పు ఉండటం వల్ల తీవ్రమైన వేడి ఉంటుంది. ఇదే సమస్య ఇతర వసతి గృహాలలో కూడా ఉంది, అక్కడ తగినంత గాలి ప్రసరణ మరియు వేడి నుండి ఉపశమనం కలిగించడానికి ఫ్యాన్ల సంఖ్య సరిపోవడం లేదు. దీని ఫలితంగా, విద్యార్థులు హాయిగా నిద్రపోవడం కష్టంగా ఉంది, మరియు అధిక వేడి కారణంగా వారి నిద్రకు తరచుగా భంగం కలుగుతోంది, ఇది వారి విశ్రాంతి మరియు శ్రేయస్సుపై ప్రభావం చూపుతోంది. అందువల్ల, తక్షణ మరియు ఆచరణాత్మక పరిష్కారంగా అదనపు సీలింగ్ ఫ్యాన్లు, గోడకు అమర్చే ఫ్యాన్లు లేదా స్టాండ్ ఫ్యాన్లను అందించాలని మేము అభ్యర్థిస్తున్నాము.

**3. దోమల సమస్య:**

విద్యార్థులు తరచుగా దోమల వల్ల ఇబ్బంది పడుతుంటారు, దీనివల్ల దురద, చికాకు మరియు కొన్నిసార్లు బొబ్బలు కూడా వస్తాయి. దోమల కాయిల్స్ తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే అందిస్తాయి, మరియు వాటి పొగ నిద్రకు అంత మంచిది కాదు.పర్యావరణం. తల్లిదండ్రులుగా, మేము కూడా దోమల నివారణ క్రీములను అందించవలసి ఉంటుంది, అయితే వాటిని రాసుకున్న తర్వాత విద్యార్థులు సరిగ్గా చేతులు కడుక్కోకపోతే ఆందోళనలు తలెత్తవచ్చు. అందువల్ల, దోమల వలలు లేదా మెష్ స్క్రీన్ల వంటి సురక్షితమైన మరియు సమర్థవంతమైన దోమల నివారణ చర్యలను చేపట్టాలని మేము అభ్యర్థిస్తున్నాము.

**ముగింపు:**

ప్రస్తుతం శీతాకాలం అయినప్పటికీ, వసతి గృహాలలో విద్యార్థులు అనుభవిస్తున్న ఇప్పటికే వేసవి పరిస్థితులతో సమానంగా ఉంది. ఇటీవలి వర్షాకాలంలో కూడా, వసతి గృహాలు వేసవిలా అనిపించేలా తీవ్రమైన 34 ఉన్న సందర్భాలు చాలా ఉన్నాయి. శీతాకాలంలో కూడా ఇంతటి వేడిని అనుభవిస్తున్నారన్న వాస్తవం, రాబోయే వేసవి నెలల్లో విద్యార్థులు ఎదుర్కోబోయే పరిస్థితుల గురించి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అందువల్ల, విద్యార్థులను అధిక వేడి నుండి రక్షించడానికి మరియు సంవత్సరం పొడవునా వారి ఆరోగ్యం, సౌకర్యం మరియు నిరాటంకమైన నిద్రను నిర్ధారించడానికి, తగినంత శీతలీకరణ, వెంటిలేషన్ మరియు ఇతర నివారణ చర్యలను ముందుగానే ఏర్పాటు చేయాలని మేము అభ్యర్థిస్తున్నాము.అందువల్ల, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత మరియు శ్రేయస్సు దృష్ట్యా, పై సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిగణించి, వీలైనంత త్వరగా అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యర్థిస్తున్నారు.

# డిండి లిఫ్ట్ ఇర్విన్ రిజర్వాయర్ రద్దు చేయాలి

**– ప్రజావాణిలో బాధిత రైతులు, గీత కార్మికుల వినతి**

**ఆమనగల్లు, అక్టోబర్ 12 (స్కై న్యూస్):** డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా మాడుగుల మండలం ఇర్విన్ గ్రామంలో నిర్మించ తలపెట్టిన ఇర్విన్ రిజర్వాయర్ ను రద్దు చేయాలని కోరుతూ బాధిత రైతులు, గీత కార్మికులు ప్రజావాణిలో ఎంపీడీవో విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.సోమవారం




మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బాధితులు తమ గోడును వినిపించారు. ఇర్విన్ రిజర్వాయర్ నిర్మాణం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని, తమ పొలాలు, ఇళ్లు, ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా తాటి చెట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గీతా కార్మికులు ఉపాధి కోల్పోతారని, వందలాది మంది రైతులు నిర్వాసితులుగా మారతారని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణంతో తమ కుటుంబాలు రోడ్డున పడతాయని, ప్రభుత్వం తమ బాధలను అర్థం చేసుకోవాలని వేడుకున్నారు.కావున ఇర్విన్ రిజర్వాయర్ నిర్మాణ ప్రతిపాదనను వెంటనే రద్దు చేసి తమకు న్యాయం చేయాలని, తమ భూములను, ఉపాధిని కాపాడాలని ఎంపీడీవోను కోరారు.అధికారులు సానుకూలంగా స్పందించి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఇర్విన్ గ్రామ బాధిత రైతులు, గీత కార్మికులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో అందుబాటులో ఉంటా...

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 12( స్కై న్యూస్)** ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు సోమవారం ఇటీవల జరిగిన ఎన్నికలలో విజయం సాధించిన యూనియన్ కు



సంబంధించిన నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ని సన్మానించారు ఈ సందర్భంగా వారు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గుర్తింపు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ 271 భారీ ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం జరిగిందని గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో యూనియన్ కు ఎలాంటి కష్టనష్టాలు ఉన్న నేరుగా సంప్రదించాలని కోరారు

# ఎల్‌నినోను సాకుగా చూపి రైతుల సమస్యల నుంచి తప్పించుకోలేరు

**కరెంటు కోతలు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే**

**బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా ప్యానలిస్టు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**

**ఆమనగల్లు, అక్టోబర్ 12(స్కై న్యూస్):**ఎల్‌నినో సహజ వాతావరణ పరిణామమే అయినప్పటికీ, దాని ప్రభావంతో రైతులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీ నరసింహా రెడ్డి అన్నారు. సోమవారం ఆమనగల్ మండల కేంద్రంలో స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎల్‌నినోను కాంగ్రెస్ ప్రభుత్వానికి అంటగడుతున్నారంటూ బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం మానుకుని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నాయకులను డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు స్పందిస్తూ, ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు లేనప్పుడు రైతులను అప్రమత్తం చేయడంతోపాటు, వారికి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జలాశయాల్లో నీటి నిర్వహణ, సాగునీటి సరఫరా, వ్యవసాయానికి నిరంతర విద్యుత్, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.రైతు భరోసా, పంట రుణమాఫీ, సన్న వడ్ల బోనస్ వంటి పథకాల గురించి కాంగ్రెస్ నాయకులు గొప్పగా చెప్పుకోవడం కాకుండా, అర్హులైన రైతులందరికీ వాటి ప్రయోజనాలు అందాయో లేదో వెల్లడించి, శ్వేత పత్రం విడుదల చేయాలని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీల అమలు, పంట నష్టపోయిన రైతులకు పరిహారం, సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలన గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీల అమలు పరిస్థితిని వివరించాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం ద్వారా ప్రస్తుత ప్రభుత్వ బాధ్యతలు తీరిపోవని అన్నారు. రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల వంటి కార్యక్రమాల ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అందించిన ప్రయోజనాలను ప్రజలు గుర్తుంచుకున్నారని తెలిపారు.ఎల్‌నినో వంటి ప్రకృతి పరిణామాలను రాజకీయాలకు ఉపయోగించుకుంటున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతుల వాస్తవ సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. ప్రకృతిని నియంత్రించడం ప్రభుత్వానికి సాధ్యం కాకపోవచ్చని, అయితే ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించడం, రైతులకు అండగా నిలవడం



ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు.ఎల్‌నినోను బీఆర్ఎస్ సృష్టించలేదు.. కానీ రైతుల కష్టాలను తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. గత ప్రభుత్వాన్ని విమర్శించడం మానుకుని,రైతులకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పంట చేతికొచ్చే సమయంలో కరెంటు కోతలతో, రైతుల పంటలు ఎండిపోతుంటే ,రైతులను అదుకోవాల్సింది పోయి ,ప్రతిపక్షాల మీద విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకుల విజ్ఞతకు వదిలేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్, చుక్కా నిరంజన్ గౌడ్,అనూషాశ్రీశైలం, అనంతుల సైదులు గౌడ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ రమేష్ నాయక్,మాజీ వార్డు సభ్యులు కోట శ్రీనివాస్, వస్పుల సాయిలు, మీసాల వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఒంటరితనం.. అనారోగ్య సమస్యలు.. వ్యక్తి మృతి

**నిడదవెల్లికి చెందిన కమ్మరి పాండ్యయ్య మృతి**

**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 12 (స్కై న్యూస్):** కేశంపేట మండలం నిడదవెల్లి గ్రామానికి చెందిన కమ్మరి పాండ్యయ్య (59) సోమవారం తెల్లవారుజామున రైలు పట్టాల వద్ద మృతిచెందారు. గత 25 ఏళ్లుగా నందిగామ గ్రామంలో వడ్రంగి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయన మృతితో కుటుంబ సభ్యులు, పరిచయస్తులు విషాదంలో మునిగిపోయారు.





పాండ్యయ్య రెండేళ్ల క్రితం భార్యను కోల్పోయారు. అప్పటి నుంచి ఒంటరిగా జీవిస్తున్న ఆయన కొంతకాలంగా కాళ్ల నొప్పులతో బాధపడుతున్నట్లు సమాచారం. ఆయన మృతికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

# కవిత్వం సమాజ ప్రయోజనకారి కావాలి



**బి. సి. సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షులు**

**భారత రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య పిలుపు**

**హైద్రాబాద్ అక్టోబర్ 12**:కవిత్వం సమాజ ప్రయోజనకారి కావాలని బి. సి. సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షులు భారత రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య అన్నారు.హైదరాబాద్ విద్యానగర్ లోని బి. సి. భవనంలో సుతారపు వెంకటనారాయణ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనం జరిగింది.ఈసందర్భంగా ముఖ్య అతిథిగా ఆర్. కృష్ణయ్య భారతదేశం సంస్కృతి సంప్రదాయలకు నిలయమనీ వాటిని కాపాడడం కవులపై ఉన్నదనీ వివిధ జాతులు మతాలు కులాల ప్రజలు సమైక్యంగా జీవించడం భారత విశిష్టత అన్నారు. భారత భవిష్యత్ ప్రపంచానికి మార్గదర్శకంగా ఉండేలా కవుల కవిత్వం కొనసాగాలని సూచించారు.కవిసమ్మేళనంలో వివిధ జిల్లాల కవయిత్రులు కవులు పున్న విజయలక్ష్మి కొమ్ము వరలక్ష్మి అబ్దుల్ షాహిద్ మహమ్మద్ రవుఫుద్దీన్ సుంకర రమేష్ పొన్నం రాజయ్య గౌడ్ మిద్దె సురేష్ రమేష్ తదితరులు కవిసమ్మేళనంలో పాల్గొన్న వారిని ఆర్. కృష్ణయ్య శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# కులవృత్తులకు అండగా నిలుస్తాం

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 12( స్కై న్యూస్)** కులవృత్తులను ఆదుకునేందుకు తన వంతు సహాయ సహకారాలను అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం కూడా కులవృత్తుల ప్రోత్సాహకానికి రుణాలను మంజూరు చేయడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు సోమవారం జిల్లా కేంద్రంలోని రామాలయం సమీపంలో నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన సంఘం నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా గౌరవ అధ్యక్షులు వనపట్ల సుబ్బయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కులవృత్తులను ఆదుకోవడం సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తించాలని కోరారు నాయి బ్రాహ్మణులు రాజకీయాలలో కూడా రాణించాలని కోరారు. కుల సంఘాల భవనాలు ఐక్యతకు ఆత్మ గౌరవానికి చైతన్యానికి ప్రతీకలు అని అన్నారు నియోజకవర్గంలో అన్ని కుల సంఘాలు సామాజిక ఆర్థిక రంగాలలో రాణించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు భవనానికి తన





నిధులనుండి ప్రహరీ కూడా డ్రైనేజీ వ్యవస్థతోపాటు సీసీ రోడ్డు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు పేద నాయి బ్రాహ్మణ కుటుంబాలకు అర్హతను బట్టి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందించారు ఈ కార్యక్రమంలో సంఘం నాయకులతో పాటు మునిసిపల్ చైర్మన్ తీగల సురేంద్ర కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు వైస్ చైర్మన్ బాదం రమేష్ పార్టీ పట్టణ అధ్యక్షులు జక్కా రాజ్ కుమార్ రెడ్డి సంఘం నాయకులతోపాటు కౌన్సిలర్ లు జయప్రకాశ్ చారి పడిగే శంకర్ కూచుకుల్లాసింధు రాజేష్ రాజేశ్వరి అలివేల రాజేష్ గౌడ్ తో పాటు పలువురు నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు తిరుపతయ్య జిల్లా అధ్యక్షులు కానుగుల శ్రీనివాస్ నాయకులు పురుషోత్తం శివుడు బాలస్వామి ఆంజనేయులు నరసింహ మల్లేష్ కరుణాకర్ మహేష్ రాములు తదితరులు పాల్గొన్నారు

# రాజ్యాధికార పాదయాత్రకు సంపూర్ణ మద్దతు...

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 12( స్కై న్యూస్)** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ రాజ్యాధికార పాదయాత్రకు బీసీ పొలిటికల్ జేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు అరవిందు చారి తెలిపారు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన సమానత్వం కోసం చేపట్టిన పాదయాత్ర ఈ నెల 15న బిజినేపల్లి కి చేరుకుంటుందని అక్కడి నుండి జిల్లా కేంద్రం వరకు కొనసాగుతుందని వివరించారు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బీసీ అన్ని కులాలు కార్మికులు కర్షకులు, ఉద్యోగులు



రాజకీయ పార్టీలకు అతీతంగా తరలిరావాలని కోరారు ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌడుగు రాజు నాయకులు బాబు శివ జితేందర్ కృష్ణ వెంకటేష్ హరి తదితరులు పాల్గొన్నారు

## హోరాహోరీగా కొనసాగుతున్న రెజ్లింగ్ పోటీలు



నారాయణపేటఅక్టోబర్12స్కైన్యూస్:దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా కొనసాగుతున్న 70వ ఎస్ జి ఎఫ్ అండర్ 14 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు నువ్వానేనా అన్నట్లు కొనసాగుతు న్నాయి.అన్ని జట్ల నుండి వచ్చిన క్రీడాకారులు అద్భు తమైన ఆటతీరును ప్రద ర్శించారు.రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుండి సుమారు 200మంది క్రీడాకారులు పాల్గొన్నారని, బరువు ఆదరితంగా జరిగే ఈ పోటీలు ఆ కేటగిరీలో సెలెక్ట్ అయిన క్రీడాకారులు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటా రని, కుస్తీ పోటీలు మన పురాణాల కాలం నుండి మన చరిత్రలో ఒక భాగం అని ఎస్ జి ఎఫ్ నారాయ ణపేట జిల్లా సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్ శెట్టి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సిములు,కార్యదర్శి రవికుమార్,ఆర్గనైజింగ్ సెక్రెటరీ రామకృష్ణ రెడ్డి, మెంబర్ సాయినాథ్,కోచ్ శ్రీనివాస్ వ్యాయమ ఉపా ధ్యాయులు వెంకటప్ప, బాలరాజు,రాజశేఖర్,నర్సింహా రెడ్డి,బస్వరాజు, బీరప్ప, శశికాంత్ రెడ్డి,రాజేష్, రమేష్ లు పాల్గొన్నారు. కుస్తీ పోటీలు తిలకించడా నికి కానుకుర్తి గ్రామ పెద్దలు యువత పెద్దఎత్తున హాజ రయ్యారు.

## పటిష్ట ప్రణాళికతో రీసర్వే నిర్వహించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్, అక్టోబర్ 12,(స్కై న్యూస్ ప్రతినిధి ):**పటిష్ట ప్రణాళికతో గ్రామాల్లో రీ సర్వే నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సర్వే అధికారులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ... రీ సర్వేలో సర్వే అధికారులు, రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమన్నారు.గ్రామాల్లో రైతులకు రీసెర్వేపై అవగాహన కల్పించి, పలు సందేహాలను నివృత్తి చేయాలన్నారు.రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో 9(2) నోటీసులు అందిన వారి అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. రీ సర్వే కార్యక్రమాన్ని రెవెన్యూ ,సర్వే శాఖల సమన్వయంతో నిర్వహించాలన్నారు.పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్ళినప్పుడే ప్రజలు అడిగే సందేహాలను నివృత్తి చేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఏడి సర్వే కిషన్, రెవెన్యూ డిప్యూటీ తహసిల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు,సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**- డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్**



**మెదక్, అక్టోబర్ 12,(స్కై న్యూస్ ప్రతినిధి ):** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ ఆదేశించారు.సోమవారం మెదక్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 83 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు



చేయడంతో పాటు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భూభారతి 33, ఇందిరమ్మ ఇండ్లు 13, పెన్షన్లు 04, ఇతర 33 మొత్తం 83 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి



**నారాయణపేట అక్టోబర్ 12( స్కై న్యూస్)** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి రమేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వివరిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 20 ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆర్డీఓ రమేష్ మాట్లాడుతూ, ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎలికట్ట-శ్రీరంగాపూర్ రహదారిపై ప్రమాదాల ముప్పు

**ప్రమాదం అంచున ప్రయాణం!**

**ఎలికట్ట--శ్రీరంగాపూర్ రహదారిపై వాహనదారుల నరకయాతన**

**గుంతలు, భారీ వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు..**

**అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్):** ఎలికట్ట--శ్రీరంగాపూర్ రహదారిపై ప్రయాణం వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. రహదారిపై గుంతలు, ఇరువైపులా భారీ వాహనాల పార్కింగ్, దుమ్ము, ధూళి కాలుష్యం, స్పీడ్ బ్రేకర్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేవిశ్రీ, అదానీ పరిశ్రమలకు చెందిన భారీ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా నిలిపివేయడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడుగడుగునా ప్రమాదాల ముప్పు రహదారిపై గుంతలు, రోడ్డుకు అడ్డంగా నిలిపిన భారీ వాహనాల కారణంగా ఎదురెదురుగా వచ్చే



వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దుమ్ము, ధూళితో ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా, స్పీడ్ బ్రేకర్లు కూడా వాహనదారులకు సమస్యగా మారాయని పేర్కొంటున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా? ఈ మార్గంలో గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అయినప్పటికీ రహదారి సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించాలి రోడ్డుకు ఇరువైపులా నిలిపే భారీ వాహనాలను తొలగించాలని, గుంతలకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి, రహదారిపై దుమ్ము నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# తక్షణమే సాగు నీటిని విడుదల చేయాలి

**నిర్లక్ష్యం వీడకపోతే ప్రాజెక్టుల ముట్టడి.**

**మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.**

**నాగర్ కర్నూల్ కొల్లాపూర్ అక్టోబర్ 12 (స్కైన్యూస్)** శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల రైతుల పంటలు ఎండిపోతున్నాయని మొద్దు నిద్ర విడకపోతే ప్రాజెక్టులను ముట్టడిస్తామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హెచ్చరించారు సోమవారం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలిసి నార్లాపూర్ రిజర్వాయర్ నువ్వు సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ మరియు పంప్ హౌస్ సిద్ధంగా ఉన్న మంత్రి జూపల్లి నిర్లక్ష్యం వల్లే రైతుల పంటలకు నీరు పంపిణీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వానకాలం పంటలు ఎండిపోయి రైతులకు వేలాది కోట్ల నష్టం జరుగుతుందని ప్రభుత్వం ఎన్నికల ముందు 24 గంటల ఉచిత విద్యుత్ హామీ ఇచ్చి నేను 6:00 కూడా సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రైతులకు సాగునీరు ఇవ్వకపోయినా సరే



పీర్ల తయారీకి మాత్రం నీరు ఇవ్వాలని కోరడం ఆయన ఎవరి వైపు రైతులు తేల్చుకోవాలని అన్నారు. రెండు రోజుల్లో నీటిని సరఫరా చేయకపోతే ప్రాజెక్టులను ముట్టడించి తమ సత్తా చాటుతామని హెచ్చరించారు మాజీ ముఖ్యమంత్రి తమ ప్రభుత్వ హయాంలో 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు మోటర్లను ప్రారంభించి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు సంవత్సరాలలో రైతుల పంటలు ఎండిపోయేందుకు పాలకుల కుట్రలే కారణమని అన్నారు కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో రెండు మోటార్లే పనిచేస్తున్నాయని మిగతా మూడు మోటర్లు ఎందుకు పనిచేయడం లేదని నిలదీశారు అసమర్థ ప్రభుత్వాన్ని గద్దదించాలని కోరారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల సొంత జిల్లాకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. రైతుల పొలాలకు నీరు ఇవ్వలేని మంత్రి జూపల్లి కృష్ణారావు బూతులు తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు సందర్భంగా కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు గత కొద్ది కాలంగా సాగునీరు సరఫరా చేయాలని నిరసనలు వ్యక్తం చేస్తున్న పట్టించుకోవడంలేదని విమర్శించారు. మంత్రి జూపల్లికి లిక్కర్ కాంట్రాక్టర్లపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదన్నారు మంత్రి జూపల్లి నిర్లక్ష్యం వల్లే రైతుల పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆరోపించారు జూరాల గోపాలదిన్నె లింక్ కెనాల్ ను పూర్తిచేసి పంట పొలాలను కాపాడాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ తో పాటు పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# అన్నదానానికి మించిన గొప్ప దానం మరొకటి లేదు

**-జన్మదినం సందర్భంగా నిరుపేదలకు భోజన పంపిణీ**

**-సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

**-టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు కోయిలకొండ నారాయణరెడ్డి**

**నారాయణపేట అక్టోబర్ 12( స్కైన్యూస్ )** అన్నదానానికి మించిన గొప్ప దానం మరొకటి లేదని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కోయిలకొండ నారాయణరెడ్డి అన్నారు. పుట్టినరోజు వేడుకలను కేవలం వ్యక్తిగత సంబరాలకే పరిమితం చేయకుండా, నిరుపేదలకు సేవ చేసే కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఆ రోజుకు మరింత సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సత్యనారాయణ చౌరస్తాలో లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మీల్స్ ఆన్ వీల్స్' కార్యక్రమంలో ఆయన పాల్గొని నిరుపేదలకు భోజనాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కోయిలకొండ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ కనీస అవసరాలను తీర్చుకోలేని పేదలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. తమకు చేతనైనంత మేరకు ఆపన్నులకు సహాయం అందిస్తూ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కంటే గొప్ప సేవ మరొకటి లేదని, నిరుపేదల ఆకలి తీర్చడం ద్వారా లభించే సంతృప్తి వెలకట్టలేనిదని పేర్కొన్నారు.నారాయణపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాదాపు వంద రోజులుగా ప్రతిరోజూ మధ్యాహ్నం నిరుపేదలకు భోజనం అందించడం అభినందనీయమని నారాయణరెడ్డి అన్నారు. నిరుపేదల ఆకలి తీర్చాలనే సంకల్పంతో నిరంతరాయంగా సేవా కార్యక్రమాన్ని కొనసాగించడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని, పరస్పర సహకార భావనను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు.తన జన్మదినం సందర్భంగా నిరుపేదలకు భోజనం అందించే కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. జన్మదిన వేడుకలకు అనవసర ఖర్చులు చేయడం కంటే, పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతృప్తినిస్తుందని అన్నారు. భవిష్యత్తులోనూ తన వంతుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానని పేర్కొన్నారు.ఈ




కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, లయన్ కన్న జగదీష్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ సభ్యుడు నక్క శ్రీనివాస్, జిల్లా ఆరోగ్య విభాగం కన్వీనర్ సంజీవ ప్రకాష్ ముదిరాజ్, జిల్లా విద్యా విభాగం కన్వీనర్ రాజేష్ కుమార్, జిల్లా ప్రచార విభాగం ప్రతినిధి సురేష్,ఉపాధ్యక్షులు తఖీ,బోయ శ్రీనివాస్, చక్రి లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

**పట్టభద్రుల ఓటరు నమోదుపై బీఆర్ఎస్ దృష్టి.. నడిగూడెంలో అవగాహన సదస్సు**

**అర్హులైన ప్రతి పట్టభద్రుడి పేరును ఓటరు జాబితాలో చేర్చాలి.. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**

**కోదాడ, అక్టోబర్ 12 (స్కై న్యూస్):** రాబోయే వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించే ప్రక్రియపై బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సూచించారు. నడిగూడెం మండలం తెల్లబల్లి గ్రామంలో మండల పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన ఓటరు నమోదు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

**హామీల అమలుపై ప్రజల్లో చర్చ జరగాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు లక్షల ఉద్యోగాల హామీ ఇచ్చిందని, ఆ హామీ అమలుపై నిరుద్యోగుల్లో ప్రశ్నలు ఉన్నాయని బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, ప్రస్తుత ప్రభుత్వ హామీల అమలుపై వాస్తవాలతో చర్చించాలని పేర్కొన్నారు.

**అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు**



ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్యులు, న్యాయవాదులు, బ్యాంకు ఉద్యోగులతో పాటు డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు నిండిన అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని ఆయన సూచించారు. గ్రామాలు, మండలాల వారీగా ఓటరు నమోదు పర్యవేక్షణకు సమన్వయకర్తలను నియమించినట్లు తెలిపారు. ఇప్పటికే గతంలో ఓటరుగా నమోదైన వారు కూడా తాజా ఓటరు జాబితాలో పేరు చేర్చుకునేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన పట్టభద్రులందరి ఓటరు నమోదు పూర్తయ్యేలా కృషి చేయాలని బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు.

వార్తాతరంగాలు

మంగళవారం 13 అక్టోబర్ 2026

# సరళీకరణేనా?

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో మరో విడత సంస్కరణల పేరిట జీఎస్టీ కౌన్సిల్ తన 57వ సమావేశంలో కొన్ని కీలక ప్రతిపాదనలు చేసింది. దేశంలో జీఎస్టీని ప్రవేశపెట్టినప్పుడు ఏ ఆదర్శాలూ ఆశయాలూ చెప్పుకున్నామో వాటికి అనుగుణంగా ఈ సరికొత్త చర్యలు ఉన్నాయంటూ వీటి సమర్థకులు సంతోషిస్తున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నది ఇప్పుడు దేశంలో సర్వత్రా వినిపిస్తున్న మంత్రం కనుక, తీసుకున్న ఈ నిర్ణయాల్లో అత్యధికం వ్యాపారవర్గాలు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నదానికి అనుగుణంగా, వారికి అనుకూలమైనవిగా ఉండటం సహజం. జీఎస్టీ అధికారుల చేతిలో ఉన్న అరెస్టు అధికారాలను రద్దుచేయడం వ్యాపారులకు కచ్చితంగా ఉపశమనం కలిగించే చర్య. పన్ను వివాదం దర్యాప్తు దశలో ఉన్నప్పుడు చెల్లింపుదారుకు అరెస్టు భయంలేకుండా ఉంటుంది. నిర్దిష్ట సమాచారం ఉన్నప్పుడు మాత్రమే వాహనాలను ఆపి చెక్‌చేయాలన్న నియమం కూడా రాబోతున్నది కనుక, అనుమానం ఉన్నా లేకున్నా ఎక్కడపడితే అక్కడ సరుకును ఆపి తనిఖీలు చేయడానికి కూడా అధికారులకు ఇక అధికారాలు ఉండవు. సరుకుల స్వాధీనం కూడా వాటి ఆరంభంలోనో, చివరిలోనో జరగాలన్న మరో వెసులుబాటువల్ల వాహనాలు మధ్యదారి అంతా నిర్భయంగా సాగిపోవచ్చు. నేరవిచారణ చేపట్టాలంటే పన్ను ఎగవేత ఐదుకోట్లు దాటాలంటూ ప్రస్తుతం ఉన్న పరిమితిని ఏకంగా ఐదురెట్లు పెంచడం కూడా వ్యాపారులకు ఊరట కలిగించేదే. అత్యధికశాతం క్లెయిమ్స్‌ను సత్వరమే పరిష్కరించి, మూడురోజుల్లోనే రిఫండ్ అందేట్టు చేయడం కూడా వారికి ఉపశమనం కలిగించేదే. రిఫండ్ ప్రక్రియలను వేగవంతం చేయడం వంటివి ప్రధానంగా చిరువ్యాపారులకు పెద్ద ఊరట. చిన్నచిన్న పొరపాట్లు అని పాలకులు, వ్యాపారులు భావిస్తున్నవన్నిటిపైనా ఇకపైన మహా అయితే జరిమానాలు ఉంటాయేమో తప్ప అంతకుమించిన చర్యలేమీ ఉండవు. అత్యధికశాతం కేసుల్లో ఆ జరిమానా పరిమాణం కూడా మూడోవంతుకు తగ్గిపోబోతోంది. వ్యాపార నిర్వహణను మరింత సరళం, సులభం చేసేందుకు ఈ ప్రతిపాదనలు ఉపకరిస్తాయనీ, వ్యాపారవర్గాలు, పన్నుచెల్లింపుదారులపై నమ్మకమే ఈ సంస్కరణలకు ప్రాతిపదిక అనీ ఆర్థికమంత్రి అంటున్నారు. ప్రక్రియల పరంగా 99శాతం సవాళ్ళను పరిష్కరించిన ఈ కొత్తతరం జీఎస్టీ సంస్కరణలు కేంద్రానికీ, రాష్ట్రాలకు కూడా సుస్థిర ఆదాయాన్ని తెచ్చిపెడతాయని ఆమె హామీ ఇస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి అమల్లోకి రాబోతున్న ఈ సంస్కరణల వెనుక, ఏడు రాష్ట్రాల ఎన్నికల ప్రభావం కూడా ఉన్నదని, వాటిలో ప్రధానంగా పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలు ఉన్నాయని కొందరు వక్రభాష్యాలు కూడా చెబుతున్నారు. కఠినమైన పన్ను విధానాలతో ఇబ్బంది పడుతున్న వ్యాపారరంగానికి భారీ ఊరట కలిగించే ఈ చర్యలను ఇప్పటివరకూ జీఎస్టీ కౌన్సిల్ ఎందుకు ఉపేక్షించిందో తెలియదు కానీ, ఇదంతా సరళం చేయడం కాదు, ప్రక్రియలను బలహీనపరచి అధికారుల చేతులు కట్టివేయడమని కొందరి విమర్శ. కౌన్సిల్ ప్రతిపాదించిన కొన్ని చర్యలు వ్యాపారవర్గాల్లో నేరభయం తగ్గించి, మరిన్ని అడ్డుతోవలకు, ఎగవేతలకు అవకాశం ఏర్పరుస్తుందన్న వాదనలూ లేకపోలేదు. అరెస్టు అధికారాన్ని జీఎస్టీ అధికారులకు మొదట ఏ ఉద్దేశాలతో, లక్ష్యాలతో కల్పించారో, ఇప్పుడు అవే ఎందుకు పనికిరాకుండా పోయాయో, వాటిని ఇంతకాలం తరువాత ఏ ప్రాతిపదికన తొలిగించారో తెలియదు. సులభతరం చేయడం పేరిట విధానాలను, నిబంధనలను బలహీనపరచకుండా జాగ్రత్తపడటం ముఖ్యం. గత ఏడాది సెప్టెంబర్ నుంచి అమలులోకి వచ్చిన తక్కువ జీఎస్టీ రేట్ల వల్ల ఎలాంటి ఆదాయ నష్టం జరగలేదని ఆర్థికమంత్రి ఒప్పుకున్నందుకు సంతోషించాలి. అప్పటివరకూ ఉన్న నాలుగుస్లాబులను రెండుగా కుదించడం వల్ల చాలా సరుకుల ధరలు తగ్గి సామాన్యుడికి కాస్తంత ఉపశమనం కలిగింది. ప్రజలే కాదు, వ్యాపారులు సైతం పలు రకాల స్లాబులతో తమకు ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వానికి ఏకరువుపెట్టారు. ఆహారపదార్థాలపై వివిధరకాల జీఎస్టీలు ఉండటంతో కస్టమర్లనుంచి తాము ఎదుర్కొంటున్న ఫిర్యాదులను కోయంబత్తూరుకు చెందిన ఒక హోటల్ వ్యాపారి ఆర్థికమంత్రికి వివరిస్తున్న వీడియో ఒకటి బయటకు పొక్కిన విషయం తెలిసిందే. క్రీమ్--బన్, స్వీట్లు--కారాలు మధ్య జీఎస్టీలో ఉన్న తేడాపాడాలను ఆయన ఎంతో చక్కగా వివరించారు. స్లాబుల హేతుబద్ధీకరణతో ఈ రకమైన సమస్యలను పరిష్కరించిన ప్రభుత్వం ఇప్పటికీ పెట్రోల్, డీజిల్‌ను మాత్రం జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు మాత్రం ససేమిరా అంటోంది. సామాన్యుడికి నేరుగా మేలు చేసే ఇటువంటి నిర్ణయాలు మరిన్ని జరిగినప్పుడే దానిని గుడ్ అండ్ సింపుల్ టాక్స్ అని పిలుచుకోవడానికి అతడికి మనసొప్పుతుంది, దాని ఆశయం కూడా నెరవేరుతుంది.




# ఈ బంగారు తల్లులు ఎందరికో స్ఫూర్తి



ఇటీవల జపాన్‌లోని ఐచీ నగోయాలో అట్టహాసంగా ముగిసిన ఆసియా క్రీడల్లో భారత్ అత్యద్భుతమైన ప్రదర్శన కనబర్చింది. భారత క్రీడాకారులు 21 బంగారు పతకాలు సహా మొత్తం 85 పతకాలు సాధించి 140 కోట్ల మంది భారతీయులు గర్వపడేలా చేశారు. 2022లో చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో సత్తా చాటినట్లుగానే, ఈసారి జపాన్ ఏషియాడ్‌లోనూ మనవాళ్లు అదరగొట్టారు. గత దశాబ్దకాలంగా భారతదేశంలో క్రీడాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహం కారణంగా మన క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై నిలకడ ప్రదర్శన కనబరుస్తున్నారు. 1982లో ఢిల్లీ వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలుచుకున్న భారత మహిళల హాకీ జట్టు.. 44 ఏళ్ల తర్వాత ఈ ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలుచుకుంది. 17 ఏళ్ల కుముద్ మహోద్.. ఆర్చరీ మహిళల విభాగంలో స్వర్ణం గెలుచుకుని.. 1998 నుంచి ఆసియా క్రీడల్లో ఆర్చరీలో కొరియా మహిళల ఆధిపత్యానికి చెక్ పెట్టారు. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ అనే చిన్న గ్రామం నుంచి వచ్చిన చికిత తానిపర్తి.. కాంపౌండ్ ఆర్చరీలో బంగారు పతకాన్ని గెలుచుకోవడం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకం. ఆ కుటుంబం పడిన శ్రమకు, చేసిన త్యాగాలకు ఈ విజయం గొప్ప బహుమానం. అద్భుతమైన టాలెంట్ ఉన్న చికిత.. హరియాణాలోని సోనిపత్‌లో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో చేరి, కోచ్ వివేక్ కుమార్ ప్రోత్సాహంతో ఎంతో సాధన చేశారు. దీని ఫలితంగానే ఇవాళ ఆసియాడ్ ఆర్చరీలో భారత్ ఖాతాలో స్వర్ణం చేరింది. ఇదే విభాగం నుంచి విజయవాడ అమ్మాయి జ్యోతి సురేఖ స్వర్ణం సాధించి మరెందరికో ఆదర్శంగా నిలిచారు.

ఇక, 400 మీటర్ల హర్డిల్స్ పరుగులో విథియా రామరాజ్ 42 ఏళ్ల నేషనల్ రికార్డును బద్దలు కొట్టారు. 1984 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో పీటీ ఉష రికార్డును అధిగమించారు. ఇలాంటి ఎన్నో కుటుంబాల కృషి ఫలితమే ఇవాళ మెరికల్లాంటి క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై మన త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తున్నారు. మనందరం గర్వపడేలా చేస్తున్నారు. భారత్ సాధించిన 21 బంగారు పతకాల్లో సగం పతకాలను మహిళలే సాధించారు. వీరేమీ సకల సౌకర్యాలున్న నేపథ్యం నుంచో, బాగా డబ్బున్న కుటుంబాల నుంచో రాలేదు. వీరిలో ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించి.. వారి పరిస్థితులు సహకరించకపోయినా.. కష్టనష్టాలకు ఓర్చి ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకుని వీరికి క్రీడల్లో శిక్షణ అందించారు. క్రీడాకారుల కృషికి.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. ఖేలో ఇండియా, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్), టార్గెట్ ఏషియన్ గేమ్స్ గ్రూప్ (టాగ్++) వంటి పథకాల ద్వారా అండగా నిలిచింది. టాప్స్ పథకంలో భాగంగా వారికి జాతీయ కోచింగ్ క్యాంపుల్లో శిక్షణ, అంతర్జాతీయ స్థాయి ట్రైనింగ్ సెషన్స్‌తో పాటు విదేశాల్లోనూ శిక్షణ అందిస్తోంది. అవసరమైనచోట విదేశీ నిపుణులను, కోచ్‌లను, సపోర్టింగ్ స్టాఫ్‌ను నియమిస్తోంది. అవసరమైన క్రీడాసామగ్రిని, శిక్షణ వసతులను సమకూర్చుతోంది. అంతేకాదు, ఖేలో ఇండియా పథకం ద్వారా 2,786 మంది క్రీడాకారులను వెన్నంటి ప్రోత్సహిస్తోంది. ఈ ఆసియా క్రీడల్లో మన మహిళా క్రీడాకారులు.. ఆర్చరీ, హాకీ, క్రికెట్, అథ్లెటిక్స్‌లోనే కాకుండా అనేక క్రీడల్లో తమ సత్తా చాటారు. గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్, బాక్సింగ్‌లో పర్వీన్ హుడా, లవ్లీనా బోర్గోహైన్, షూటింగ్‌లో నీరూ ధాండాతో పాటు టీం, మిక్స్‌డ్ ఈవెంట్లలోనూ మహిళా క్రీడాకారులు అద్భుతంగా రాణించారు. దేశ ప్రాధాన్యతాంశాల్లో స్పోర్ట్స్‌కు కూడా కేంద్రం పెద్దపీట వేసింది. తాజా ఆసియాడ్ ఫలితాల నేపథ్యంలో మరింత ఉత్సాహంతో ముందడుగేయనుంది. అంతర్జాతీయ క్రీడల్లో మన ఆటగాళ్లు మెరుగైన ఫలితాలు సాధించేందుకు నిరంతరం అండగా నిలబడుతూనే ఉంటుంది. అహ్మదాబాద్‌లో 2030లో కామన్‌వెల్త్ గేమ్స్ జరగనున్నాయి. అలాగే 2036 ఒలింపిక్స్ క్రీడలను భారత్‌లో నిర్వహించాలన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కల నెరవేరే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఒలింపిక్స్ నిర్వహణ కోసం భారత్‌తో పాటుగా మరో 6 దేశాల బిడ్స్‌ను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ ఒలింపిక్స్ సంఘం స్పష్టం చేసింది. కాగా, రానున్న ఒలింపిక్ క్రీడల్లో, అంతర్జాతీయ పోటీల్లో సాధ్యమైనన్ని ఎక్కువ ఈవెంట్లలో మన క్రీడాకారులు పాల్గొనాలని 80వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి మోదీ సూచించారు. ఒలింపిక్ క్రీడల్లో దాదాపు 40 స్పోర్ట్స్, దాదాపు 325 ఈవెంట్లు ఉంటే, ఇందులో కనీసం మూడింట రెండొంతుల ఈవెంట్లలో కూడా భారతదేశం పాల్గొనలేకపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొన్నింటిలో కనీసం అర్హత కూడా సాధించలేకపోతున్నామన్నారు. 2036 నాటికి అన్ని క్రీడాంశాలపై దృష్టి సారించాలని యువతకు మోదీ పిలుపునిచ్చారు. దీంతో ప్రధానమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారి సామర్థ్యాలకు సానబెట్టి 2036 ఒలింపిక్స్‌లో భారతదేశం వీలైనన్ని ఎక్కువ పతకాలను సాధించే దిశగా.. క్రీడామంత్రిత్వ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రపంచ క్రీడాపటంలో భారత్ అగ్రస్థానంలో నిలవాలంటే.. అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం, వారికి మెరుగైన శిక్షణ అందించడం, శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడం అవసరం. ఇందుకోసం అన్ని వ్యవస్థల సమన్వయంతో క్రమబద్ధంగా ముందుకు సాగాలి. క్రీడలు, యువజన వ్యవహారాలకు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెట్ గత 12 ఏళ్లలో దాదాపు 4 రెట్లు పెరిగింది. 2013--14లో రూ.1,219 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.4,480 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. భారత క్రీడా రంగాన్ని సమూలంగా మార్చే లక్ష్యాల్లో భాగంగా 2026--27 నుంచి 2030--31 వరకు 'ఖేలో ఇండియా' పథకాన్ని కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.29,054 కోట్లు కేటాయించింది. అథ్లెట్లు, పారా--అథ్లెట్లకు సహకారం అందిస్తూనే, ఆదివాసీ క్రీడలు, వెనుకబడిన ప్రాంతాల్లోని క్రీడాకారులకు అండగా నిలిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టేలా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు 2021లో ప్రారంభించిన 'ఖేలో ఇండియా మహిళల (అస్మిత) లీగ్' ద్వారా ఇప్పటివరకు 700 నగరాల్లో, 38 ఈవెంట్లలో 3,500కు పైగా పోటీలు జరిగాయి. ఇందులో 6 లక్షలకు పైగా మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు. ఇవన్నీ భారత క్రీడాప్రతిభను వెలికితీస్తూ, వారిని దేశానికి ప్రాతినిధ్యం వహించేలా ప్రోత్సహించేందుకు మోదీ సర్కారు చేపడుతున్న కార్యక్రమాలకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఐచీ నగోయా ఆసియాగేమ్స్, స్కాట్లాండ్‌లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ విజయాలు, మన మహిళా క్రీడాకారుల అద్భుత ప్రదర్శన.. క్రీడా రంగంలో భారత్ మరిన్ని శిఖరాలను అధిరోహించేందుకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఈ విజయాల వెనుక క్రీడాకారుల కఠోర సాధన ఉంది, తల్లిదండ్రుల త్యాగం ఉంది, శిక్షకుల కృషి ఉంది. అందుకు తోడైన ప్రభుత్వ ప్రోత్సాహం కూడా ఉంది. భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన, పతకాలు సాధించిన మన బంగారు తల్లులు.. తమలాంటి లక్షలాది బాలికలకు 'నేనూ సాధించగలను' అనే నమ్మకాన్ని అందించారు. ఆ నమ్మకానికి అవకాశాలు కల్పించడం, ఆ అవకాశాలను విజయాలుగా మలచడం మనందరి బాధ్యత. ఇవాళ దేశం గర్వించేలా ఆడిన ఈ ఆడబిడ్డల స్ఫూర్తితో.. రేపు మరెందరో బాలికలు, యువతులు ప్రపంచం గర్వించేలా ఎదగాలి. వారి మెడలో పతకం మెరిసిన ప్రతిసారీ.. భారతదేశ కీర్తి కిరీటంలో మరో మణి చేరాలి. ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంలో.. అక్టోబర్ 7న ఢిల్లీలో నిర్వహించిన బహిరంగ సభలో.. ప్రధానమంత్రి మోదీ 'వి విల్ డూ ఇట్' (మనం చేయగలం) అనే స్ఫూర్తిమంత్రాన్ని మనకిచ్చారు. దీని ప్రేరణతో మనమంతా కలిసి క్రీడాశక్తిని మేల్కొలిపి భారతదేశానికి కీర్తిప్రఖ్యాతులు అందిద్దాం.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి...

**నవంబర్ 6లోగా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి - కల్వకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు షాబుద్దీన్**



**ఆమనగల్లు, అక్టోబర్ 12(స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కల్వకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు షాబుద్దీన్ మాట్లాడుతూ రంగారెడ్డి--హైదరాబాద్--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 2023 నవంబర్ 1వ తేదీ నాటికి లేదా అంతకుముందు డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. 2026 నవంబర్ 6 దరఖాస్తులకు చివరి తేదీ కావడంతో అర్హులైన వారు చివరి రోజు వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని షాబుద్దీన్ కోరారు. యువత, ఉద్యోగులు, ఇతర పట్టభద్రులు ఈ విషయంపై అవగాహన కలిగి ఉండాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటర్ల జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, వార్డు సభ్యులు భానుకిరణ్, మండల సోషల్ మీడియా కన్వీనర్ రమేష్, ప్రవీణ్ గౌడ్, గంజి చంద్రశేఖర్, శ్రీకాంత్ మరియు తదితరులు ఉన్నారు.

## రామాయంపేటలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్, అక్టోబర్ 12,(స్కై న్యూస్ ప్రతినిధి ):** రైతులకు వ్యవసాయ రంగంలో అందుతున్న సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం రామాయంపేట మండలంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరయ్యారు. రైతులకు వ్యవసాయ రంగానికి సంబంధించిన సమాచారం, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.రైతులకు అవసరమైన సూచనలు, వ్యవసాయానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు అందించడంతో పాటు వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సమస్యలపై చర్చించే అవకాశం కల్పిస్తున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సీపీఓ సురేష్, రామాయంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా, వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్ పాల్గొన్నారు.అలాగే 4వ వార్డు కౌన్సిలర్ బైరం స్వప్న కుమార్, 7వ వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా, 11వ వార్డు కౌన్సిలర్ డాకీ శ్యామల స్వామి, 2వ వార్డు కౌన్సిలర్ కొక్కు ప్రవీణ్, ఆదర్శ రైతు అశోక్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## క్రిప్టో కరెన్సీ పెట్టుబడుల పేరుతో రూ.10 కోట్ల టోకరా

**రెండేళ్లలో పెట్టుబడి రెట్టింపు చేస్తామంటూ వందలాది మందికి వల**

**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 500 మంది బాధితులు**

**ఐటీసీ గ్లోబల్ పేరుతో పోంజీ స్కీం నిర్వహించినట్లు ఆరోపణలు..**

**ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు**

**హైదరాబాద్:**క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే రెండేళ్లలోనే రెట్టింపు లాభాలు వస్తాయంటూ ఆశ చూపి ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఐటీసీ గ్లోబల్ పేరుతో పోంజీ, మల్టీలెవల్ మార్కెటింగ్ తరహాలో పెట్టుబడి పథకాన్ని నిర్వహిస్తూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వందలాది మందిని మోసం చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఈ పథకం ద్వారా రూ.10 కోట్లకు పైగా వసూలు చేసి ఉండవచ్చని, బాధితుల సంఖ్య సుమారు 500 వరకు ఉండవచ్చని అనుమానిస్తున్నారు.ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కేసు వివరాలను వెల్లడించారు.బాధితుల ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, పెట్టుబడుల పేరుతో సాగిన వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన ఇద్దరిని గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు.

**రూ.7.50 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయిన బాధితుడు**

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన జువ్వక నర్సింలు 2023లో ఐటీసీ గ్లోబల్ ప్రతినిధుల మాటలు నమ్మి రూ.7.50 లక్షలు పెట్టుబడిగా పెట్టినట్లు పోలీసులు గుర్తించారు.

రెండేళ్లు గడిచినా హామీ ఇచ్చిన ప్రకారం పెట్టుబడి సొమ్ము తిరిగి రాకపోవడంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో పెట్టుబడుల పథకం వెనుక ఉన్న వ్యక్తుల వివరాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు.

**ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు**

ఈ కేసులో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందిన సంస్థ వ్యవస్థాపకుడు పొలమారశెట్టి రత్నరాజు, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సహ వ్యవస్థాపకుడు దొండపాటి లక్ష్మణరావు అలియాస్ లాజరస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరితో పాటు మరో నలుగురిపై కూడా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.నిందితులకు సంబంధించిన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వారి ఆర్థిక లావాదేవీలు, పెట్టుబడుల సేకరణ విధానం, ఇతర వ్యక్తుల ప్రమేయంపై విచారణ కొనసాగిస్తున్నారు. జహీరాబాద్, రాజమండ్రి ప్రాంతాల్లో వారికి సంబంధించిన ఆస్తుల వివరాలను కూడా సేకరిస్తున్నట్లు సమాచారం. జూ

## బిజినెస్

### నెట్‌ఫ్లిక్స్‌లో ఉద్యోగాల కోత.. వచ్చే వారమే ప్రకటన..!




**ఇంటర్నెట్ డెస్క్:** ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్ ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోంది తమ మొత్తం సిబ్బందిలో దాదాపు 5 శాతం మందిని తొలగించేందుకు ప్రణాళికలు చేస్తోంది. వచ్చే వారం దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఈ మేరకు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ.. ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి. వీటిపై స్పందించేందుకు నెట్‌ఫ్లిక్స్ నిరాకరించింది. ఈ ఓటీటీ సంస్థ 2022లో భారీగా ఉద్యోగులను తొలగించింది. కంపెనీ వృద్ధి మందగించడం, సబ్‌స్క్రైబర్ల సంఖ్య తగ్గడంతో నాడు వందలాది మందిపై వేటు పడింది. గతేడాది చివరి నాటికి నెట్‌ఫ్లిక్స్‌లో సుమారు 16వేల మంది ఫుల్-టైమ్ ఉద్యోగులు ఉన్నారు. ప్రస్తుతం స్ట్రీమింగ్ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ నెలకొంది. మరోవైపు ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం యూట్యూబ్ ప్రకటన ఆదాయంలో, వీక్షకుల సంఖ్యలోనూ వేగంగా విస్తరిస్తోంది. ఈ క్రమంలో పోటీని ఎదుర్కొని ఆదాయాన్ని పెంచుకోవడానికి నెట్‌ఫ్లిక్స్ వ్యూహాలను మారుస్తోంది. ఇందులో భాగంగానే ప్రకటనల ఆధారిత ప్లాన్లు, లైవ్ ప్రోగ్రామింగ్, గేమింగ్ విభాగాల్లోకి పెట్టుబడులను మళ్లించడం వంటివి చేస్తోంది.

### దేశ విధానాలను బిలియనీర్‌లు నిర్దేశించలేరు.. ఎలాన్ మస్క్‌కు కమల్ హాసన్ కౌంటర్..!



భారతదేశానికి ప్రధాని అంబానీనా అంటూ టెస్లా స్పేస్‌ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలకు ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశ విధానాలను ఏ బిలియనీర్ నిర్దేశించలేరని వ్యాఖ్యానించారు. కమల్ హాసన్ కౌంటర్‌కు నటి, ఎంపీ కంగనా రనౌత్ కూడా మద్దతు తెలిపారు. భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు లైసెన్సింగ్ ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై ఎలాన్ మస్క్ సోషల్ మీడియాలో స్పందించారు. భారత ప్రధాని అంబానీనా..? అంటూ సెటైరిక్‌గా ట్వీట్ చేశారు. దీనిపై కమల్ హాసన్ దీటుగా బదులిచ్చారు. ఏ బిలియనీర్ అయినా, అది భారతీయుడైనా అమెరికన్ అయినా.. దేశ విధానాలను నిర్దేశించలేరని వ్యాఖ్యానించారు. ప్రతి దేశం తన సొంత ప్రయోజనాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. స్వేచ్ఛా వాణిజ్యం గురించి చెప్పే పశ్చిమ దేశాలు రక్షణాత్మక విధానాలు పాటిస్తున్నాయని కమల్ హాసన్ విమర్శించారు. చైనా ఎలక్ట్రిక్ వాహనాలపై అమెరికా 100 శాతం సుంకాలు విధించి తన దేశీయ పరిశ్రమను కాపాడుకుంటోందని అన్నారు. భారత్ కూడా అదేవిధంగా తన దేశీయ తయారీ రంగాన్ని పరిరక్షించుకోవడానికి చర్యలు తీసుకుంటోందని చెప్పారు. భారత్ ఒక ప్రజాస్వామ్య దేశమని, వలసపాలిత ప్రాంతం (కాలనీ) కాదని వ్యాఖ్యానించారు. తాము ప్రపంచాన్ని స్వాగతిస్తామని, కానీ భారత ప్రజలుగా మా భవిష్యత్తును మేమే నిర్ణయించుకుంటామని కమల్ హాసన్ తన పోస్టులో స్పష్టంచేశారు. కమల్ పోస్టును షేర్ చేస్తూ కంగనా రనౌత్ స్పందించారు. కమల్ కౌంటర్ మస్క్‌కు బాగా తగిలి ఉంటుందని కంగనా తన పోస్టులో పేర్కొన్నారు. ఏ బిలియనీర్ దేశ విధానాలను నిర్దేశించకూడదని కమల్ చాలా స్పష్టంగా, వ్యంగ్యంగా, సూటిగా చెప్పారని ప్రశంసించారు. ఇప్పటికే మస్క్ ఆరోపణలను భారత కమ్యూనికేషన్ల శాఖ నిరాధారమైనవని కొట్టిపారేసింది.

# బంగారంతో.. చైనా మాస్టర్ ప్లాన్!



ప్రపంచవ్యాప్తంగా.. దాదాపు అన్ని దేశాలు తమ ఆర్థిక నిల్వలను బలపరచుకోవడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగానే చైనా బంగారం కొనుగోళ్లను భారీగా పెంచుతోంది. సాధారణంగా మనం బంగారాన్ని ఆభరణాల కోసం.. లేదా పెట్టుబడిగా కొనుగోలు చేస్తాం. కానీ దేశాలు మాత్రం బంగారాన్ని కొనుగోలు చేయడం వెనుక పెద్ద ఆర్థిక వ్యూహం ఉంటుంది. చైనా కేంద్ర బ్యాంకు అయిన పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా (గ్రదీూజ) 2026 సెప్టెంబర్‌లో ఏకంగా 23 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసినట్లు సమాచారం. సెప్టెంబర్ 2023 తర్వాత ఒక నెలలో చైనా కొనుగోలు చేసిన అత్యధిక బంగారం ఇదే కావడం విశేషం. అంతేకాదు.. చైనా వరుసగా 23 నెలల నుంచి బంగారాన్ని భారీగా కొనుగోలు చేస్తూనే ఉంది. జూలై, ఆగస్టు నెలల్లో 20 టన్నుల చొప్పున బంగారం కొనుగోలు చేసిన చైనా.. సెప్టెంబర్‌లో ఆ మొత్తాన్ని 23 టన్నులకు పెంచింది. దీంతో 2026లో ఇప్పటివరకు కొనుగోలు చేసిన బంగారం 103 టన్నులకు చేరినట్లు నివేదికలు చెబుతున్నాయి. ప్రస్తుతం చైనా వద్ద మొత్తం 2,410 టన్నుల బంగారం ఉన్నట్లు తెలుస్తోంది.

**చైనా ఎందుకు భారీగా బంగారం కొనుగోలు చేస్తోంది!**

చైనా భారీగా బంగారం కొనుగోలు చేయడానికి ప్రధాన కారణం.. తన ఆర్థిక నిల్వలను మరింత పెంచుకోవడానికే. ప్రస్తుతం ప్రపంచ దేశాలు తమ విదేశీ నిల్వల్లో ఎక్కువ భాగాన్ని డాలర్లు, ఇతర కరెన్సీలు, ప్రభుత్వ బాండ్ల రూపంలో ఉంచుతాయి. అయితే.. ఒకే కరెన్సీపై ఎక్కువగా ఆధారపడితే, ఆ కరెన్సీ విలువలో మార్పులు వచ్చినప్పుడు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అందుకే.. చైనా తన నిల్వల్లో బంగారం వాటాను గణనీయంగా పెంచుకుంటోంది. బంగారం అనేది ఏ ఒక్క దేశ ప్రభుత్వంపై ఆధారపడని ఆస్తి. ఆర్థిక అనిశ్చితి పెరిగినప్పుడు లేదా అంతర్జాతీయ పరిస్థితులు ప్రతికూలంగా మారినప్పుడు బంగారం ఒక ప్రత్యామ్నాయ నిల్వగా ఉపయోగపడుతుంది.

**ఫ్రాన్స్, ఇటలీలకు దగ్గరవుతున్న చైనా!**

ప్రస్తుతం బంగారు నిల్వల పరంగా చైనా ప్రపంచంలో ఐదో స్థానంలో ఉంది. అమెరికా, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ దేశాలు దాని కంటే ముందున్నాయి. అయితే.. ఇప్పుడు ఈ దేశాలకు, చైనాకు మధ్య ఉన్న అంతరం క్రమంగా తగ్గుతోంది. కొన్ని నివేదికల ప్రకారం.. ఇటలీ వద్ద సుమారు 2,452 టన్నులు, ఫ్రాన్స్ వద్ద 2,437 టన్నుల బంగారం ఉంది. చైనా వద్ద 2,410 టన్నులు ఉన్నాయి. అంటే.. ఫ్రాన్స్‌ను అధిగమించడానికి చైనాకు మరో 27 టన్నులు, ఇటలీని అధిగమించడానికి 42 టన్నులు మాత్రమే అవసరం. ఇదే వేగంతో చైనా బంగారం కొనుగోళ్లను కొనసాగిస్తే.. భవిష్యత్తులో ఫ్రాన్స్, ఇటలీ దేశాలను వెనక్కి నెట్టి ముందుకు వెళ్లే అవకాశం ఉంది. అయితే అది ఎప్పుడు జరుగుతుందనేది చైనా భవిష్యత్తులో చేసే కొనుగోళ్లపై ఆధారపడి ఉంటుంది.

## మస్క్.. ఈ వాస్తవాలు సరిపోతాయా: శ్రీధర్ వెంబు కౌంటర్



ఇంటర్నెట్‌డెస్క్: స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలకు భారత్‌లో అనుమతుల జాప్యంపై మాటల దాడి చేస్తోన్న టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీపై విమర్శలు సంధించిన సంగతి తెలిసిందే. మస్క్ తీరుపై పలువురు ప్రముఖులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు ఎక్స్ వేదికగా సుదీర్ఘ పోస్టు పెట్టారు. ప్రపంచంలోనే అత్యంత తక్కువ డేటా ధరలు ఉన్న దేశం భారత్ అని వ్యాఖ్యానించారు. వాస్తవాలను తెలుసుకోవాలంటూ మస్క్‌కు కౌంటర్ ఇచ్చారు. శ్రీధర్ వెంబు పోస్ట్ ఇలా..

"ప్రపంచంలోనే డేటా ధరలు అత్యంత తక్కువగా ఉన్న దేశం భారత్. నేను ఈ దేశంలో ఎక్కడ పర్యటించినా సరే.. స్థానికంగా ఉన్న వైఫైతో సులభంగా కనెక్ట్ అవుతాను. నా ఫోన్‌లోని డేటాను వాడటం కోసం ఈజీగా కంప్యూటర్‌తో అనుసంధానిస్తాను. భారతీయులు సాధారణంగా డ్యూయల్ సిమ్‌లున్న ఫోన్లు, ధరలు తక్కువగా ఉండటంతో భారీ డేటా ప్లాన్లను ఉపయోగిస్తుంటారు. అంబానీ తీసుకొచ్చిన జియో (జీఱశీ)నే ఇందుకు కారణం.

ప్రపంచంలోనే ఔషధాల ధరలు తక్కువగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. వీటి ధరలు ఇంకా తగ్గుతూనే ఉన్నాయి. భారత్‌ను సందర్శించే ప్రజలు.. ఇక్కడి నుంచి ఔషధాలను తీసుకెళ్తుంటారు.

ప్రపంచంలోనే అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన చెల్లింపుల వ్యవస్థ భారత్‌లోనే ఉంది. మోదీ ప్రభుత్వం గుత్తాధిపత్యాన్ని సహించదు. ప్రధాని స్టార్టప్‌లను ప్రోత్సహించారు. పోటీతత్వ ఆర్థిక వ్యవస్థకు ఇదే మెరుగైన సంకేతం. అమెరికా మార్కెట్లో చైనా ఎలక్ట్రిక్ వాహనాల పోటీ నుంచి టెస్లా కంపెనీకి రక్షణ ఉంది. దీనివల్ల అమెరికాలో ఇతర దేశాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ కార్ల ధరలు ఎక్కువగా ఉంటున్నాయి.

ప్రభుత్వ విధానాల కారణంగానే భారతీయ స్టార్టప్‌లు తక్కువ ఖర్చుతో కూడిన రాకెట్ల తయారీలో పురోగతిని సాధిస్తున్నాయి. అవి స్పేస్‌ఎక్స్‌కు ముప్పుగా పరిణమిస్తున్నాయి. అదేవిధంగా చైనా ఈవీలు టెస్లా (ఠవంశ్రీఱ)కు ముప్పుగా మారాయని చెప్పొచ్చు" అని వెంబు తన పోస్టులో పేర్కొన్నారు. 'ఇవన్నీ వాస్తవాలు ఎలాన్' అంటూ స్పేస్‌ఎక్స్ అధినేతకు కౌంటర్ ఇచ్చారు.

# మళ్లీ పరుగుల వరదేనా? భారత బౌలర్లకు మరో అగ్నిపరీక్ష!

**మూడో టీ20కి ఇండోర్‌లో రంగం సిద్ధం**
**హోప్, రూథర్‌ఫోర్డ్ భీకర ఫామ్**
**శ్రేయస్ అయ్యర్ తిరిగి ఫామ్‌లోకి**
**సంజూ శాంసన్ కూడా సత్తా చాటాడు**
**బౌలర్ల ప్రదర్శనపైనే భారత్ ఆశలు**



భారత్, వెస్టిండీస్ మధ్య మరో హైస్కోరింగ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఇప్పటికే రెండో టీ20లో పరుగుల వరద పారగా.. ఇప్పుడు మూడో టీ20లోనూ బ్యాటర్లదే ఆధిపత్యం కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం చిన్న బౌండరీలు, బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్ ఉండటంతో బౌలర్లకు మరోసారి కఠిన పరీక్ష ఎదురుకానుంది. ఆదివారం రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ జరగనుంది. రాంచీలో జరిగిన రెండో టీ20లో ఇరు జట్లు కలిపి ఏకంగా 501 పరుగులు చేశాయి. తొలుత భారీ స్కోరు చేసిన భారత్‌ను వెస్టిండీస్ దీటుగా ఎదుర్కొంది. 250 పరుగుల లక్ష్యాన్ని మరో ఓవర్ మిగిలి ఉండగానే ఛేదించి సంచలన విజయం సాధించింది. దీంతో భారత బౌలింగ్ వైఫల్యాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. కోచ్ గౌతమ్ గంభీర్ కూడా బౌలర్ల ప్రదర్శనపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇండోర్ పిచ్ కూడా బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుందని అంచనా. చిన్న బౌండరీలకు తోడు మంచు ప్రభావం కూడా మ్యాచ్‌పై కీలక పాత్ర పోషించనుంది. దీంతో బౌలర్లు లైన్ అండ్ లెంగ్త్ తప్పకుండా బంతులు వేయాల్సి ఉంటుంది. ఫీల్డింగ్‌లోనూ చిన్న తప్పిదాలకు అవకాశం ఇవ్వకూడదు.

రాంచీలో భారత పేసర్ మయాంక్ యాదవ్ పవర్‌ప్లేలో మూడు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. అయితే షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ ఇచ్చిన సులభమైన క్యాచ్‌ను వదిలేయడం భారత్‌కు భారంగా మారింది. ఆ సమయంలో 18 బంతుల్లో 38 పరుగులతో ఉన్న రూథర్‌ఫోర్డ్.. ఆ తర్వాత 37 బంతుల్లో 84 పరుగులు చేసి చెలరేగాడు. ఏడు సిక్సర్లు, ఏడు ఫోర్లతో విరుచుకుపడ్డాడు. కెప్టెన్ షాయ్ హోప్‌తో కలిసి 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. హోప్ కూడా అజేయ శతకంతో జట్టును గెలిపించాడు.

ఈ సిరీస్‌లో హోప్ ఇప్పటికే రెండు సెంచరీలు సాధించడంతో భారత బౌలర్లకు అతడిని త్వరగా ఔట్ చేయడం కీలకం. మయాంక్‌కు అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, శివమ్ దూబే, నమన్ ధీర్ నుంచి సహకారం అవసరం.

మరోవైపు భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తిరిగి ఫామ్‌లోకి రావడం జట్టుకు సానుకూలాంశం. ఇండోర్‌లో అజేయంగా 102 పరుగులు చేసిన అతడు.. రాంచీలో 18 బంతుల్లోనే 40 పరుగులు సాధించాడు. వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ కూడా 41 బంతుల్లో 82 పరుగులతో ఫామ్ అందుకున్నాడు. దీంతో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం రావడం కష్టంగా కనిపిస్తోంది.

వెస్టిండీస్ మాత్రం రూథర్‌ఫోర్డ్, హోప్ ఫామ్‌తో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది. రోస్టన్ చేజ్ కూడా రెండో టీ20లో మూడు వికెట్లు తీసి సత్తా చాటాడు. ఈ నేపథ్యంలో మూడో టీ20లో బ్యాటర్ల జోరు కొనసాగుతుందా? భారత బౌలర్లు పుంజుకుంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

**మ్యాచ్ వివరాలు**
**మ్యాచ్:** భారత్--వెస్టిండీస్ మూడో టీ20
**తేదీ:** ఆదివారం, అక్టోబర్ 11
**సమయం:** రాత్రి 7 గంటలకు
**వేదిక:** హోల్కర్ స్టేడియం, ఇండోర్
**ప్రత్యక్ష ప్రసారం:** స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్

## స్పోర్ట్స్

### సెంచరీ దిశగా రహ్మత్ షా.. బంగ్లాకు ధీటుగా బదులిస్తున్న ఆఫ్ఘన్




అబుదాబీ వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్ హోరాహోరీగా సాగుతోంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 346 పరుగులకు ఆలౌట్ కాగా.. ఆఫ్ఘనిస్తాన్ బంగ్లాదేశ్‌కు ధీటుగా బదులిస్తుంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 4 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్, కెప్టెన్ రహ్మత్ షా (84 నాటౌట్) సెంచరీ దిశగా సాగుతున్నాడు. అతడికి జతగా వికెట్‌కీపర్ ఇక్రమ్ అలీఖిల్ (26 నాటౌట్) బ్యాటింగ్ కొనసాగిస్తున్నాడు. అంతకుముందు ఓపెనర్ అబ్దుల్ మలిక్ (62) అర్ధ సెంచరీతో రాణించారు. సెదికుల్లా అటల్ 17, షాహిదుల్లా కమల్ 20, సీనియర్ బ్యాటర్ హష్మతుల్లా షాహిది డకౌటయ్యారు. బంగ్లా బౌలర్లలో ఎబాదత్ హొసేన్ 2, హసన్ మహముద్, మెహిది హసన్ మిరాజ్ తలో వికెట్ పడగొట్టారు. ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు షద్మాన్ ఇస్లాం (67), తంజిద్ హసన్ (83)తో పాటు వికెట్‌కీపర్ లిట్టన్ దాస్ (53) అర్ధ సెంచరీలతో రాణించారు. మొమినుల్ హక్ (39), కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో (29), మెహిది హసన్ మిరాజ్ (24), నయీమ్ హసన్ (35 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. వెటరన్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం, ఎబాదత్ హొసేన్ డకౌట్లు కాగా.. హసన్ మహముద్ 2, తైజుల్ ఇస్లాం 9 పరుగులు చేశారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో మొహమ్మద్ సలీం సఫీ 4, యమిల్ అహ్మద్‌జాయ్ 3, ఇస్మత్ ఆలం 2, ఖైస్ అహ్మద్ ఒక వికెట్ తీశారు.



## గ్యాంగ్‌స్టర్ మోడ్‌లోకి నాని.. సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' షూటింగ్ షురూ!

నేచురల్ స్టార్ నాని వరుస హిట్‌లతో దూసుకుపోతూనే మరోవైపు తన ప్రయోగాత్మక చిత్రాలతో టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. ఇటీవలే ఆయన నటించిన 'ది ప్యారడైజ్' సినిమా నాని కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించి సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ భారీ విజయం అందించిన జోరును ఏమాత్రం తగ్గించకుండా, నాని తన తదుపరి ప్రాజెక్ట్ కోసం వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో నాని ఒక క్రేజీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సిద్ధమయ్యారు. "బ్లడీ రోమియో" అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ మరియు గ్యాంగ్‌స్టర్ లుక్‌లో కనిపించబోతున్నట్లు సమాచారం. కేవలం యాక్షన్ హీరోగానే కాకుండా, ఒక వైవిధ్యమైన చెఫ్ పాత్రలోనూ, అలాగే మరోవైపు పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్‌గానూ ఆయన ద్విపాత్రాభినయం లేదా విభిన్న షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో అదరగొట్టనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాల టాక్. ఈ సినిమా కోసం మేకర్స్ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, అక్టోబర్ 16 లేదా 17 నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టనుంది. తొలి షెడ్యూల్‌లోనే కొన్ని కీలకమైన యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

## ఒక్కో సినిమాకు రూ.8 కోట్లు తీసుకుంటున్నానా .. ప్రచారాలపై శ్రీనిధి శెట్టి క్లారిటీ..!



సినిమా ఇండస్ట్రీలో ఒక భారీ విజయం అందుకున్న తర్వాత హీరోలు, హీరోయిన్ల పారితోషికాలపై రకరకాల వార్తలు ప్రచారంలోకి రావడం సహజం. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటీనటుల రెమ్యునరేషన్లపై అభిమానుల్లో ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. తాజాగా 'కేజీఎఫ్' సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న కన్నడ నటి శ్రీనిధి శెట్టి పారితోషికంపై ఇలాంటి ప్రచారమే తెరపైకి వచ్చింది. ఆమె ఒక్కో సినిమాకు రూ. 7 కోట్ల నుంచి రూ. 8 కోట్ల వరకు తీసుకుంటున్నారంటూ వార్తలు చక్కర్లు కొట్టాయి. తాజాగా ఈ ప్రచారంపై స్పందించిన శ్రీనిధి శెట్టి అసలు విషయాన్ని వెల్లడించారు. శ్రీనిధి శెట్టి ఒక్కో సినిమాకు భారీ మొత్తంలో పారితోషికం డిమాండ్ చేస్తున్నారంటూ వస్తున్న వార్తలను ఆమె ఖండించారు. ఇప్పటివరకు తాను చేసిన సినిమాల సంఖ్యను పరిశీలిస్తే ఇంత భారీ పారితోషికం గురించి జరుగుతున్న ప్రచారం ఆశ్చర్యంగా ఉందని ఆమె పేర్కొన్నారు. కేవలం పుకార్ల ఆధారంగా ఇలాంటి వార్తలను నమ్మవద్దని సూచించారు. సినిమాలను ఎంపిక చేసుకునేటప్పుడు పారితోషికానికే ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆమె స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. తనకు నచ్చిన కథ, అందులో తన పాత్రకు ఉన్న ప్రాధాన్యం, సినిమా నాణ్యత వంటి అంశాలనే ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటానని వెల్లడించారు. 'కేజీఎఫ్' చిత్రాలతో భారీ విజయాన్ని అందుకున్న తర్వాత వరుసగా ఎక్కువ సినిమాలు చేసుకుంటూ వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, తాను అలా చేయలేదని శ్రీనిధి శెట్టి అభిప్రాయపడింది. డబ్బు సంపాదించడమే లక్ష్యమైతే ఆ సినిమా విజయాన్ని ఆసరాగా చేసుకుని అనేక ప్రాజెక్టులకు అంగీకరించి ఉండేదాన్నని పేర్కొంది.

## ఇతరుల జీవితాలపై కామెంట్స్ చేయడానికి మీరెవరు.. మృణాల్ ఠాకూర్ సీరియస్



సినీ తారల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు, రూపురేఖలపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేయడం ఈ మధ్యకాలంలో ఎక్కువైంది. ముఖ్యంగా హీరోయిన్లు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్, ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై పలువురు సినీ ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బాలీవుడ్ నటి, 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ కూడా ఇదే అంశంపై ఘాటుగా స్పందించారు. కత్రినా కైఫ్, కృతి సనన్‌లను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న విమర్శలను తప్పుబడుతూ, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను గౌరవించాలని హితవు పలికారు. తన తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మృణాల్ ఠాకూర్ ఆన్‌లైన్ ట్రోలింగ్ గురించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా గడిపే హక్కు ఉంటుందని, ఇతరుల వ్యక్తిగత నిర్ణయాలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని ఆమె అభిప్రాయపడ్డారు. కత్రినా కైఫ్, కృతి సనన్ వంటి నటీమణులు సినిమా రంగానికి ఎంతో సేవ చేశారని, అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. వారి విజయాలను, కష్టాన్ని మరిచిపోయి చిన్న చిన్న విషయాలపై విమర్శలు చేయడం సరికాదని అన్నారు. ప్రతి అంశంలోనూ ఇతరులను తప్పుపట్టడం మానుకోవాలని, సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే జనాలకు పిచ్చి పట్టినట్టుగా అనిపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇటీవల కత్రినా కైఫ్ ఓ వేడుకలో పాల్గొన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆ ఫొటోల్లో ఆమె శారీరక రూపురేఖలపై కొందరు నెటిజన్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తల్లి అయిన తర్వాత శరీరంలో సహజంగా వచ్చే మార్పులను కూడా కొందరు విమర్శించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఒక మహిళ శరీరంలో వచ్చే మార్పుల ఆధారంగా ఆమెను అంచనా వేయడం, బహిరంగంగా అవమానించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఈ ఘటనతో మరోసారి తెరపైకి వచ్చాయి. మరోవైపు, నటి కృతి సనన్ కూడా ఓ ప్రకటనలో ధరించిన దుస్తుల కారణంగా విమర్శలు ఎదుర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా విడుదలైన ఓ నగల ప్రకటనలో ఆమె ధరించిన దుస్తులపై కొందరు నెటిజన్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఆ దుస్తులు పండుగ సందర్భానికి తగినవి కావంటూ విమర్శలు రావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ వివాదం నేపథ్యంలో సదరు ప్రకటనను తొలగించారు.. తన ఉద్దేశం ఎవరి మనోభావాలను దెబ్బతీయడం కాదని కృతి సనన్ వివరణ ఇచ్చింది. కాగా, సామాజిక మాధ్యమాల్లో మహిళలతో పాటు పురుషులు కూడా ఇలాంటి విమర్శలను ఎదుర్కొంటున్నారని మృణాల్ ఠాకూర్ అభిప్రాయపడ్డారు. అయితే మహిళల దుస్తులు, శరీరాకృతి, వ్యక్తిగత నిర్ణయాలపై తరచూ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం ఆందోళన కలిగిస్తుంది.



## ఢిల్లీ హైకోర్టులో విజయ్ దేవరకొండకు ఊరట.. వ్యక్తిగత హక్కులకు రక్షణ కల్పిస్తూ కోర్టు తీర్పు

నటుడు విజయ్ దేవరకొండకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన అనుమతి లేకుండా పేరు, ఫొటోలు, గొంతు మరియు ఇతర వ్యక్తిగత హక్కులను (ౡవతీంశీఞశ్రీతీఎ =అస్త్రప్రం) అనధికారికంగా ఇతరులు వాడకుండా ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), డీప్‌ఫేక్స్ మరియు ఫేస్-మార్ఫింగ్ టెక్నాలజీలను ఉపయోగించి ఆయనను అశ్లీల లేదా అసభ్యకర రీతిలో చిత్రీకరిస్తున్న కంటెంట్‌పై కోర్టు తీవ్రంగా స్పందించింది. న్యాయమూర్తి జస్టిస్ వికాస్ మహాజన్ ఈ ఆదేశాలు జారీ చేస్తూ.. మెటా (వీమ్హు), గూగుల్ ఎక్స్ (శ) వంటి సోషల్ మీడియా సంస్థలు నటుడు గుర్తించిన అక్రమ కంటెంట్, వీడియోలు, రీల్స్, పోస్టులు మరియు అకౌంట్‌లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అలాగే, ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లు సంబంధిత లింక్‌లను 72 గంటల్లోగా టేకడౌన్ చేయాలని స్పష్టం చేశారు. విజయ్ దేవరకొండ తన పేరు (విజయ్ దేవరకొండ, విజయ్ సాయి దేవరకొండ), 'ఎఐ' అనే ఇనిషియల్స్, సిగ్నేచర్లు, వాయిస్ రికార్డింగ్‌లు, ఫ్యాషన్ స్టైల్, సినిమా స్టిల్స్ వంటి వాటిని వాణిజ్యపరంగా ఎవరూ దుర్వినియోగం చేయకుండా రక్షణ కోరుతూ కోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయనకు ఎంతో ఇష్టమైన "రౌడీ" (=శీషఎఎ) అనే పేరును కేవలం ఒంటరిగా వాడడంపై మాత్రం కోర్టు ఎక్స్-పార్టీ ఇంజంక్షన్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఆ పేరు ఆయనకు మాత్రమే ప్రత్యేకంగా చెందుతుందని నిరూపించే తగిన సాక్ష్యాధారాలు అవసరమని కోర్టు పేర్కొంది. అదే సమయంలో, "రౌడీ" అనే పదాన్ని విజయ్ ఏఐ లేదా మార్ఫ్ ఇమేజ్‌లతో కలిపి వాడితే మాత్రం అది ఆయన వ్యక్తిగత హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని స్పష్టం చేసింది. ఈ కేసు విచారణను డిసెంబర్ 3కి మరియు తదుపరి విచారణను ఫిబ్రవరికి వాయిదా వేస్తూ, ప్రతివాదులు నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.



## 'ప్రేమద ఊరాలి' సంచలనం

## రూ.2 కోట్ల బడ్జెట్‌తో సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.50 కోట్ల వసూళ్లు..

సినిమా బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే మాటను మరోసారి నిజం చేస్తోంది కన్నడ చిత్రం 'ప్రేమద ఊరాలి'. విడుదలకు ముందు పెద్దగా అంచనాలు లేకుండా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. భారీ ప్రచారం, స్టార్ హీరోలు, భారీ బడ్జెట్ లేకుండానే కేవలం కంటెంట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వసూళ్లలో దూసుకుపోతోంది. కేవలం రూ. 2 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం త్వరలోనే కర్ణాటకలో రూ. 50 కోట్ల వసూళ్ల మార్కును అందుకోనుందని ట్రేడ్ వర్గాల అంచనా. 'ప్రేమద ఊరాలి' సినిమా విడుదలైన తొలిరోజుల్లో బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ప్రేక్షకుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు లేకపోవడంతో మొదట్లో వసూళ్లు కూడా నెమ్మదిగానే సాగాయి. అయితే సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మౌత్ టాక్ బలపడటంతో రోజురోజుకూ థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు ఈ సినిమాకు అండగా నిలుస్తుండటం విశేషం. కథలోని భావోద్వేగాలు, కుటుంబ సంబంధాల చుట్టూ సాగే సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో తొలి రోజుల్లో నెమ్మదిగా సాగిన వసూళ్లు క్రమంగా పుంజుకుని ఇప్పుడు భారీ స్థాయికి చేరుకుంటున్నాయి. 'ప్రేమద ఊరాలి' ఒక సాధారణమైన కథను గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రం. కుటుంబ సంబంధాలు, మనుషుల మధ్య అనుబంధాలు, భావోద్వేగాలకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చారు. భారీ యాక్షన్ సన్నివేశాలు లేదా అద్భుతమైన విజువల్ హంగుల కంటే కథలోని సహజత్వం, పాత్రల మధ్య భావోద్వేగాలే సినిమాకు ప్రధాన బలంగా నిలిచినట్లు తెలుస్తోంది. ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి భారీ బడ్జెట్ తప్పనిసరి కాదని, మంచి కథతోనూ విజయాన్ని అందుకోవచ్చని ఈ సినిమా నిరూపిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కుటుంబమంతా కలిసి చూసే సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ ఎలా ఉంటుందో 'ప్రేమద ఊరాలి' విజయ ప్రయాణం మరోసారి చాటిచెబుతోంది. ఈ సినిమా వసూళ్ల గురించి చర్చ జరుగుతున్న సమయంలో అందరినీ ఆశ్చర్యపరుస్తున్న విషయం దాని నిర్మాణ వ్యయం. 'ప్రేమద ఊరాలి' కేవలం రూ. 2 కోట్ల బడ్జెట్‌తో రూపొందినట్లు సమాచారం. అలాంటి చిన్న బడ్జెట్ చిత్రానికి రూ. 50 కోట్ల వసూళ్లు సాధించే స్థాయిలో ఆదరణ లభించడం విశేషంగా మారింది.

# ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా భారత్

దేశాభివృద్ధనే మంత్రంగా తీసుకొని ముందుకు సాగుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా భారత్ మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2014 నుంచి మన ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 11 రెట్లు పెరిగాయని కొనియాడారు. రక్షణ పరికరాల తయారీలో స్వయం సమృద్ధి సాధిస్తున్నామని తెలిపారు. 12 ఏళ్లలో అనేక రంగాల్లో మార్పులు తెచ్చినట్లు చెప్పారు. తయారీ రంగంలో వృద్ధి వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయని వివరించారు. తమిళనాడు అభివృద్ధికి అండగా ఉండటంతో పాటు విజయ్ ప్రభుత్వానికి చేయూత అందిస్తామన్నారు. చెన్నైలో రూ.13 వేల కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 2014లో 5 నగరాలకే పరిమితమైన మెట్రో రైలు సేవలు ఇప్పుడు 25 నగరాలకు విస్తరించాయని గుర్తు చేశారు. ప్రభుత్వ అధినేతగా తన 25 ఏళ్ల సుదీర్ఘ సేవాకాలాన్ని ప్రధాని మోదీ ప్రస్తావించారు. "కొన్ని రోజుల క్రితం మీ అందరి ఆశీస్సులతో ప్రభుత్వాధినేతగా నేను 25 ఏళ్ల ముఖ్యమైన మైలురాయిని పూర్తి చేశాను. నేనెప్పుడు కూడా రాష్ట్ర అభివృద్ధి ద్వారానే దేశ అభివృద్ధి జరుగుతుందనే మంత్రాన్ని పాటిస్తూ ముందుకు సాగాను. ఒక ముఖ్యమంత్రిగా రాష్ట్రాల అంచనాలను నేను స్వయంగా అర్థం చేసుకున్నాను. ప్రధానమంత్రి అయిన తర్వాత ఆ ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రయత్నించడం సహా ప్రతి రాష్ట్రం తమ లక్ష్యాలను చేరుకునేలా కృషి చేశాను. దేశాన్ని బలోపేతం చేయాలంటే రాష్ట్రాలను బలోపేతం చేయడం అవసరం. అందుకే కేంద్ర ప్రభుత్వం తమిళనాడు వంటి రాష్ట్రాల్లో తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' లేదా 'వోకల్ ఫర్ లోకల్' వంటి కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల వల్ల తమిళనాడుకు కూడా ప్రయోజనం చేకూరుతోంది. తమిళనాడు అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా అండగా



ఉంటుంది. విజయ్ ప్రభుత్వానికి కేంద్రం చేయూత అందిస్తోంది. దేశ తయారీరంగం అభివృద్ధిలో తమిళనాడు పాత్ర ఎంతో ఉంది. తయారీ రంగంలో తమిళనాడు మిగతా రాష్ట్రాల కంటే ముందుంది. తమిళనాడు అభివృద్ధిని చూసి కేంద్రం గర్విస్తోంది. పరిశ్రమలు, రవాణారంగం హబ్‌గా తమిళనాడు తయారవుతోంది. రాష్ట్రాలు శరవేగంగా అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యం. తమిళనాడుకు వచ్చే ప్రాజెక్టుల వల్ల వేలమంది యువతకు ఉపాధి లభిస్తోంది.

పార్టీలకు అతీతంగా తమిళనాడు నాయకత్వంతో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. సంవత్సరాలు గడిచినా, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా, రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తన నిబద్ధత స్థిరంగా ఉందన్నారు. "ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరుణానిధి, జయలలితతో మాట్లాడే అవకాశాలు చాలాసార్లు నాకు లభించాయి. నేను ప్రధానమంత్రి అయిన తర్వాత జయలలిత, పన్నీర్‌సెల్వం, పళనిస్వామి, ఎం.కె. స్టాలిన్‌లతో కలిసి పనిచేసే అవకాశం దక్కింది. ప్రభుత్వాలు మారినప్పటికీ, తమిళనాడును అభివృద్ధి చేయాలనే, ఇక్కడి ప్రజలకు సేవ చేయాలనే నా సంకల్పం మాత్రం అలాగే ఉంది. ఇప్పుడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌తో కలిసి ఈ ప్రయాణాన్ని ముందుకు సాగిస్తున్నాం." అని అన్నారు.

"పట్టణీకరణ అనేది ఒక సవాలు కాదని, అది ఒక అవకాశమని నేను ఎప్పుడూ నమ్ముతాను. ఇందులో ప్రజా రవాణా కీలక పెద్ద పాత్ర పోషిస్తుంది. మెరుగైన రవాణా వ్యవస్థ కోసం కేవలం రోడ్ల వెడల్పు చేస్తే సరిపోదు. ఆధునిక నగరాలకు సమగ్రమైన మౌలిక సదుపాయాలు అవసరం. అందుకే గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా మెట్రో నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించాం. 2014లో దేశంలోని 5 నగరాల్లో మాత్రమే మెట్రోలు నడిచేవి. ఈరోజు దేశవ్యాప్తంగా 25 నగరాల్లో మెట్రో సేవలు అందుబాటులో ఉన్నాయి."

**సీఎం విజయ్‌తో కలిసి మెట్రోలో ప్రధాని ప్రయాణం**

అంతకుముందు 13 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. చెన్నై విమానాశ్రయంలో దిగిన ప్రధానికి గవర్నర్ అర్లేకర్, సీఎం విజయ్ ఘన స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ వెలుపల ప్రధాని కాసేపు రోడ్‌షో నిర్వహించి కార్యకర్తలకు అభివాదం చేశారు. అనంతరం 4వేల 900 కోట్లతో నిర్మితమైన చెన్నై మెట్రో ఫేజ్-2లోని పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని ప్రారంభించారు. స్వయంగా ఖూ× చెల్లింపు చేసి టికెట్ తీసుకున్న మోదీ, పోరూర్ నుంచి పూనమల్లి బైపాస్ స్టేషన్ వరకు విజయ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు.

**ఐఐటీ మద్రాస్‌లో బ్రెయిన్ సెంటర్ జాతికి అంకితం**

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 3వేల 700 కోట్లతో చీ౨-744, చీ౨-83 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. పలు రైల్వే లైన్లు సహా పోర్టుల సామర్థ్యాలను పెంచే ప్రాజెక్టులు, అలాగే ఆధునికీకరించిన 5 అమృత్ భారత్ స్టేషన్లను ప్రారంభించారు. ఐఐటీ మద్రాస్‌లో సుధా గోపాలకృష్ణన్ బ్రెయిన్ సెంటర్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని, మనిషి మెదడుకు సంబంధించిన 3ఱ అట్లాస్ మిషన్‌ను, స్ట్రోక్ అట్లాస్‌ను ఆవిష్కరించారు. చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయ స్వర్ణోత్సవ వేడుకల్లోనూ ప్రధాని పాల్గొన్నారు.

# ఆ చట్టాన్ని సవరించాల్సిందే

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) సంస్కరణలపై రాజ్యసభ ఎంపీ ముకుల్ వాస్నిక్ నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ కీలక సిఫార్సులు చేసింది. కీలకమైన పోటీ పరీక్షలు జరిగే రోజుల్లో ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు లేదా బహిరంగ సభలకు జిల్లా యంత్రాంగాలు అనుమతులు ఇవ్వకూడదని తెలిపింది. దీనివల్ల పరీక్షలకు ముందుగానే సజావుగా ట్రాఫిక్, శాంతిభద్రతల ఏర్పాట్లు ఉండేలా చూడటంతో పాటు, బాహ్య అవాంతరాల వల్ల ఏ అభ్యర్థి కూడా ప్రభావితం కాకుండా చూసుకోవచ్చని అభిప్రాయపడింది. రాజ్యసభ ఎంపీ ముకుల్ వాస్నిక్ నేతృత్వంలోని విద్యా, మహిళా, శిశు, యువజన, క్రీడల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో సంస్కరణలు, దాన్ని బలోపేతం చేయడం' అనే అంశంపై రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు నివేదికను సమర్పించింది. 'కీలకమైన పరీక్షల జరిగే రోజు బహిరంగ సభలు, ఊరేగింపులు, ర్యాలీల వంటివి అభ్యర్థులకు ఇబ్బందులు కలిగిస్తాయి. దీంతో వారు ఎగ్జామ్‌కు లేట్ అయ్యి రిపోర్టింగ్ టైమ్‌కు పరీక్ష కేంద్రానికి వెళ్లలేకపోవచ్చు. అందుకే పరీక్షల రోజున ఎలాంటి ర్యాలీ, ఊరేగింపు లేదా ఇతర బహిరంగ సమావేశాలకు జిల్లా యంత్రాంగాలు అనుమతి ఇవ్వకూడదు. ఎగ్జామ్స్ నాడు ర్యాలీలు, ఊరేగింపులను నిషేధించే అధికారాన్ని జిల్లా యంత్రాంగాలకు ఇచ్చేందుకు వీలుగా 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్- 2024'ను సవరించాలి' అని ఎన్‌టీఏ సంస్కరణలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొంది.

**'ఇన్విజిలేషన్ ఫార్మాలిటీల కోసం 15 నిమిషాల అదనపు సమయం'**

చిన్నపాటి ఆలస్యం వల్ల సంవత్సర కాలం పాటు కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తు నాశనం కాకూడదని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అభిప్రాయపడింది. 'ఆలస్యంగా వచ్చే అభ్యర్థుల నుంచి డిక్లరేషన్ తీసుకొని



కేవలం మిగిలిన సమయానికి మాత్రమే పరీక్ష రాయనివ్వాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థికి అదనపు సమయం ఇవ్వకూడదు. పరీక్ష జరుగుతున్న సమయంలో ఇన్విజిలేటర్లు సంతకాలు తీసుకోవడం, ఇతర తనిఖీ ప్రక్రియలు చేయడం వల్ల విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతింటుంది. అందుకే అభ్యర్థులకు ఎలాంటి అంతరాయం కలగకుండా పరీక్షా సమయం మధ్యలో కాకుండా ఎగ్జామ్‌కు ముందు లేదా తర్వాత ఇన్విజిలేషన్ ఫార్మాలిటీల కోసం ప్రత్యేకంగా 15 నిమిషాల సమయాన్ని కేటాయించాలి' అని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సులు చేసింది.

**మోదీ సర్కార్ అహంకారం వీడాలి : కాంగ్రెస్**

అయితే, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికపై కాంగ్రెస్ స్పందించింది. అహంకారం వీడి, విద్యా సంస్కరణలపై పార్లమెంట్ కమిటీ నివేదికను మోదీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని సూచించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో అవకతవకలు, నిర్మాణాత్మక లోపాలు ఉన్నాయని ఆరోపించింది. 3నెలల క్రితం ఎన్‌టీఏ అంశం ఒక యువజన నిరసన ఉద్యమానికి దారితీసిందని, అయితే ఇప్పుడు జ్ఞానేశ్ కుమార్ వివాదం దానిని కప్పివేస్తోందని విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. 'ఇప్పుడు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వివాదం వార్తల్లో ఆధిపత్యం చెలాయిస్తోంది. కానీ మూడు నెలల క్రితం ఎన్‌టీఏ వివాదం యువజన నిరసన ఉద్యమానికి నాంది పలికింది. ఎన్‌టీఏ సంస్కరణలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన సూచనలను మాజీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తోసిపుచ్చారు. మోదీ ప్రభుత్వం తనకు ఉన్న కొద్ది సమయంలో అహంకారాన్ని వీడి, ఈ నివేదికను సీరియస్‌గా తీసుకుంటుందని ఆశిస్తున్నాం. మాకు తెలిసినంత వరకు ఎన్‌టీఏ నిర్వహించిన పరీక్షలలో 9 పేపర్ లీక్‌లు, అవకతవకలు జరిగాయి. అసలు ఏం తప్పు జరిగిందో అంగీకరించడానికి కూడా విద్యా మంత్రిత్వ శాఖ నిరాకరిస్తున్నప్పుడు పేపర్ లీకేజీపై నిష్పక్షపాత విచారణకు లేదా జవాబుదారీతనంపై ఇంకేం ఆశ ఉంటుంది?' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు.

**ఎన్‌టీఏ వ్యాపార సంస్థగా మారిపోయింది**

ఎన్‌టీఏ 'సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్- 1860' కింద ఒక సొసైటీగా నమోదైందని జైరాం రమేశ్ చెప్పారు. ఇది పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పాటైన చట్టబద్ధమైన సంస్థ కాదన్నారు. అందువల్ల ఎన్‌టీఏ జవాబుదారీతనం, పార్లమెంటరీ పర్యవేక్షణ పరిమితంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఎన్‌టీఏ నిర్మాణం, రూపకల్పన పారదర్శకంగా లేవని ఆరోపించారు. పైగా ఇవి పేపర్ లీక్ మాఫియాకు అనుకూలంగా ఉన్నాయని విమర్శించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కేవలం ఆర్థిక లాభాలు ఆర్జించే వ్యాపార సంస్థగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. నిధులను విద్యార్థులకు సాయం చేయడానికి, పరీక్షల నిర్వహణకు సంబంధించిన మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడానికి వినియోగించడానికి బదులుగా రూ. 590 కోట్ల మిగులు ఆదాయాన్ని వడ్డీ కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడి పెట్టిందని మండిపడ్డారు.

# ప్రభుత్వం భయపడుతోంది

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తాము చేస్తున్న శాంతియుత నిరసనలను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, అందుకే ఈ పోరాటాన్ని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంగా మార్చుకుందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తీవ్రంగా ఆరోపించింది. ముందస్తు అరెస్టు కింద అదుపులోకి తీసుకున్న తర్వాత విడుదలైన కొన్ని గంటలకే, సీజేపీ సహ కన్వీనర్ అశు తోష్ రంకా ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా అశుతోష్ రంకా మాట్లాడుతూ, "గత 72 గంటల్లో దేశం తీవ్రమైన అరాచక పాలనను చూసింది. నిర్దేశిత ప్రాంతంలో శాంతియుతంగా నిరసన తెలియజేయాలనుకున్న వేలాది మందిని దేశవ్యాప్తంగా అదుపులోకి తీసుకున్నారు. నిన్న మమ్మల్ని విమానం నుంచి కిడ్నాప్ చేసినంత పని చేశారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, మేము మా తల్లిదండ్రుల నుంచి విన్న 1975 ఎమర్జెన్సీ కథలను కూడా ఈ 72 గంటల పరిణామాలు మించిపోయాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా వల్లే ఈ దుస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. "ఒక విషయం స్పష్టమైంది. ఎన్నికల సంఘం, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ పోరాటాన్ని ప్రధాని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంగా మార్చారు" అని ఆయన పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం, పూర్తిగా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాల కనుసన్నల్లోనే పనిచేస్తోందని, కేవలం బీజేపీని ఎన్నికల్లో గెలిపించడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కుటుంబంలో జరిగిన విషాదం పట్ల ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై అశుతోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అభిజీత్ నాయనమ్మ మరణవార్త తెలిసినప్పుడు కూడా ఢిల్లీ పోలీసులు అత్యంత అమానవీయంగా ప్రవర్తించారని, కెమెరాలు, మైక్రోఫోన్లతో వచ్చి ఆ విషాదాన్ని కూడా ఒక ప్రదర్శనగా మార్చడానికి ప్రయత్నించారని ఆరోపించారు. "తన తల్లిదండ్రులు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, వారికి సులభంగా ఆందోళన కలుగుతుందని, అందుకే తన కజిన్‌తో మాట్లాడనివ్వాలని అభిజీత్ వేడుకున్నా ఢిల్లీ పోలీసులు కనికరించలేదు" అని రంకా తెలిపారు. తాను తన నాయనమ్మ అంత్యక్రియల కోసం మహారాష్ట్రలోని సొంత ఊరికి వెళుతున్నానని, అయితే సీజేపీ వెనక్కి తగ్గదని, బెదిరింపులకు భయపడదని అభిజీత్ దిప్కే స్పష్టం చేశారు. అభిజీత్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ దుఃఖ సమయంలో తామంతా అతడికి అండగా నిలుస్తామని రంకా అన్నారు. ఈ పోరాటంలో తమకు మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నేతలకు సీజేపీ కృతజ్ఞతలు తెలిపింది. "నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, మాణిక్ సర్కార్, పినరయి విజయన్ వీధుల్లోకి వచ్చి యువతతో కలిసి నిలబడటం ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి వారు చేస్తున్న పోరాటానికి నిదర్శనం. వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు" అని రంకా పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ వంటి వామపక్ష విద్యార్థి సంఘాల సభ్యులను కూడా పోలీసులు అత్యంత క్రూరంగా అదుపులోకి తీసుకున్నారని ఆయన ఆరోపించారు. "ఈ పోరాటం ఇప్పుడే మొదలైంది. దీనిని ఒక యుద్ధంగా మార్చినందుకు ప్రభుత్వం సిగ్గుపడాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.

**జ్ఞానేశ్ కుమార్‌కు ఏమైనా రహస్యాలు తెలుసా? అందుకే కాపాడుతున్నారా?**

ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సీజేపీ చేపట్టిన నిరసనలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతలు దారితీశాయి. ఈ నిరసనలను అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం నక్సల్ ప్రభావిత, సరిహద్దు ప్రాంతాల నుంచి భద్రతా దళాలను ఢిల్లీకి తరలించిందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆదివారం ఆరోపించింది. ఢిల్లీని ఓ కంటోన్మెంట్‌గా మార్చేశారని తీవ్రంగా విమర్శించింది. నివారణ అరెస్టు తర్వాత కోర్టు నుంచి విడుదలైన సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడారు. "ఒక్క వ్యక్తిని కాపాడేందుకు దేశంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను ఎందుకు కాపాడుతున్నారు? 2024 ఎన్నికలకు సంబంధించి లేదా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగిన తీరుపై ఆయనకు ఏమైనా రహస్యాలు తెలుసా?" అని సౌరవ్ దాస్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. సీఈసీ రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని, ఈ నిరసనల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. "గత కొన్ని రోజులుగా ఢిల్లీ నగరాన్ని మొత్తం ఓ కంటోన్మెంట్‌గా మార్చేశారు. నిరసనలను అడ్డుకునేందుకు నక్సల్ ప్రాంతాలు, బెంగాల్, కశ్మీర్ నుంచి ప్రత్యేక దళాలను, సరిహద్దుల నుంచి బీఎస్ఎఫ్ సిబ్బందిని విమానాల్లో తరలించారు. దాదాపు 30,000 నుంచి 40,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు" అని ఆరోపించారు.

## ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్ల ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది

**సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు**

వాదనలు విన్న తర్వాత సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి, దిల్లీ పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. 'దిల్లీలో నిలిపివేసిన ఇంటర్నెట్ సేవలను వెంటనే పునరుద్ధరించాలి. ఎలాంటి ఆంక్షలు లేకుండా మెట్రో రైలు సేవలలను యథావిధిగా నడపాలి. లాయర్ల విధులకు అడ్డంకులు సృష్టించకూడదు. ఓ ఒక్క న్యాయవాదిని వృత్తిపరమైన బాధ్యతలు నిర్వర్తించకుండా అడ్డుకోవడానికి వీలు లేదని' సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాగే దిల్లీ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అనవసరమైన బారికేడ్లను వెంటనే తొలగించాలని స్పష్టం చేసింది. అంతేకాదు, 'అక్టోబర్? 10న ఏ ఆంక్షలు విధించారు ఎందుకు విధించారు అనే దానిపై వచ్చే వారం పూర్తి వివరాలతో వివరణాత్మక అఫిడవిట్ దాఖలు చేయాలని' కేంద్రాన్ని ఆదేశించింది.

**ఇంతకీ ఏం జరిగింది?**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎస్ఐఆర్ ప్రక్రియపై, ఫారమ్ 6పై ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆజ్ఞలతో ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారని విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన సీఈసీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు మరికొన్ని విద్యార్థి సంఘాలు జంతర్ మంతర్? వద్ద నిరసనలకు పిలుపునిచ్చాయి. దీనితో దిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ముంబయి నుంచి దిల్లీ బయలుదేరిన అభిజీత్ దీప్కేతోపాటు, పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## నిరుద్యోగులకు శుభవార్త..

## రైల్వేలో 3,548 ఉద్యోగాలకు నోటిఫికేషన్

భారతీయ రైల్వే నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. నాన్-టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (చీూజ - గ్రాడ్యుయేట్) కింద 3,548 ఉద్యోగాల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. రైల్వే కార్యకలాపాలు, పరిపాలనలోని వివిధ విభాగాల్లో పనిచేసేందుకు గ్రాడ్యుయేట్లకు ఇది ఒక గొప్ప అవకాశమని ప్రకటనలో పేర్కొంది. ఈ రిక్రూట్‌మెంట్ ద్వారా మొత్తం నాలుగు కేటగిరీలలో పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో అత్యధికంగా 2,750 గూడ్స్ ట్రైన్ మేనేజర్ పోస్టులు ఉండగా, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులు 371, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్ పోస్టులు 300, చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్ పోస్టులు 127 ఉన్నాయి. కమర్షియల్, ట్రైన్ ఆపరేషన్స్, అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో ఈ నియామకాలు చేపట్టనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడవ కేంద్ర వేతన సంఘం (7వ జూజ) సిఫార్సుల ప్రకారం వేతనాలు ఉంటాయి. చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్ పోస్టుకు పే లెవల్ 6 కింద రూ.35,400 ప్రారంభ మూల వేతనం లభిస్తుంది. మిగిలిన మూడు కేటగిరీల (గూడ్స్ ట్రైన్ మేనేజర్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్, సీనియర్ క్లర్క్) పోస్టులకు పే లెవల్ 5 కింద రూ.29,200 ప్రారంభ మూల వేతనం ఉంటుంది. వీటికి అదనంగా ఇతర అలవెన్సులు కూడా వర్తిస్తాయి. అక్టోబర్ 8న ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ, నవంబర్ 6 రాత్రి 11:59 గంటలకు ముగుస్తుంది. పరీక్ష ఫీజు చెల్లించడానికి నవంబర్ 8 చివరి తేదీ కాగా, దరఖాస్తులో మార్పులు చేసుకునేందుకు నవంబర్ 9 నుంచి 18 వరకు అవకాశం కల్పించారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2027 జనవరి 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి. నిబంధనల ప్రకారం రిజర్వ్ కేటగిరీల అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి. రెండు దశల కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అయితే, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్, సీనియర్ క్లర్క్ పోస్టులకు తప్పనిసరి అయిన కంప్యూటర్ బేస్డ్ టైపింగ్ స్కిల్ టెస్ట్‌ను ఈసారి మినహాయించినట్లు రైల్వే తెలిపింది. ఉద్యోగంలో చేరిన తర్వాత వారి టైపింగ్ నైపుణ్యాన్ని పరిశీలిస్తారని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఖాళీల పూర్తి వివరాలు, అర్హతలు, రిజర్వేషన్ల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ rrb.indianrailways.gov.in ను సందర్శించాలని రైల్వే శాఖ సూచించింది.

## దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. ఓట్ల చోరీ చేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం (ఈసీ) స్వయం ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించింది. మోదీ, షా కలిసి దేశంలో ప్రజాస్వామ్య నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించింది. దేశంలో ప్రస్తుతం అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని విమర్శించింది. నిరసనకారులను అణచివేయడానికి దిల్లీలో ఏకంగా సుమారు 32,000 మంది పోలీసులను మోహరించారంటేనే, మోదీ ప్రభుత్వంలో ఎంతటి భయం దాగి ఉందో అర్థమవుతోందని ఎద్దేవా చేసింది. ఆదివారం బెంగళూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మోదీ సర్కార్?పై తీవ్ర ఆరోపణలు చేశారు.

**'ఈసీ వ్యవహారంపై సీజేఐకు లేఖ రాశాం'**

ఈసీ నిర్ణయాలు, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై ఎన్నికల కమిషనర్ల వ్యక్తం చేసిన అభ్యంతరాలను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై సీజేఐకు లేఖ రాసినట్లు వివరించారు. సోమవారం సాయంత్రం రాహుల్ గాంధీ సహా ఇతర కీలక నేతలతో కలిసి సీజేఐను కలవనున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఖర్గే వెల్లడించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగబద్ధమైన సంస్థ. స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలదు. అయినప్పటికీ, మిగిలిన ఇద్దరు కమిషనర్లను జ్ఞానేశ్? కుమార్ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోనివ్వడం లేదు. అంతేకాదు, ఎన్నికల సంఘంలో జరుగుతున్న అవకతవకల గురించి మిగిలిన ఇద్దరు ఈసీ కమిషనర్లు బహిర్గతం చేశారు. కానీ, అందుకు సంబంధించి కేంద్రం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదంతా అధికార పార్టీకి ఎన్నికల్లో లబ్ధి చేకూర్చేందుకు ఆ సంస్థను దెబ్బతీస్తున్నారు." 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని మల్లిఖార్జున ఖర్గే తప్పుపట్టారు. ఈ చట్టం ద్వారా భారత రాష్ట్రపతికి గానీ, ప్రధాన న్యాయమూర్తికి గానీ, లేని వినూత్నమైన మినహాయింపులను, రక్షణలను కేవలం ఒక్క చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు మాత్రమే ఎందుకు కల్పించారని ప్రశ్నించారు. సీఈసీ చేసే తప్పులకు జీవితాంతం ఎలాంటి శిక్షలు లేకుండా మినహాయింపు ఇవ్వడం వెనుక పెద్ద కుట్ర అని ఆరోపించారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137